సంపుటి : 78 సంచిక : 20 పుటలు : 52

జాగృతి

కలి 5127 - శ్రీ విశ్వావసు ఫాల్గుణ శుద్ధ చతుర్దశి
02-08 మార్చి 2026
వెల : ₹20/-

బాన్సువాడా? బాంగ్లాదేశా?

కామారెడ్డి హింసకు కారకులెవరు?

విషసర్పంలా విజృంభిస్తున్న మజ్లిస్

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

మహాశివరాత్రి పర్వదిన వేడుకలు దేశమంతా భక్తి ప్రపత్తులతో జరిగాయి.
కళలకు ఆద్యుడుడైన పరమేశ్వరుని అంతే కళాత్మకంగా ఆరాధించారు.

భారత మండపం, ఢిల్లీ

వారణాసి

VIDYA BHARATI VIGNANA KENDRA

(A CBSE School run by Sri Saraswati Vidya Peetham)

Nadergul, Badangpet Municipality - 501510

Empowering Minds, Nurturing Hearts

HOSTEL FACILITY AVAILABLE FOR BOYS
FROM GRADE - IV ONWARDS

PANCHAKOSHIYA VIKAS



ADMISSIONS OPEN FOR AY 2026 - 2027

SCHOOL FEATURES:

- *13 Acres of pristine playgrounds with a 400m track*
- *Ancient Wisdom blended with modern outlook*
- *Hands - On Learning with advanced Science, Computer & Math Labs*
- *Vedic Math & Sadacharam*
- *Well stacked Library*
- *State of the Art & Hygienic Kitchen & Dining hall*

Email: - vbvk.svp@gmail.com

Contact: 90636 66304, 90003 55433

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి :	అసోసియేట్ ఎడిటర్	-
సబ్ ఎడిటర్ :	-	9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

ఢిల్లీలోని భారత మండపంలో భారత జాతే కాదు, ప్రపంచ దేశాల ప్రతినిధులు కూడా ఫిబ్రవరి 20న ఒక వికృత క్రీడను చూడవలసి వచ్చింది. దేశానికి తలవంపులు తేవడం, బీజేపీకి అప్రతిష్టను అంటగట్టడమే పనిగా పెట్టుకున్న కాంగ్రెస్ యువజన విభాగం, యూత్ కాంగ్రెస్ ఈ వికార చేష్టను నిస్సిగ్గుగా ప్రదర్శించింది. రోడ్డు ఎక్కితే, సమావేశం పేరుతో నలుగురు యూత్ కాంగ్రెస్ సభ్యులు ఒకచోట చేరితే ఎంత విధ్వంసం జరుగుతుందో ప్రజలకు చాలా అనుభవాలు ఉన్నాయి. గతం నుంచి నిన్న మొన్నటి రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర వరకు ఇదే పునరావృత మవుతూ వచ్చింది. వాటన్నిటికీ మించినది భారత మండపంలో జరిగింది. వందలాది మంది విదేశీ ప్రతినిధులు, దేశాధినేతలు, సాంకేతిక దిగ్గజాలు, సీఈఓలు, వ్యాపారవేత్తలు, పరిశోధకులు కొలువుదీరిన ఆ సభా ప్రాంగణంలో చొక్కాలు తీసేసి అర్ధనగ్నంగా ఓ పదిమంది యువజన పోకిరీలు తమాషా చేశారు. దానికే శాంతియుత పద్ధతిలో నిరసన అని పేరు కూడా పెట్టారు. అసలు పార్టీయే సిగ్గూ ఎగ్గూ లేకుండా మాట్లాడుతూ ఉంటే, దాని ముద్దుబిడ్డ యువజన కాంగ్రెస్ నుంచి ఏ సంస్కారాన్ని ఆశించగలం! ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026, ఫిబ్రవరి 16-20 మధ్య ఢిల్లీలో జరిగింది. 16వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఐదో నంబర్ సభా ప్రాంగణంలో యువజన కాంగ్రెస్ ఈ వీరంగం వేసింది.

క్యూఆర్ కోడ్‌తో ప్రవేశపత్రాలు సంపాదించిన కొంతమంది యువజన కాంగ్రెస్ సభ్యులు లోపల మోదీ, ట్రంప్ బొమ్మలు ఉన్న చొక్కాలు ధరించి, వాటిపై జాకెట్లతో దొంగదారిలో సమావేశంలో చొరబడ్డారు. హఠాత్తుగా జాకెట్లు తొలగించి, లోపల ఉన్న టీ షర్టులను తొలగించి, అర్ధనగ్నంగా వేదికపైకి చేరారు. మోదీ రాజీపడ్డారు, అమెరికా ఒప్పందాన్ని ఒప్పుకోం, ఎపిస్టీన్ ఫైల్స్ మాటేమిటి వంటి నినాదాలు చేశారు. వీళ్లలో ఐదుగురుని వెంటనే అదుపులోకి తీసుకుని కస్టడీకి కూడా పంపారు. ఇలాంటి దిక్కుమాలిన నిరసనకు మొదటే ఆ యువజన కాంగ్రెస్ సభ్యులు అక్కడ ఉన్నవారి చేత చెప్పుదెబ్బలు తిన్నారు. మండపం ఉద్యోగి ఒకరు ఒక కార్యకర్తను పట్టుకుని చితకబాదినట్టు చూపే వీడియో కూడా దేశం మీదకు వచ్చింది. కృష్ణహరి

శాలివాహన 1947 శ్రీ విశ్వావసు ఫాల్గుణ శుద్ధ చతుర్దశి

లోపలి పేజీలలో...



6లో

ముఖపత్ర కథనం

బాన్సువాడా?
బాంగ్లాదేశా?

జాగృతి పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు శ్రేయోభిలాషులకు **హోళీ శుభాకాంక్షలు**

ధారావాహిక నవల

25 **గణపతిదేవుడు**

- మత్తి భానుమూర్తి

20లో

ప్రత్యేక వ్యాసం

సమరస జీవన హేల.... హోళీ

29లో

జాగృతి

సంపాదకీయం

(బిహార్), కుందన్ యాదవ్ (బిహార్), అజయ్ కుమార్ (ఉత్తర‌ప్రదేశ్), నరసింహ యాదవ్ (తెలంగాణ)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను షిబ్ ఏ మాత్రం వెరవకుండా సంస్థ సభ్యుల చర్యను సమర్థించారు. ఈయనను, ఇంకో ముగ్గురిని కూడా ఫిబ్రవరి 24న ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధులంతా కూడా తమ యువజన సంస్థ చొక్కాలు విప్పి పశుప్రాయంగా ప్రవర్తించడాన్ని శాంతియుత నిరసనగానే పరిగణిస్తూ వాదనలు వినిపించారు. ఇంకా వినిపిస్తున్నారు. పైగా ఈ ఆగ్రహం తమ సభ్యులదే కాదని, దేశంలో

జాతి వ్యతిరేకతను విప్పి చూపారు

ఉపాధి లేక బాధపడుతున్న ప్రతి యువకుడిదేనని సమర్థించుకున్నారు.

అధికారంలో ఉన్నది కాబట్టి బీజేపీ ఎడల అంతులేని ద్వేషం పెంచుకున్న కాంగ్రెస్‌కు ఇప్పుడు ఏదీ తప్పుగా అనిపించడం లేదు. కన్నూమిన్నూ కానరావడం లేదు. ఈ నికృష్టపు చర్యను ఇండీ కూటమిలోని సన్నిహితులు కూడా ఛీకొట్టారు. బీజేపీకి ఎవరు ఏం చేసినా, మోదీకి వ్యతిరేకంగా ఎవరు ఎంత విషం కక్కినా సంతోషంగా వీక్షించే సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ కూడా ఇదేం పని అని చీవాట్లు పెట్టారు. బీఎస్‌పీ అధినేత్రి మాయావతి, నిరసన అంటే ఇదా? ఇంత అసహ్యకరంగానా అని నిలదీశారు. ఇది సరైన పద్ధతి కాదని టీఎంసీ ఎంపీ బాబూలాల్ సుప్రియో ట్వీట్ చేశారు. నిరసన చేసే హక్కు చట్టబద్ధమే కానీ, అందుకు వేదిక అది కాదని ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ ఝా అన్నారు. యువజన కాంగ్రెస్ చర్య మనమంతా సిగ్గుతో తలదించుకునే తీరులో ఉందని వైఎస్ఆర్ పార్టీ నాయకుడు వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. ఉద్ధవ్ ఠాక్రే శివసేన ఎంపీ అరవింద్ సావంత్ దీనిని సమర్థించలేదు. ఇక బీజేపీ సభ్యులు విమర్శించడంలో ఆశ్చర్యం లేదు. కాంగ్రెస్ నాయకుల వస్త్రాలను భారతీయులు ఏనాడో వలిచేశారు. ఇప్పుడు కొత్తగా చొక్కాలు విప్పి వీరంగం వేయవలసిన అవసరం లేదని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈ మురికి రాజకీయాలు ఇక కట్టిపెట్టమని హెచ్చరించారు. ఇదంతా చూసినా కూడా రాహుల్ బుద్ధి మారలేదు. పిడివాదం వదలడం లేదు. మురికి రాజకీయాలు మీవే అంటూ ఎదురు దాడికి దిగారే తప్ప, తన పార్టీ కార్యకర్తలు ఎంత నైచ్యానికి ఒడిగట్టారో, దేశం పరువును ఏ తీరున తీశారో ఆయన ఒక్కడే గమనించేందుకు సిద్ధంగా లేరు. అందుకే ఈ కుట్ర రాహుల్, ప్రియాంక సమక్షంలోనే, వారి నివాసాలలోనే జరిగిందని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా సూటిగానే ఆరోపించారు. యువజన కాంగ్రెస్ సభ్యులు విప్పుకున్నవి చొక్కాలు కాదని, స్వదేశం పట్ల వాళ్ల వైఖరి ఎలాంటిదో ప్రపంచం ఎదుట విప్పారని వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ చక్కగానే వ్యాఖ్యానించారు.

ఏ విధంగా చూసినా రాహుల్ గాంధీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కనిపించే అవాంఛనీయ శక్తి. దేశానికి ఆయనొక ప్రారబ్ధం. సుప్రీంకోర్టును అవమానిస్తారు. బీజేపీని అర్ధంపర్ధం లేకుండా విమర్శిస్తారు. తనకు నచ్చని ప్రశ్న వేస్తే పత్రికారంగానికి కాషాయం పూస్తారు. భారత రక్షక దళాలను, పార్లమెంట్‌ను, సుప్రీంకోర్టును, భారత స్వాతంత్ర్యం సమరంలో సర్వం త్యాగం చేసిన వారిని, ఆఖరికి తన పార్టీ వారే అయినా, తన కుటుంబానికి చెందని ప్రధానులను దారుణంగా గేలి చేస్తారు. ఆయన వైఖరే ఆయన పార్టీ వైఖరి. అదే పని యువజన కాంగ్రెస్ చేసింది. కాంగ్రెస్ ముక్త భారత్ పనిని మరింత వేగంగా జరగాలని అంతా ఆశించాలి. ★

40లో

కథ

వారసుడు

- శిరీష మల్లికార్జున
పండితారాధ్యుల



ఆ కుటుంబంతో వెళ్లడమంటే కుక్కతోక... (జ్ఞానోదయం) - 12
కుమ్మెర ఘోరానికి, కామారెడ్డి హింసకు.. (తెలంగాణ) - 14
'సిలికాన్ టు సిస్టమ్' సాకారానికి సూత్రాలు (ఆంధ్రప్రదేశ్) - 16
భారత్-బాంగ్లా సంబంధాలపై కొత్త ఆశలు (అంతర్జాతీయం-1) - 24
ఆ పీఠాల స్థాపకులు ఆదిశంకరులే! (సమాధానం-2) - 26
బాధ్యతాయుత సాధికారత! (మహిళ) - 30
అలనాటి నౌకాయానం (గళమెత్తిన గతం) - 32
సమర్థ కుటుంబ వ్యవస్థ (ఆర్ఎస్ఎస్-100) - 34
ప్రపంచ 'క్రికెట్' పెద్దన్న భారత్! (క్రీడ) - 43
సెన్సార్ అభ్యంతరాలు సమంజసమేనా!? (సినిమా) - 50

మైనారిటీల కోసం మరొకసారి దేశాన్ని విభజించాలని చూస్తున్న వేర్పాటువాదులు, జిన్నా వారసులు, ముస్లిం మతోన్మాదులు వాళ్ల ప్రయత్నాలను వేగవంతం చేయాలని ఆరాటపడుతున్నారు. సీఏఏ మొదలు వందేమాతర గీతం, అంటే జాతీయగీతం ఆరుచరణాలు ఇకపై పాడితీరాలన్న కేంద్ర ప్రభుత్వం ఆదేశం వరకు తమ ప్రయత్నాలకు ఉపయోగపడతాయనే దింపుడు కళ్లం ఆశలతో చూస్తున్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిరోధించడం, లోక్‌సభలో బీజేపీ సభ్యుడు నిశికాంత్ దూబే ఇటీవలనే రాహుల్ గాంధీ మీద ప్రవేశపెట్టిన సబ్‌స్టాంటివ్ తీర్మానంతో రాబోతున్న ముప్పుకు భయపడి, అంతిమంగా ఆరు చరణాల వందేమాతరం గీతం పాడాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను ఖాతరు చేయబోమన్న సంకేతాలు పంపడానికి ముస్లిం మతోన్మాదులు నానా తంటాలు పడుతున్నారు. ఇందుకు కాంగ్రెస్ యథాశక్తిన సహకరిస్తున్నది. ఒక వారం క్రితం తెలంగాణలోని కొన్ని ప్రాంతాలలో తలెత్తిన హిందూ-ముస్లిం మత ఘర్షణలు ఇందులో భాగమే. తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'కాంగ్రెస్ అంటేనే ముస్లింలు, ముస్లింలు అంటే కాంగ్రెస్' అంటూ ప్రకటించి మతోన్మాదుల వీరంగానికి వాద్య సహకారం అందించారు. ఆనాటి నుంచి రాష్ట్రంలో మతోన్మాదులు స్వైరవిహారం చేస్తున్నారు. తెలంగాణలోని కామారెడ్డి జిల్లా బాన్సువాడలో ఫిబ్రవరి 20 నుంచి జరుగుతున్న పరిణామాలు, కొన్ని రోజులు పాటు నెలకొన్న ఉద్రిక్తతలు ముమ్మాటికీ ఈ విషయాలని రుజువు చేస్తున్నాయి.

బాన్సు

తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులకు అత్యవసరంగా ఒక వివరణ ఇవ్వాలి. ఇక్కడ హిందువులకు తమ ఆచారాలను పాటించే అవకాశం లేదా? భక్తిగీతాలు పెట్టుకుని వినే స్వేచ్ఛ కూడా లేదా? శివాజీ ఊరేగింపునకు రక్షణ ఉండదా? ఇవన్నీ ఎందుకు? అసలు తాము నివశిస్తున్నది భారత భూభాగంలోనా? లేకపోతే పాకిస్తాన్/ బాంగ్లాదేశ్‌ల లోనా? కొద్దికాలం క్రితం భైంసాలో జరిగిన హిందూ ముస్లిం ఘర్షణలపట్ల నోరు మెదపలేదు. ఇప్పుడు బాన్సువాడ ఘర్షణల విషయంలోను అదే చేస్తున్నది. పైగా బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నది. తమ స్వేచ్ఛ గురించి మాట్లాడిన, రోడ్డెక్కిన హిందువులపైననే కేసులు నమోదు చేసింది రాష్ట్ర ప్రభుత్వం.

బాన్సువాడలో ఏం జరిగింది?

బ్రిటిష్ ఇండియాలో కౌమ్యూజిక్ అనే ఒక పదబంధాన్ని ఆంగ్లేయులు ఉపయోగిస్తూ ఉండేవారు. అంటే ఆవు-సంగీతం. విస్తృతార్థంలో వాద్యాల మోత. గోవధ చేస్తే హిందువులు ముస్లింల మీద దాడి చేసేవారు. మసీదుల పక్కన హిందువులు భజంత్రీలతో వెళితే ముస్లింలు దాడికి దిగేవారు. అయితే ఇప్పుడు మన ఇళ్లలో, మన వ్యాపార సంస్థలలో, మన ఆలయాలలో భక్తిపాటల వంటి సంగీత కార్యక్రమం పెట్టుకున్నా ముస్లింలు అభ్యంతరం చెప్పే రోజులు మళ్లీ వచ్చాయి. ఆ మతోన్మాదులలో దాగి ఉన్న మధ్యయుగపు ఉన్మాదం మళ్లీ బుసలు కొడుతున్నది. బాన్సువాడ పట్టణంలో రిలియన్స్ మార్టు ఉంది. ఇందులో నిత్యం సంగీతం, హిందూ దేవీదేవతల స్తోత్రాలు, పాటలు పెట్టుకుంటారు. ఇది ఇప్పుడే మొదలయినది కూడా కాదు. ఫిబ్రవరి 20వ తేదీన ముజామిల్ అనే ఒక ముస్లిం ఉన్మాది మార్ట్‌లోకి వచ్చాడు. ఏదో కొనడం అతడి ఉద్దేశం కావచ్చు. ఆ సంగతి వదిలేసి ఆ భక్తిపాటల గురించి గొడవకు దిగాడు. 'ఇలాంటి చెత్త పాటలు' పెడతారా అని కయ్యానికి కాలు దువ్వాడు. మార్టులోకి వచ్చి, లోపల పెట్టుకున్న హిందూ భక్తిగీతాల మీద అభ్యంతరం చెప్పి, రగడకు దిగడం, ఆ ఉన్మాదికి దీటుగా సమాధానం ఇచ్చిన సేల్స్‌గర్ల్‌కు తెలియకుండా ఇదంతా వీడియో తీయడం జరిగిపోయాయి. కానీ ఇదంతా గమనించిన ఇతర హిందూ వనితలు దీని మీద నిలదీశారు. వీడియో ఎందుకు తీస్తున్నావని ప్రశ్నించారు. మళ్లీ అలాంటి సమాధానం, అదే నిర్లక్ష్యం, 'ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి!' అని.

దీనికి హిందూ వనితలకు మద్దతుగా వచ్చిన యువకులు ఆ ఉన్మాదికి దేహశుద్ధి చేసి, వారే పోలీసులను పిలిచి అప్పగించారు. ఇంతకీ ఆ ఉన్మాది ఇలాంటి తుంటరి. అనాగరిక ప్రవర్తనను వీడియోలో ఎక్కించి ముస్లిం సోషల్ మీడియా గ్రూప్‌లో పెట్టి, ఒక హిందూ మహిళ పట్ల తాను ఎంత వికృతంగా ప్రవర్తించాడో మార్గదర్శనం చేస్తాడట. ఇదేం పైశాచికానందం! అందుకే మార్టు నుంచే ఆ యువకులు, వనితలు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు కూడా చేశారు. తరువాత ఇంకొంతమంది హిందువులు గుమికూడి కఠిన శిక్షలతో కేసు పెట్టాల్సిందేనని ఆందోళన చేశారు. తాను చేసినది తప్పేనని స్టేషన్‌లో ఈ ఉన్మాది అంగీకరించాడు. అయినా ఎందుకో మరి, పోలీసులు అతడి మీద ఎఫ్ఐఆర్ దాఖలు చేయలేదు. కొంత సమయం తరువాత అతడిని విడిచి పెట్టాలని కోరుతూ స్టేషన్ దగ్గరకు చేరుకున్న ముస్లింలు ఆందోళన మొదలు పెట్టారు.

పోలీసులలోను మత వివక్షా?

ఒకవైపు హిందూ సంఘాలు, మరొక వైపు ముస్లింలు చేరారు. వాతావరణం చినికి చినికి గాలివానలా మారింది. అదే ఉద్రిక్త వాతావరణం దాదాపు నాలుగు గంటల పాటు ఉంది. బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, సీఐ శ్రీధర్, రూరల్ సీఐ తిరుపతయ్య బలగాలతో వచ్చి రెండు వర్గాల వారిని సముదాయించే ప్రయత్నం చేసినా, కుదురలేదు. శాంతిని మాత్రమే కోరుతుందని చెప్పే ఆ మతం వారు పవిత్ర రంజాన్ మాసంలో ఇలాంటి దుశ్చర్యకు ఎలా దిగారో అర్థం కాదు.

ఇదే సమయంలో ఒక ముస్లిం వర్గ కానిస్టేబుల్ హిందువులపై లాఠీచార్జ్ చేయడంతో వారిలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. ఇక్కడ కూడా మళ్లీ ఒక ముస్లిం కానిస్టేబుల్‌ను పోలీసులే భద్రంగా దాచిపెట్టారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అదనపు బలగాలతో బాన్సువాడకు చేరుకుని రెండు వర్గాలను శాంతింప చేశారు. ముస్లింల వైపు ఉన్న కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఖాలీక్, మహమ్మద్ ఎజాస్‌లతో ఎల్లారెడ్డి డీఎస్పీ ముస్లింలను కూడా వెనక్కి పంపించారు.

దొంగదెబ్బ

అయితే ముస్లింలు అధికారులు, నాయకుల కన్నుకప్పి మళ్లీ వెనక్కి వచ్చి పోలీస్ స్టేషన్ మీద, రిలయెన్స్ మీద, హిందువుల మీద రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పోలీసులకు కూడా గాయాలు తగిలాయి. దీనితో పోలీసులు రాళ్లు రువ్వుతున్న వాళ్లని చెదరగొట్టారు. మళ్లీ మైనారిటీ వర్గానికి చెందిన ఒక సీఐ పక్షపాతం చూపారని చెప్పే ఒక వీడియో బయటకు వచ్చింది. ఈ దాడిలో పిల్లలు కూడా పాల్గొన్నారు. కామారెడ్డి ఎస్పీ రాజేశ్‌చంద్ర బాన్సువాడ చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

ఒక స్మార్ట్ షాపులో పాటలు పెట్టవద్దని



వాడా? బాంగ్లాదేశా?

చెప్పడానికి ఆ ఉన్మాదికి ఏం హక్కు ఉంది? అయినా చెత్త పాటలు అంటూ వ్యాఖ్యానించి తెగింపు ఎక్కడిది? ఈ ఘటనలో మొత్తం 42 మంది మీద కేసులు పెట్టారు. ఇందులో బాధిత వర్గం వారే ఎక్కువ. అసలు రగడకు కారణమైన వారిని వదిలేసి, రెచ్చగొట్టారంటూ బాధితుల మీద అంటే హిందువుల మీద కేసులు పెట్టారు.

హిందువులకు న్యాయం చేయాలని అడగడానికి కూడా దేశంలో అవకాశం ఉండదని కాంగ్రెస్–ముస్లిం వేర్పాటువాద శక్తులు కలసి ఈ చర్యలతో హెచ్చరించినట్టయింది. హిందువుల బాధలు, హక్కుల రాహిత్యం, నిస్సహాయత గురించి చెప్పుకునే వినే నాథుడు ఈ దేశంలో ఉండడని వారు చెబుతున్నారు. కాంగ్రెస్, దాని మద్దతుతో ఎంఐఎం వంటి పార్టీ అధికారంలోకి వస్తే జరిగేది ఇదే కదా! ఒక చిన్న మునిసిపాలిటిలో ఏడు వార్డులు గెలిస్తేనే పరిస్థితి ఇలా ఉంటే, ఒక రాష్ట్రం వారి చేతిలో ఉంటే హిందువుల పరిస్థితి ఏమిటి? దీనిని హిందువులు తమకు తాము వెంటనే ప్రశ్నించుకోవాలి. నేరాలు వేర్పాటువాదులు చేస్తారు. ముస్లిం మతోన్మాదులు మత ఘర్షణలు సృష్టిస్తారు. ఇందుకు కాంగ్రెస్ మద్దతు ఉంటుంది. కేసులు మాత్రం ఈ ధోరణిని ప్రశ్నించిన హిందువుల మీద, జాతీయవాదులు మీద పెడుతున్నారు. అయితే ఈ పరిస్థితి నుంచి హిందూ సమాజం చాలా ఆలస్యంగానే అయినా మేలుకుంటూ ఉండడం శుభపరిణామం.

బాన్సువాడ బంద్

ఈ ఘటనకు నిరసనగా, పోలీసుల అత్యుత్సాహాన్ని ఖండిస్తూ ఫిబ్రవరి 21న హిందూ సంఘాలు బాన్సువాడ బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్ సంపూర్ణంగా, స్వచ్ఛందంగా జరిగింది కూడా. ఈ బంద్ విషయంలోను పోలీసులు పక్షపాతంగానే వ్యవహరించారు. కొందరు హిందువులను అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పరిస్థితుల కోణం నుంచి చూస్తే, బాన్సువాడ మీద తమ ఆధిపత్యం కోసం కొద్దికాలంగా ముస్లింలు తపన పడుతున్నారు. మునిసిపల్ చైర్మన్ ఏ పార్టీ నుంచి ఎన్నికైనా, అతడు ముస్లిం మాత్రమే అయి ఉండాలన్న తీరులో రాజకీయాలు నడిపిస్తున్నారు. ఇటీవలి ఎన్నికలలోను ఇదే తీరులో పని చేశారని స్థానికులు గట్టిగా చెబుతున్నారు. ఇక్కడ 19 వార్డులు ఉన్నాయి. వీటిలో ఏడింటిని వివిధ పార్టీల ముస్లింలు కౌన్సిలర్లుగా గెలిచారు. కానీ ఇప్పటికీ పాత బాన్సువాడ హిందూ ఆధిపత్యంలోనే ఉంది. కొత్త బాన్సువాడలో శాసనసభ్యుడి అండతో ముస్లింలు అడ్డదారులలో చాలా ప్రయోజనాలు పొందుతున్నారని స్థానికులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. అందులో ఒకటి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అధిక భాగం ముస్లింలకే దక్కడం. హిందువుల మీద దాడులు, అత్యాచారాలు చేసిన వారిని, పోలీసు కేసులలో ఇరుక్కుని జైలు నుంచి వచ్చిన వారిని స్థానిక ముస్లింలు సత్కరించడం హిందువులు అవమానకరంగా భావిస్తున్నారు. ఒక వృద్ధ ముస్లిం ఒక మైనర్ బాలిక మీద అత్యాచారానికి ఒడిగట్టి జైలుకు వెళ్లాడు. ఇటీవల బెయిల్ మీద వచ్చినప్పుడు కొందరు ముస్లింలు అతడికి శాలువ కప్పి సత్కరించారు.

ఒక పక్క బాన్సువాడ హిందూ–ముస్లిం ఘర్షణ, మరొక పక్క కామారెడ్డిలో శాసనసభ్యుడు వెంకట రమణారెడ్డి, షబ్బీర్ అలీ సవాళ్లు మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. వెంకటరమణారెడ్డికి సంఘీభావంగా కామారెడ్డి చేరుకోవాలనుకున్న ప్రతి బీజేపీ ప్రముఖుడిని గృహనిర్బంధంలో ఉంచారు పోలీసులు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావుకు కూడా ఇది తప్పలేదు. అంటే ఈ రెండు సందర్భాలలోను బీజేపీ, లేదా హిందూత్వ శక్తుల మీదే అణచివేత కనిపిస్తుంది. ఘోషామహల్ శాసన సభ్యుడు టి. రాజాసింగ్ బాన్సువాడలో హిందువులకు సంఘీభావం తెలియచేయడానికి వెళుతుంటే అరెస్టు చేశారు. ఫిబ్రవరి 22న బాన్సువాడ బయలుదేరిన ఆయనను మెదక్ జిల్లా శంకరంపేట వద్ద పోలీసులు ఆపివేశారు. ఆయనను ప్రివెంటివ్ కస్టడీకి తీసుకున్నారు. తాను నిర్మల్ వెళ్లవలసి ఉందని రాజాసింగ్ చెప్పినా, పోలీసులు ఆయనను వెళ్లడానికి అనుమతించలేదు. బాన్సువాడ నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఎండల లక్ష్మీనారాయణను కూడా బీజేపీ కార్యకర్తలను కలుసుకోవడానికి వెళుతుండగా పోలీసులు ఆపివేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మెజారిటీ మతస్థులను మైనారిటీలు

కామారెడ్డిలో కార్యకర్తలను పరామర్శించేందుకు వెళుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావును అడ్డుకున్న పోలీసులు

లక్ష్యంగా చేసుకోవడం ఎక్కువయిందని లక్ష్మీ నారాయణ ఆరోపించారు. బాన్సువాడ ఘటనలో రాళ్లు విసిరిన వారిని వదిలిపెట్టి, మెజారిటీ మతం వారిని మాత్రం అదుపులోకి తీసుకుని, వేధిస్తున్నారని ఆయన విమర్శించారు. పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగిపోయారని, ఈ ఉదంతంలో అరెస్టయిన వారిని వెంటనే విడుదల చేయాలని లక్ష్మీనారాయణ కోరారు.

హైదరాబాద్ నగరంలోనే ఉప్పల్ ప్రాంతంలో కూడా శివాలయం వివాదం ముస్లింల మతోన్మాదం కేంద్రంగానే మొదలయింది. ఒక్క కుటుంబం ఉన్నా, ఒక ప్రాంతంలో శివాలయంలో పూజలు చేసుకోవడానికి ఆటంకాలు కల్పిస్తున్నదని మహిళలు ఆరోపించారు. వారు వేరే ప్రాంతం నుంచి ఇక్కడకు వచ్చి నాలుగు దశాబ్దాలుగా ఉంటున్నారు. కానీ స్థానికులు ముస్లిం కుటుంబం పెడుతున్న హింసను పట్టించుకోవడం లేదన్న ఆరోపణ ఉంది. పాకిస్తాన్ పౌరులు, రొహింగ్యాలకు ఆటపట్టుగా ఉన్న హైదరాబాద్ వంటి నగరంలో ఇప్పటికీ బుజ్జగింపు ధోరణితో ప్రభుత్వాలు ఉంటే జరిగే ప్రమాదం సాధారణంగా ఉండదు. అంతర్జాతీయంగా ఏ దాడి జరిగినా హైదరాబాద్ వైపు వేలు చూపించవలసిన దుస్థితి. అలాంటి ప్రమాదకర నగరంలో మతోన్మాద శక్తులను ప్రోత్సహించరాదన్న ఇంగిత జ్ఞానం నాయకులకు ఉండాలి. పదవి ఎప్పుడు ఊడుతుందో తెలియని కాంగ్రెస్ నాయకులు కాస్త భారతీయతను మనసులో దాచుకోవడం అత్యవసరం. ఐదేళ్లో, మూడేళ్లో ఉండే ఆ పదవి కోసం ముస్లింలే మా పార్టీ, మా పార్టీయే ముస్లింలు వంటి అత్యంత ప్రమాదకర నినాదాలు ఇవ్వడం జాతికి ద్రోహం చేయడమే.

అమ్మవార్ల ఆలయాలలో మల విసర్జన, విగ్రహాల ధ్వంసం వరకు ఇటీవల కాలంలో చాలా దుర్ఘటనలే జరిగాయి. మేధావులు, హేతువాదులు, ప్రజాస్వామిక వాదులు ఎలాగూ స్పందించరు. స్పందించే దమ్ము ధైర్యం వాళ్లకి లేవు. కానీ ప్రభుత్వ యంత్రాంగం కూడా ఎన్ని జరుగుతున్నా వాటిని అరికట్టే ప్రయత్నం చేయకపోవడమే విచిత్రం. బాంగ్లాదేశ్‌లో ఇటీవలి వరకు కొనసాగిన వాతావరణానికి, తెలంగాణలో ప్రస్తుతం కొన్ని ప్రాంతాలలోని పరిస్థితులకు పెద్ద తేడా లేదన్న విమర్శ ఉంది. హిందువుల మనోభావాలను గాయపరిచేవే అయినా, చెదురు మదురు ఘటనలుగా వాటిని గాలికి వదిలేస్తున్నారు. మీడియా గాని, ప్రభుత్వం కాని పట్టించుకోవడం లేదు. అదే హిందువులు చేసినట్టు ఏదైనా వార్త వస్తే వెంటనే యంత్రాంగం కదులుతుంది. ఇందుకు తాజా ఉదాహరణ బాన్సువాడ ఘర్షణే. అల్లరి మొదలు పెట్టినవాడు ఒక ముస్లిం మతోన్మాది. తప్పు చేసిన వాడిని పోలీసులు విడిచిపెట్టాలంటే రాళ్లు రువ్వి శాంతిభద్రతల సమస్యను సృష్టించినది కొందరు ముస్లింలు. కానీ అరెస్టయిన వారిలో ఎక్కువ మంది హిందువులు. ఇది కదా అసలు వైచిత్రి! కొన్నేళ్లుగా తెలంగాణ దేవాలయాల మీద జరిగిన దాడులకు సంబంధించి ఒక్క కేసులోను న్యాయం జరిగిన దాఖలాలు లేవు. ముఖ్యమంత్రిని మార్చడానికి కూడా మత కల్లోలాలు లేపే సంస్కృతి, చరిత్ర కలిగిన పార్టీ పాలనలో ప్రస్తుతం తెలంగాణ ఉన్నది. ఇంతకు మించిన న్యాయం ఆశించగలమా?

వెంకటరమణారెడ్డి

ఆంధ్రప్రదేశ్‌లోను క్రైస్తవం వీరవిహారం చేస్తున్నది. అక్కడ వందేమాతరం ఆరు చరణాలు పాడడానికి ముస్లింలు, క్రైస్తవులు కలసి ఆందోళనకు దిగాలని అనుకుంటున్నట్టు వార్తలు వస్తున్నాయి. వీడియోలలో పాస్టర్లు వినిపిస్తున్న నినాదాలు, రెచ్చగొట్టేట్టు చేస్తున్న ఉపన్యాసాలకు లోటు లేదు. కోస్తాంధ్ర మొత్తం మాదే అని వేదిక ఎక్కి ప్రసంగించిన ఒక పాస్టర్, ప్రభుత్వోద్యోగులు జైశ్రీరాం అంటూ పలకరించుకోవడాన్ని తప్పు పడుతున్నాడు. అదొక ప్రమాద ఘంటికగా అభివర్ణిస్తున్నాడు. తెలంగాణ ముఖ్యమంత్రి ఢిల్లీ యాత్ర చేసి వచ్చిన తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ శ్రేణులు కంటే, ముస్లిం పార్టీలు, సంఘాల సభ్యులలోనే ఎక్కువ ఉత్సాహం కనిపిస్తున్నది. హిందువుల మీద ఇంత ద్వేషం కాంగ్రెస్ రాష్ట్రాలలోనే కనిపిస్తున్నది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో ఇది సుస్పష్టం. దీని ఆత్మబంధువు డీఎంకే కూడా అదే పనిలో ఉంది. తిరుప్పురకుండ్రం ఇందుకు కచ్చితమైన ఉదాహరణ. కేరళ స్టోరీ 2 పేరుతో విడుదల కానున్న సినిమా గురించీ ఇదే రకమైన చౌకబారు ప్రచారం. అందులో హిందూ యువతులను లవ్ జిహాద్ పేరుతో మోసం చేస్తున్నారని చెప్పడమే నేరమైంది. నేను అబద్ధం చెప్పడం లేదు, పోలీసు స్టేషన్‌లలో, కోర్టులలో ఉన్న కేసుల ఆధారంగానే ఇతివృత్తం తయారయిందని నిర్మాత చెప్పినా, ఇది ముస్లిం వ్యతిరేక ప్రచారం అంటూ గగ్గోలు లేపుతున్నారు.

దేశంలో గడచిన పుష్కర కాలంగా చెప్పుకోదగ్గ స్థాయిలో మత కల్లోలాలు లేవు. అది ఎన్‌డీఏ ప్రభుత్వ ఘనత. హనుమాన్ శోభాయాత్రల మీద రాళ్ల దాడులు జరిపితే అలాంటి వాళ్ల తోకలు కత్తిరించారు. దీనితో కాంగ్రెస్, కమ్యూనిస్టులు, డీఎంకే వంటి వేర్పాటువాద పార్టీల పబ్బం గడవడం లేదు. వీటిని ఏదో ఒక రకంగా ఎక్కడో ఒకచోట సృష్టించగలిగితే చాలు. దేశం మొత్తాన్ని అగ్నిగుండం చేయవచ్చు నన్నదే కాంగ్రెస్ వ్యూహం. కానీ ఇది సాధ్యం కాదని ఆ పార్టీ గుర్తించవలసి ఉంటుంది. ముస్లింలను 1970 దశకంలోనే ఉండిపోయేటట్టు చేసినప్పటికి, హిందువులు ఇప్పుడు చైతన్యవంతమయ్యారు. అది కాంగ్రెస్ గుర్తించాలి. పార్లమెంట్‌లోను, ఏఐ సదస్సు జరిగిన భారత మంటపం (ఢిల్లీ), ఇతర అంతర్జాతీయ వేదికల మీద దేశం పరువు తీయడానికి కాంగ్రెస్, దాని తైనాతీలు శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తున్నాయి. బీజేపీని అపఖ్యాతి పాలు చేయడానికి శ్రమిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రయత్నం, శ్రమ వృథా అని 12 ఏళ్లుగా ఉన్న మత సామరస్యం వెల్లడిస్తున్నది.

– జాగృతి డెస్క్

కుమ్మెర జాతర, కామారెడ్డి విధ్వంసం

వివరాలు 16వ పేజీలో..

విషసర్పంలా విజృంభిస్తున్న మజ్లిస్

పాలు పోస్తున్నాము కదా అని విషం కక్కే పాము మన మీద ఎప్పుడూ ప్రేమ చూపించదు. నీతి లేనివాడు తన నిజస్వరూపం చూపించినట్టు పాము కూడా తరచూ విషం కక్కుతూనే ఉంటుంది. ఈ పోలికలు మజ్లిస్ పార్టీగా పేరున్న ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తేహాద్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం)కు సరిగ్గా సరిపోతాయి. తెలంగాణలో తమ స్వార్థ రాజకీయాల కోసం విష పాము లాంటి మజ్లిస్ పార్టీని వాడుకునే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఉద్దేశించి "రెడ్డి అయినా... రావు అయినా.. మా వద్దకు రావాల్సిందే... మేము ఎప్పుడూ వారి వద్దకు వెళ్లము. వారే మా వద్దకు వస్తారు.." అంటూ ఆ పార్టీ నేత అక్బరుద్దీన్ ఓవైసీ అహంకారంగా వ్యాఖ్యానించినా వారికి గట్టి సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో ఈ రెండు పార్టీలు ఉన్నాయి. రెచ్చగొట్టే వివాదాస్పద వ్యాఖ్యలతో రాజకీయాలు చేసే ఏఐఎంఐఎం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల పుణ్యమా అని చావకింద నీరులా తెలంగాణ వ్యాప్తంగా విస్తరిస్తున్న తీరు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. రాజకీయల్లో పార్టీల విస్తరణ సర్వసాధారణమే అయినా మజ్లిస్ విషయంలో ప్రమాదకరం అని వ్యాఖ్యానించడానికి హైదరాబాద్ పాతబస్తీలో వారు వ్యవహరిస్తున్న తీరే నిదర్శనం.

తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సరళిని పరిశీలిస్తే ఆ పార్టీ ప్రమాదకర విస్తరణ తేటతెల్లమవుతోంది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పతంగి పార్టీ పలుచోట్ల క్రియాశీలకంగా మారింది. ఇంతకాలం గ్రేటర్ హైదరాబాద్‌కే పరిమితమనే ముద్రను చెరిపేసుకుంటూ 2026 స్థానిక ఎన్నికల్లో 15 మున్సిపాల్టీల్లో 48 వార్డులను, 4 కార్పొరేషన్లలో 22 డివిజన్లతో మొత్తం 70 స్థానాల్లో పాగా వేసి రాష్ట్రంలో తన సత్తా చాటింది. ప్రధానంగా నిజామాబాద్ కార్పొరేషన్‌లో 14 స్థానాలు గెలిచి బీజేపీకి మేయర్ పీఠం దూరం చేస్తూ కాంగ్రెస్‌తో కలిసి అధికారాన్ని పంచుకుంది. కరీంనగర్, మహబూబ్‌నగర్‌లో చెరో 3 డివిజన్లు, నల్గొండలో మరో 2 డివిజన్లు గెలిచింది. భైంసా, బోధన్ మున్సిపాల్టీలలో చెరో 12 వార్డులు గెలిచి అతి పెద్ద పార్టీగా నిలిచింది. ఆదిలాబాద్‌లో 6, నిర్మల్‌లో 3, జహీరాబాద్, నారాయణపేట, జగిత్యాలలో చెరో 2 డివిజన్లు, సంగారెడ్డి, కాగజ్‌నగర్, గద్వాల, కోహీర్, కొడంగల్, వికారాబాద్, ఆర్మూర్, తాండూరు మున్సిపాల్టీల్లో చెరో ఒక వార్డు గెలిచి తెలంగాణలో అన్ని వైపులా తన ఉనికిని చాటుకుంది. కాంగ్రెస్‌తో జతకట్టి నిజామాబాద్ డిప్యూటీ మేయర్‌తో పాటు, బోధన్‌లో వైస్ చైర్మన్ పదవి పొందింది. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఇండిపెండెంట్లతో కలిసి వైస్ చైర్మన్ పదవి సాధించింది. నిజామాబాద్, ఆదిలాబాద్‌లో అధిక స్థానాలు సాధించి మేయర్, చైర్మన్ పోస్టులకు కొద్ది దూరంలో నిలిచిన బీజేపీకి ఎలాంటి అవకాశాలు ఇవ్వకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేసిన శక్తులతో చేతులు కలిపిన మజ్లిస్ పార్టీ అక్కడ విజయవంతమైంది. రాష్ట్రంలో 2020 మున్సిపల్ ఎన్నికల్లో 1,21,364 ఓట్లతో 3 శాతం ఓట్లు పొందిన ఈ పార్టీ 2026లో 1,24,236 ఓట్లతో 2.3 శాతం ఓట్లు సాధించింది. గతంతో పోలిస్తే ఆ పార్టీకి లభించిన ఓట్లలో పెద్దగా పెరుగుదల కనిపించకపోయినా భారీగా సీట్లు పొంది రాష్ట్రంలో పలుచోట్ల క్రియాశీలకంగా మారింది. ఈ నేపథ్యంలోనే అక్బరుద్దీన్ "రెడ్డి అయినా.. రావు అయినా.." మాకేంటి అంటూ బహిరంగంగా వ్యాఖ్యానించారు.

హైదరాబాద్ పాతబస్తీకే పరిమితమైన మజ్లిస్ పార్టీ తెలంగాణలో ఇతర జిల్లాల్లో కూడా విస్తరించడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలే ప్రధాన కారణం. ఈ పార్టీలు అధికారం కోసం బుజ్జగింపు మత రాజకీయాలకు పాల్పడుతూ మజ్లిస్ విష సర్పాన్ని పెంచి పోషించాయి. ఈ రెండు పార్టీల బలహీన తలను వ్యూహాత్మకంగా తనకు అనుకూలంగా మజ్లిస్ మార్చుకుంది. అవసరమైనప్పుడు వీరికి మద్దతిస్తూ తమ పార్టీ విస్తరణతో పాటు ఇతర ప్రయోజనాలకు వాడుకుంటుంది. ఇందుకు ఉదాహరణ చూస్తే ఇటీవల గ్రేటర్‌లో హైడ్రా పలు అక్రమ కట్టడాలు కూల్చివేసినా ఓవైసీ సోదరుల ఆస్తుల వద్దకు వచ్చేసరికి ప్రభుత్వం చేతులు కట్టుకున్న విషయం అందరికీ తెలిసిందే. మూసీ సుందరీకరణ విషయంలో కూడా ఆ పార్టీ హెచ్చరికలకు ప్రభుత్వం వెనకడుగు వేసింది.

ఎదుటివారి బలహీనతలను సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం మజ్లిస్ పార్టీకి కొట్టిన పిండి. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు పలు అవసరాలకు వాడుకున్న ఆ పార్టీ

అనంతరం మొండి చేయి చూపడం పరిపాటి. తెలంగాణ ఏర్పడక ముందు కాంగ్రెస్‌తో, అనంతరం బీఆర్ఎస్‌తో, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌తో జట్టు కట్టింది.

మజ్లిస్ పార్టీ ఆడుతున్న రాజకీయ పాచికల నుండి పాఠాలు నేర్వని ఈ రెండు పార్టీలు నవ్వుల పాలవుతున్నా అధికారమే పరమావధిగా చూసీ చూడనట్టు వ్యవహరిస్తూ ఓవైసీ సోదరులు ఏమన్నా, ఏమి చేసినా దులుపుకుంటున్నాయి. రెడ్డి.. రావు.. ఎవరైనా అంటూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మా పార్టీ మద్దతుతోనే కాంగ్రెస్ గెలిచిందని అక్బరుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యానిస్తే రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు తప్ప ఇతర కాంగ్రెస్ నేతలు ఎవరూ ముందుకొచ్చి మాట్లాడలేకపోయారు. ఆయన కూడా సుతిమెత్తగా మేము ప్రజా బలంతో గెలిచామన్నారే కానీ, అక్బరుద్దీన్ వ్యాఖ్యలకు సూటిగా గట్టిగా సమాధానం ఇవ్వలేదు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ పాతబస్తీలో మూడు, నాలుగు అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన మజ్లిస్ పార్టీ కాంగ్రెస్ పుణ్యమాని ఇప్పుడు తెలంగాణలో ఏడు అసెంబ్లీ స్థానాలను తనకు కంచుకోటగా మార్చుకుంది. 2009లో నియోజక వర్గాల పునర్విభజన సమయంలో ఇటు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో, అటు కేంద్ర ప్రభుత్వంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండడంతో సమయం చూసి పాచిక లేసింది. బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాల్లో ఆరితేరిన మజ్లిస్ పార్టీ నేతలకు జంకిన నాటి ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజనలో వారి మాటలకు వత్తాసు పలకడంతో నగర ప్రజలకు ప్రధానంగా పాతబస్తీ వాసులకు శాపంగా మారింది. గతంలో చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, కార్వాన్ అసెంబ్లీ సెగ్మంట్లతో పాటు హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోనూ మజ్లిస్ పార్టీ గట్టి పోటీ ఎదుర్కొనేది. అయితే నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా హిందూ ఓటర్లున్న ప్రాంతాలను విభజించడం, ముస్లిం ఓట్లున్న ప్రాంతాలను ఒక్కటిగా చేయడంతో అసెంబ్లీ నియోజకవర్గాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, కార్వాన్, బహదూర్‌పురా, ఆసిఫ్‌నగర్, మలక్‌పేట నియోజవకవర్గాలు ముస్లిం మత ప్రాతిపదికన మజ్లిస్‌కు కంచుకోటగా మారిపోయాయి. 2009 పునర్విభజనకు ముందు హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి నగర శివార్లయిన చేవెళ్ల, పరిగి, వికారాబాద్ సెగ్మంట్లు కూడా ఉండడంతో ఆ పార్టీకి గట్టి పోటీ ఉండేది. 2009లో నియోజక వర్గాల పునర్విభజనతో పాటు ముస్లిం జనాభా పెరుగుదల, అక్రమ వలసలు అన్నీ కలిసి ప్రస్తుతం నగరంలో ప్రధానంగా నగర దక్షిణ ప్రాంతంలో మజ్లిస్ పార్టీకి ఎదురన్నది లేకుండా పోయింది. ప్రస్తుత పరిస్థితి చూస్తే నగరంలో ఆ పార్టీ ఇప్పుడున్న 7 స్థానాలకు అదనంగా మరో ఒకటి రెండు స్థానాల్లో గట్టి పోటీ ఇచ్చి గెలిచినా ఆశ్చర్యం లేదు.

కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలతో విష వృక్షంలా పెరిగిన మజ్లిస్ పార్టీ బీఆర్ఎస్ రూపంలో అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును గట్టిగా వ్యతిరేకించిన మజ్లిస్ పార్టీతో రాష్ట్ర ఉద్యమ పార్టీగా చెప్పుకునే బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే జతకట్టడం విచిత్ర రాజకీయాలకు ఉదాహరణ. అంతవరకూ కాంగ్రెస్‌తో పూసుకొని తిరిగిన ఓవైసీ సోదరులు బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే వారిపై ప్రేమ పెరిగి కేసీఆర్‌ను కొగిలించుకున్నారు. 2014 వరకు కాంగ్రెస్ పార్టీతో చెట్టాపట్టాలేసుకున్న మజ్లిస్ పార్టీ 2016 జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా అప్పటి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డిపైనే భౌతిక దాడికి ప్రయత్నించింది. తర్వాత 2023 వరకు బీఆర్ఎస్‌తో చెలిమి చేసిన ఓవైసీ సోదరులు కేసీఆర్‌కు దేశ ప్రధానమంత్రి అయ్యేందుకు అన్ని అర్హతలున్నాయని ప్రకటిస్తూ తమ అవసరాలను తీర్చుకున్నారు. కాలచక్రం తిరిగింది. బెదిరింపులతో అధికారంలో ఉన్న వారి పంచన చేరడం పరిపాటిగా మార్చుకున్న మజ్లిస్ పార్టీ కేసీఆర్ దిగిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గేరు మార్చి రేవంత్ రెడ్డికి దగ్గరయ్యింది.

నామమాత్రం బలంతో ఉండే మజ్లిస్ పార్టీ చెప్పుచేతుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ బండీలు కావడానికి మైనార్టీ బుజ్జగింపు రాజకీయాలొక కారణమయితే, మరో ప్రధాన కారణం శాంతిభద్రతల అంశం. ఆ పార్టీతో ఘర్షణ వైఖరి ఉంటే సున్నితమైన పాతబస్తీతో పాటు ఇతర ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందనే అభద్రతాభావంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఓవైసీ సోదరులకు దాసోహం అన్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ బానిసత్వమే ఆ పార్టీ బలానికి ప్రధాన కారణం. హిందువులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై ఒత్తిడి తెచ్చి బలమైన హిందూ అభ్యర్థులను దింపి హిందు ఓట్లను చీలుస్తూ, ముస్లిం ఓట్లను గంపగుత్తగా పొందుతూ మజ్లిస్ పార్టీ గెలుస్తోంది. అందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు టికెట్ల కోసం వారి పార్టీ కార్యాలయాల కంటే మజ్లిస్ కార్యాలయం దారూసలం చుట్టూ తిరుగుతుంటారు. మరోవైపు ముస్లింలు నిర్ణయాత్మకంగా ఉండే నియోజకవర్గాల్లో మైనార్టీ ఓట్లు చీలకుండా స్వార్థ ప్రయోజనాల కోసం తమ చెప్పుచేతుల్లో ఉండే పార్టీకి మద్దతిస్తుంటారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. మరోవైపు ముస్లింల ప్రభావముండే ఖైరతాబాద్, ముషీరాబాద్, అంబర్‌పేట, గోషామహల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి నియోజకవర్గాల్లో మైనార్టీ ఓట్లు చీలకుండా బీజేపీ ఓటమి కోసం మజ్లిస్ పార్టీ ప్రయత్నిస్తుంటుంది.

మైనార్టీ ప్రయోజనాలే లక్ష్యంగా రాజకీయ వ్యూహాలతో మజ్లిస్ వ్యవహరిస్తుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు స్వార్థప్రయోజనాల కోసం ఆ పార్టీతో లాలూచీ పడుతున్నాయి. ఈ పరిస్థితి బీజేపీని వ్యూహాత్మకంగా బలహీనపరిచే వాతావరణాన్ని తెచ్చి పెట్టే అవకాశాన్ని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2009లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఉన్న సమయంలో నియోజక వర్గాల పునర్విభజనను అవకాశంగా తీసుకొని బలపడిన మజ్లిస్ పార్టీ 2026లోనూ అదే వ్యూహాలను రచిస్తోంది. త్వరలో మరోసారి నియోజకవర్గాల పునర్విభజన జరుగనుంది. మరోవైపు అధికార సౌలభ్యం పేరుతో గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం పరోక్షంగా

నగరాన్ని మజ్లిస్ పార్టీకి కట్టబెట్టనుంది. ఆ పార్టీ బలంగా ఉన్న ప్రాంతాలను కార్పొరేషన్‌గా రూపొందించి వారికి అప్పగిస్తోంది. నగరంలో హిందువులు అధికంగా ఉండే ప్రాంతాలను రెండు కార్పొరేషన్లుగా చేసిన ప్రభుత్వం మైనార్టీల ప్రభావం ఉన్న ప్రాంతాలను ఒక కార్పొరేషన్‌గా చేసింది. 150 డివిజన్లతో జీహెచ్ఎంసీ, 76 డివిజన్లతో సైబరాబాద్, 74 డివిజన్లతో మల్కాజిగిరి మొత్తం 300 వార్డులతో అశాస్త్రీయంగా మూడు ముక్కలు చేశారు.

చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్లతో జీహెచ్ఎంసీ, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లతో సైబరాబాద్ కార్పొరేషన్, మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్లతో మల్కాజిగిరి కార్పొరేషన్లుగా విభజించారు. మజ్లిస్ పార్టీకి 60–70 స్థానాలు వచ్చేలా జీహెచ్ఎంసీని ఏర్పాటు చేశారు. హిందువులు అధికంగా ఉండే ఎల్బీనగర్, ఉప్పల్, కుత్బుల్లాపూర్ వంటి ప్రాంతాలను జీహెచ్ఎంసీ నుండి వేరుచేసి ముస్లింలు అధికంగా ఉండే చార్మినార్, గోల్కొండ, రాజేంద్రనగర్‌కు తోడుగా ఖైరతాబాద్, సికింద్రాబాద్, శంషాబాద్ జోన్లలో చేర్చారు. ఖైరతాబాద్‌లోని జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, సికింద్రాబాద్‌లోని కవాడిగూడ, ముషీరాబాద్, శంషాబాద్‌లోని జల్‌పల్లి, బడంగ్‌పేట ప్రాంతాల్లో ముస్లింలు అధికంగా ఉండడంతో జీహెచ్ఎంసీలో మజ్లిస్ బలం పెరగడం ఖాయం. కార్పొరేషన్ల ఏర్పాటులో కుట్రలున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాభిప్రాయం లేకుండా, రాజకీయ పార్టీలతో అఖిలపక్షం ఏర్పాటు చేయకుండా నిర్ణయం తీసుకున్నారనే విమర్శలున్నాయి. మరో కీలకాంశం కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జనగణన ప్రారంభిస్తున్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా సరిహద్దులు మారుస్తూ కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు. జనగణనను దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయవాడ, తిరుపతి గ్రేటర్ నిర్ణయాలను వాయిదా వేసిన సంగతి ఇక్కడ గమనార్హం.

ఆదిలోనే మజ్లిస్ పార్టీ వ్యూహాలను, బలాన్ని అడ్డుకోకపోతే దీర్ఘకాలిక పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని గత అనుభవాలే నిరూపిస్తున్నాయి. 2009 తప్పిదాలతో భారీగా నష్టపోవాల్సి వచ్చింది. ఇప్పుడు గ్రేటర్‌లో కార్పొరేషన్ల విషయంలో కూడా స్పందించకపోతే నగరంలో ఆ పార్టీ ఆగడాలను అంతులేకుండాపోతుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ కుహనా సెక్యులర్‌వాదంతో మజ్లిస్ పార్టీకి దాసోహం అన్నాయి. ఈ ఆగడాలను అడ్డుకోవాల్సిన బీజేపీ కూడా క్రియాశీలకంగా వ్యవహరించకుండా ప్రకటనలకే పరిమితమైతే చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టవుతుంది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ముస్లిం ఓట్ల శాతం గురించి మాట్లాడుతూ నిజామాబాద్‌లో 41శాతం, కరీంనగర్‌లో 23, ఆదిలాబాద్‌లో 27, నల్లగొండలో 24, భైంసాలో 54, బోధన్‌లో 55, జహీరాబాద్‌లో 44, కోహీర్‌లో 55, తాండూరులో 44, సంగారెడ్డిలో 34, కోరుట్లలో 33 శాతం ముస్లిం ఓట్లు పెరిగాయని అన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల సంఘానికి తెలియజేస్తామని చెప్పారు. ఓట్ల విషయంలో అక్రమాలు జరుగుతున్నప్పుడు స్థానిక పార్టీ నాయకులు ఏమి చేస్తున్నారనే ప్రశ్న ఉదయిస్తుంది. అంతా అయిపోయాక న్యాయపోరాటం చేస్తానంటే అది న్యాయస్థానం ముందు కూడా నిలబడదు. ఇదే సమయంలో అసదుద్దీన్ ఓవైసీ తెలంగాణలో త్వరలో నిర్వహించనున్న ఓటర్ల జాబితా ప్రక్షాళన 'సర్' పై పార్టీ శ్రేణులను, ముస్లింలను అప్రమత్తం చేస్తూ ముస్లిం ఓట్లు 'సర్'లో ఉండేలా చూసుకోవాలని

పిలుపు నిచ్చారు. ఇదే సమయంలో ఒకవైపు పాతబస్తీ వంటి ముస్లిం ప్రాంతాల్లో హిందువుల ఓట్లు తొలగిపోకుండా, మరోవైపు అక్రమ ఓటర్లు, వలస ఓటర్లు జాబితాలో ఉండకుండా బీజేపీ తమ పార్టీ శ్రేణులను జాగృతం చేయడంతోపాటు త్వరలో జరిగే నియోజక వర్గాల పునర్విభజనలో కూడా గత తప్పిదాలు పునరావృతం కాకుండా చూడాలి.

అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి మారుపేరుగా మజ్లిస్ పార్టీ నిలుస్తున్నందుకే పాతబస్తీలో వరుసగా మేము గెలుస్తున్నామని ఆ పార్టీ నేతలు చెబుతున్నా అది అవాస్తవం. పాతబస్తీలో గెలుస్తున్న ఆ పార్టీ అక్కడ అభివృద్ధికంటే మత రాజకీయాలకే ప్రాధాన్యతను ఇస్తూ సెంటిమెంట్‌తో విజయాలు సాధిస్తుంది. నాలుగు దశాబ్దాలకుపైగా అక్కడ గెలుస్తున్న మజ్లిస్ పార్టీ హయాంలో పాతబస్తీ అభివృద్ధి ఏమేరకు జరిగిందో అందరికీ తెలిసిందే. 2000 సంవత్సరం తర్వాత వెలిసిన ప్రాంతాలతో పోలిస్తే పాతబస్తీ పూర్తిగా వెనుకబడడానికి కారణం ఎవరో ఆ పార్టీ నేతలే చెప్పాలి. ప్రభుత్వాలతో అంటకాగే ఓవైసీ సోదరులు పాతబస్తీ అభివృద్ధి కంటే తమ వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యతను ఇస్తున్నారని చెప్పడానికి ఆ ప్రాంత దుస్థితి తార్కాణంగా నిలుస్తోంది. ఒకానొక సందర్భంలో మాజీ సీఎం రోశయ్య అసెంబ్లీలో మాట్లాడుతూ పాతబస్తీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నా అక్కడి స్థానిక రాజకీయాలు, నేతలు సహకరించడం లేదని నర్మగర్భంగా చెప్పడం ఇక్కడ గమనించాల్సిన అంశం. గ్రేటర్‌లో చేపట్టిన మెట్రో రైలు మొదటి దశలో పాతబస్తీలో పనులు పూర్తి కావాల్సి ఉన్నా మజ్లిస్ పార్టీ అడ్డుకోవడంతోనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పనులు ప్రారంభించడానికి వెనకడుగు వేసిందనేది బహిరంగ రహస్యం. దీంతో పాతబస్తీ అభివృద్ధి రెండు దశాబ్దాలు వెనక్కి వెళ్లింది.

బీజేపీ వ్యతిరేక పార్టీలు వాటి స్వార్థ ప్రయోజనాల కోసం లౌకికవాదం పేరుతో మత ఛాందసంతో రాజకీయాలు నడిపే మజ్లిస్ పార్టీతో అంటకాగుతూ ఆ పార్టీకి పూర్తిగా దాసోహం అంటున్నాయి. రాజకీయాలు ఎలా ఉన్నా సమాజ శ్రేయస్సు దృష్ట్యా ఇలాంటి శక్తులను ఆదిలోనే అడ్డుకోవాల్సిన ఆవశ్యకత అందరిపైన ఉంది. గ్రేటర్‌లో కార్పొరేషన్ విభజనతో పాటు త్వరలో జరిగే 'సర్' ప్రక్రియ, నియోజకవర్గాల పునర్విభజనలో జాగృతం కాకపోతే మరో తరం నష్ట పోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయి. ఇప్పటికే పాతబస్తీలో వారి ఆగడాలతో ఎంతో మంది హిందువులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లారు. ఇప్పటికైనా మేలుకోకపోతే ఇకపై కొత్త నగరం వంతు అవుతుంది. అందరూ కలిసికట్టుగా విస్తరిస్తున్న విష సర్పం కోరలు తీయాల్సిన అవసరం ఉంది. లేకపోతే మరో పాతిక సంవత్సరాలు దుష్ట శక్తులతో బాధపడాల్సి వస్తుంది.

– శ్రీపాద

ఆ కుటుంబంతో వెళ్లడ

ఫిబ్రవరి 23న ఉదయనిధి తన తండ్రిని జాతీయ బరిలోకి నెట్టేశారు. దీనితో ఒక్కసారిగా ఇండీ కూటమిలో కదలికలాంటిది రాక తప్పలేదు. ఉదయనిధి కోయంబత్తూరులో మాట్లాడుతూ, 'మా నాన్న నాయకుడు. ఆయన తమిళనాడుకు ఎలాగూ మార్గదర్శకుడే. కానీ యావత్తు భారతదేశానికి కూడా నాయకత్వం వహించగల సత్తా ఆయనకే ఉంది అన్నారు. బీజేపీ మీద ప్రజాస్వామ్య పోరాటానికి నాన్నగారే నాయకత్వం వహించాలని కొంతమంది ప్రతిపక్ష రాజకీయవేత్తలు వివరీతంగా అభిప్రాయపడుతున్నారని కూడా చెప్పారాయన. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలలో సీట్ల పంపకానికి సంబంధించి కాంగ్రెస్‌తో చర్చలు జరుగుతున్న సమయంలో ఉదయనిధి ఈ మాట అనడం చాలా ప్రశ్నలకు తావిస్తుంది. నిజానికి సీట్ల పంపకం అన్నంత గౌరవప్రదమైన మాట ఇక్కడ అవసరం లేదు కదా అని చాలామంది నిట్టూర్చవచ్చు. దీనిని కాదనలేం. డీఎంకే వేసే సీట్ల ముష్టి కోసం జరుగుతున్న కాంగ్రెస్ దేబరింత అనవచ్చు. ఇండీ కూటమి నేతగా మమత బెనర్జీ అయితే మహా భేషుగ్గా ఉంటుందని గతంలోను ఒకసారి ఒక మాట వచ్చింది. కానీ ఆ రెండు రాష్ట్రాలకు ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ఆ రాష్ట్ర నేతలిద్దరినీ ఒకే పదవికి (ఇండీ నాయకత్వం) ప్రతిపాదించడం ఏమిటో! ఇలాంటి ప్రతిపాదన రావడం ఎందుకో అన్న ప్రశ్న మాత్రం గట్టిగానే వినిపిస్తున్నది.

ఆ ప్రశ్నలు ఎలా ఉన్నా, కాంగ్రెస్ మాజీ ప్రముఖుడు మణిశంకర్ అయ్యర్ కూడా ఇండీ కూటమిని నడిపించగల సమర్థ నేతను స్టాలిన్‌లోనే దర్శించడం విశేషం. ఇండీ కూటమికి ఆయన పదహారణాల సరైన నేత అని ఆయన పొగిడారు. అసలు రాహుల్ భవిష్యత్తు ఇక మీద స్టాలిన్ మీదే ఆధారపడి ఉందని కూడా తేల్చేశారు. నిజమే, రాహుల్ నాయకత్వంలోని కాంగ్రెస్‌తో పొత్తంటే భాగస్వాములు హడలిపోతున్నారు. బిహార్, ముంబై కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు చూసిన తరువాత ఎవరికైనా కాంగ్రెస్ వెంట వెళ్లాలంటే వణుకు పుడుతుంది. స్టాలిన్ కాస్త దయతలచి ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండదు కానీ, మూడో నాలుగో సీట్లు ఇస్తాం పోటీ చేసుకోండని కరుణించారు. మణిశంకర్ అయ్యర్ హఠాత్తుగా గళం ఎత్తారు. నేను నెహ్రూవియన్ అవుతాను. ఇందిరావియన్‌నీ అవుతాను. రాజీవీయన్‌ని అన్నా సంతోషమే. కానీ కచ్చితంగా రాహులూవీయన్‌ని మాత్రం కాదు అని కుండబద్దలు కొట్టేసి మరీ చెప్పారు. 2029 ఎన్నికలలో బీజేపీతో పోరాటానికి స్టాలిన్ వినా మరొక నేత ఎవరూ లేరని అయ్యర్ ఢంకా బజాయించారు. ఇక్కడ గమనించవలసిన అంశం ఒకటి ఉంది. ఉదయనిధి స్టాలిన్ చెప్పేదే తన తండ్రి జాతీయ నాయకత్వానికి ఉన్న తిరుగులేని అర్హత. దానితో వచ్చే ఫలితంలో ఎవరికీ వాటా ఉండదు. కానీ మణిశంకర్ దృష్టి వేరు. ఏనాడో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోకి వెళ్లిపోయిన ఇండీ కూటమిని బలోపేతం చేసి, రాహుల్ ప్రధాని కావడానికి మార్గం సుగమం చేయడం. అదీ స్పష్టంగానే చెప్పారు. ఒక పూర్తి సమయం రాజకీయవేత్త వచ్చి ఇండీ కూటమికి రెండేళ్ల పాటు మందులూ మాకులూ ఇస్తే దానికి జీవంవస్తుందని ఆయన నమ్మకం మాత్రమే. తద్వారా

ఇండియా బ్లాక్ నేత ఎవరు? ఈ ప్రశ్న జాతినేమీ వేధించడం లేదు కానీ ఒకరిద్దరిని బాగా తొలుస్తోంది. మళ్లీ వారిద్దరిలో ఎవరి బాధ వారిది. అందులో తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ అనే వీర తమిళుడు, శూర హిందూ వ్యతిరేకి ఒకరు. రెండోవారు మలయాళీయే అయినా ఏనాడూ అక్కడ నివసించని మణిశంకర్ అయ్యర్ అనే వ్యర్థజీవి. వీర సావర్కర్‌ని దూషించడమే కాదు, నరేంద్ర మోదీని టీ అమ్ముకునేవాడని విమర్శించిన కుసంస్కారి. త్వరలో ఎన్నికలకు వెళ్లబోతున్న తమిళనాడులో ఇప్పుడు ఉదయనిధి ఇలాంటి వాదన ఎందుకు తెర మీదకు తీసుకువచ్చారు? అలాగే ఖాళీ అయిపోయి, కాళ్లు బారజాపుకుని కూర్చున్న మణిశంకర్ కూడా అదే విషయాన్ని తెర మీదకు ఎందుకు లాక్కొచ్చారు? ఉదయనిధి బాధ, బహుశా ఎంతకాలమని ఉప ముఖ్య మంత్రిగా ఉండిపోతారు? తండ్రి ఆ కుర్చీ ఖాళీ చేస్తేనే కదా, ప్రజాస్వామ్యం కోసం పాటుపడుతున్న ఆయన అధిరోహించగలిగేది! కాబట్టి జూ.స్టాలిన్ చక్కగా తేల్చేశారు. తన తండ్రి స్టాలిన్ తమిళనాడుకు ఎలాగూ సమర్థుడైన నాయకుడు. అదనంగా దేశానికి నాయకత్వం వహించగల సామర్థ్యం కూడా సంతరించుకున్నాడని జాతికి ఎరుకపరిచాడాయన. ఈ ఇద్దరినీ మించిన ఘనుడు, మాజీ ప్రధాని మన్‌మోహన్ సింగ్ ప్రత్యేక మీడియా కార్యదర్శి సంజయ్ బారు అయితే, జాతీయ నాయకత్వానికి మమతా బెనర్జీ సరైన వ్యక్తి అని మరొక బాణం విసిరారు. మొత్తానికి అటు స్టాలిన్, ఇటు మమత పేర్లు నాయకత్వం కోసం కాసేపు హోరెత్తాయి. ఈ హోరులో ఎగిరిపోయిన పేర్లు రెండు– రాహుల్‌గాంధీ, ఆయన అపూర్వ సహోదరి, రెండు ఇంటి పేర్ల ప్రియాంకా గాంధీ వాద్రా.

మంటే కుక్కతోక పట్టుకుని...

రాహుల్ ప్రధాని అవుతారు అంటున్నారు మణిశంకర్. ఇది సాధ్యమేనా అని! ఇంతలోనే ఏమైందో, స్టాలిన్ మీద మణిశంకర్ అభిప్రాయం నాలుగు రోజులకే మారిపోయింది. మమతా బెనర్జీకి ఇండీ కూటమి నాయకత్వం అప్పగించవలసిందని ఆయన నేరుగా రాహుల్ గాంధీకే సలహా ఇచ్చినట్టు వార్తలు వచ్చాయి.

ఎవరు మాట్లాడించారో గానీ, మన్మోహన్‌కి మీడియా సలహాదారుగా పనిచేసిన సంజయ్ బారు ఒక చిలిపి ప్రతిపాదన, ఒక వాస్తవ ప్రకటన



చేశారనాలి. ఒకనాటి తన బాస్‌కు యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్ అంటూ అరుదైన పురస్కారం ఇచ్చిన బారు చిలిపి మాట ఏమిటీ అంటే, ఇండీ కూటమి నాయకత్వానికి మమత ఒరలో కత్తిలా సరిగ్గా సరిపోతుందట. యాంకర్ మళ్లీ అడగలేదు కాబోలు. లేకుంటే ఆమె ఇండీ కూటమికి నాయకత్వం వహించడానికే పుట్టింది, మీకు తెలియదా అనేవారే. ఆమె స్వయం నిర్మిత నేత అట. ఇక వాస్తవ ప్రకటన. అలనాడు సోనియాగాంధీ-మన్మోహన్ సింగ్ ద్వయం గురించి చెప్పగానే విజయం తన్నుకుంటూ వచ్చి ఒళ్లో వాలినట్టు, ఇవాళ మల్లికార్జున ఖర్గే-రాహుల్ ద్వయం అన్న నినాదం వినిపిస్తే అలాంటిదేమీ జరగదని అంగీకరించారు. మరొక తర్కం కూడా బారు జాతి ముందు పెట్టారు బారు. మహిళను నాయకురాలిగా నిలపడం వ్యూహాత్మకంగా మంచి అడుగు అవుతుందట. మహిళల స్వాతంత్ర్యా నికి ఆమె ప్రతీకగా నిలుస్తుందట. అంతేనా! ఇటీవలే బీజేపీ వైపు వెళ్లిపోయిన మహిళా ఓటర్లను అలవోకగా తిరిగి తెచ్చుకునే అవకాశం ఇబ్బడిముబ్బడిగా ఉంటుందట.

మణిశంకర్ చెప్పిన ఇంకొన్ని విషయాలు ఉన్నాయి. వాటిని వదిలి పెట్టడం న్యాయం కాదు. ఆయనను కాంగ్రెస్ గతంలోనే బహిష్కరించింది. నరేంద్ర మోదీని టీ అమ్ముకునేవాడు దేశానికి ప్రధాని ఏమిటి వంటి పచ్చి పొగరుమోతు వ్యాఖ్యలు చేసినవాడే ఈ మణిశంకర్. కాబట్టి ఇప్పుడు రాహుల్‌ను తిట్టినా, స్టాలిన్‌ను ఆకాశానికెత్తినా తమకేమీ అభ్యంతరం లేదని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. కానీ గాంధీ-నెహ్రూ కుటుంబం అంటే ప్రాణం ఇచ్చేస్తామని చెప్పుకునేవారు అక్కడక్కడా ఇంకా ఉన్నారు. అందులో కేరళకే చెందిన రమేశ్ చెన్నితల ఒకరు. ఆయన మణిశంకర్‌ని 'అదో కిరాయి గొంతు' అని ఈసడించారు. మణిశంకర్ వంటివారు కాలం చెల్లిన నాయకులు. వాళ్లకి ఇప్పుడు విలువే లేదు. పార్టీలో అసలు స్థానమే లేదని చెన్నితల అన్నారు. మణిశంకర్ మీద కాంగ్రెస్ మండిపాటుకు ఇంకొక కారణం కూడా ఉంది. కేరళలో మార్క్సిస్టుల పాలన మహాద్భుతమని, అక్కడ మళ్లీ సీపీఎం గెలిచి తీరుతుందని మణిశంకర్ కేరళ వెళ్లినప్పుడు ఒక ప్రకటన ఇచ్చారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ముఖ్యమంత్రికి నమూనా అనుకోవచ్చని కూడా గట్టిగా అభిప్రాయపడ్డారు. ఇది పుండు మీద కారం రాసినట్టే అవుతుందని వేరే చెప్పాలా! శశి థరూర్ సిద్ధాంతాలూ అవీ లేని కెరీరిస్టు అని విమర్శించారు. కేసీ వేణుగోపాల్‌ని ఒక రౌడీ అని తేల్చి పారేశారు. ఆ ఇద్దరూ కూడా కాంగ్రెస్ నాయకులే. కేరళ నుంచి వచ్చినవారే. రేపు సీపీఎంతో జరిగే ఎన్నికల యుద్ధంలో పాల్గొనవలసిన వారే కూడా.

అయినా ఇండీ కూటమి నాయకత్వం గురించి ఇప్పుడేమిటీ రచ్చ! అసలు కూటమి నేతల సమావేశం ఏమైనా జరిగిందా? అక్కడ ఎవరినైనా నాయకుడు అంటూ దండేసి చూపించారా అని ప్రశ్నిస్తున్నారు జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా. ఖేలో ఇండియా పేరుతో ప్రస్తుతం గుల్‌మార్గ్‌లో జరుగుతున్న ఆటల పోటీ కోసం వచ్చిన ఒమర్ మధ్యలో ఖాళీ సమయంలో విలేకరులు ఎవరినో ఈ మాట అడిగారు. మమతా బెనర్జీ పేరు ఎక్కడ ఎవరు ఎలా చెప్పారు అని కూడా ఆయన ప్రశ్నించారు. రాహుల్ మీద ప్రత్యక్షంగా ప్రశంస కురింపి,పరోక్షంగా కోపాన్ని కూడా చక్కగా వ్యక్తం చేశారు ఒమర్. మణిశంకర్ అయ్యర్ తన సొంత అభిప్రాయమేదో అది వెల్లడించారు. దానిని ఎవరైనా ఎలా ఆపగలం అని ఎలాంటి శషభిషలు లేకుండానే అన్నారాయన. ఇది లోపలున్న కోపాన్నే తెలియచేస్తుంది. ఇంకా, నాయకుడు ఎవరు అన్నది అంతిమంగా నిర్ణయించేది ఇండీ కూటమి నేతలు. అలా నిర్ణయించిన నేతను అంతా ఆమోదించాల్సిందే నని ఒమర్ తీర్పు కూడా ఇచ్చేశారు. కానీ రాహుల్ వివక్ష నేతగా అద్భుతంగా రాణిస్తున్నారనీ, ఎవరైనా ఆ పాత్ర నుంచి ఇంకా ఏం ఆశించగలరని కూడా అన్నారు ఒమర్. ఇది ప్రశంసే కదా! బీజేపీని కలలో కూడా వదిలి పెట్టకుండా విమర్శించేవారు ఎవరూ అంటే అది రాహుల్. బీజేపీని కలలోనూ వ్యతిరేకించే వ్యక్తి ఎవరైనా ఉంటే ఆయన రాహుల్ మాత్రమే. ప్రతి విషయంలోను ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటున్న విపక్ష నేత ఎవరూ అంటే రాహుల్ ఒకడే అని ఒమర్ తీవ్ర స్థాయిలో ప్రశంసలు కురిపించారు.

ఇన్నాళ్లకి ఒక వాస్తవం విపక్షాలకు అర్థమవు తున్నట్టుంది. గాంధీ-నెహ్రూ కుటుంబాన్ని పట్టుకుని వెళ్లడమంటే, కుక్క తోక పట్టుకుని గోదారి ఈదడమేనన్న పరమ సత్యమేదో వారి బుద్ధియందు జనిస్తున్న సూచనలు పొడసూపుతున్నాయి. అంతవరకు చెప్పుకోవచ్చు. ఇది దేశానికి గొప్ప శుభపరిణామం కావాలని ఆశిద్దాం.

– జాగృతి డెస్క్

తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సమయంలో, కొద్ది రోజుల వ్యవధిలోనే రెండు కలవరపరిచే ఘటనలు చోటు చేసుకోవడం విస్తృత చర్చకు దారితీసింది. రాజకీయ, సామాజిక, ప్రజా భద్రతకు సంబంధించిన ఈ పరిణామాలు ప్రకంపనలు సృష్టించాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామంలో జాతర సందర్భంగా ఆలయం ఆవరణలో ఒక కుటుంబంపై జరిగిన దాడిలో రెండు నెలల పసిపాప మరణించిన ఘటన యావత్ రాష్ట్రాన్ని దిగ్భ్రాంతిలో ముంచింది. మరోవైపు, కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యే కార్యాలయంపై దాడి, విపక్ష నేతల నిర్బంధం రాష్ట్ర రాజకీయాలను వేడెక్కించింది. ఈ రెండు సంఘటనలు సామాన్యుల రక్షణ, పోలీసు వ్యవస్థ నిష్పక్షపాత వైఖరిని, ప్రజాస్వామ్య హక్కులను ప్రశ్నార్థకం చేశాయి.

ఫిబ్రవరి 18వ తేదీ రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా, కుమ్మెరలో శ్రీ మల్లికార్జున స్వామి జాతర జరిగింది. ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు హాజరయ్యే ఈ జాతరకు ఈసారి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. రజక కుటుంబానికి చెందిన చంద్రకళ, ఆమె కొడుకు గణేశ్, కోడలు మౌనిక, వాళ్ల రెండు నెలల పసిపాపతో కలిసి దైవ దర్శనానికి వెళ్లారు. గణేశ్ బీసీ వర్గానికి, మౌనిక ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు. వారిది ప్రేమ వివాహం. వారికి ఇటీవలే పసిపాప జన్మించింది. 18వ తేదీ రాత్రి కుటుంబసభ్యులందరూ ఆలయం ముందు క్యూలో నిలబడినప్పుడు, క్యూ నిర్వహణలో ఉన్న స్థానికుడు ఉండ్యాల శ్రీనివాస్ రెడ్డి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశాడు. టికెట్ వ్యవస్థ లేనప్పుడు డబ్బులు ఎందుకు అని అక్కడున్న మహిళలు ప్రశ్నించడంతో, శ్రీనివాసరెడ్డి దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో మౌనిక కింద పడిపోయింది. విషయం తెలుసుకున్న మౌనిక భర్త గణేశ్ అక్కడికి వచ్చి శ్రీనివాసరెడ్డిని నిలదీశాడు.

గణేశ్‌ను గ్రామ సర్పంచ్ తుకారాంరెడ్డి సహా పలువురు కులం పేరుతో దూషిస్తూ.. దాడి చేసి, ఒక గదిలో బంధించి ఇనుప రాడ్లు, కొబ్బరి కాయలతో దారుణంగా కొట్టారు. ఆ తోపులాటలో సంగం మధురెడ్డి తమ పసిపాపను తన్నినట్లు మౌనిక రోదిస్తూ తెలియజేసింది. ఆ దాడిలో పసిపాప చలనం లేకుండా పడిపోయిందని కన్నీరు మున్నీరయ్యింది. ఈ పరిణామానికి సంబంధించి తమను వదిలేయాలని ప్రాధేయపడ్డా.. అక్కడి అగ్రవర్ణాల వాళ్లు వదిలేయలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే "కాళ్లు పట్టుకుంటాం, వదిలేయండి" అని మహిళలు వేడుకున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

అయినప్పటికీ ఆ సమయంలో అక్కడే ఉన్న పోలీసులు సక్రమంగా స్పందించలేదని, తమ విధులను సరిగా నిర్వర్తించలేదని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే, ఫిబ్రవరి 21వ తేదీన ఉదయం మౌనిక తన కూతురు తీవ్రంగా గాయపడి అనారోగ్యంతో బాధపడుతూ స్పందించడం లేదని గమనించి నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి హుటాహుటిన తీసుకువెళ్లింది. కానీ, అప్పటికే శిశువు మృతి చెందిందని వైద్యులు ధృవీకరించారు. ఈ దుర్వార్త రాష్ట్రమంతటా వ్యాపించడం సంచలనం సృష్టించింది. పైగా ఈ దుర్ఘటన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో జరగడం మరింత అలజడి రేపింది.

పోలీసుల వాదనలు

ఈ పరిణామం రాష్ట్రమంతటా ప్రకంపనలు సృష్టించడం, పోలీసుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తడంతో ఎట్టకేలకు నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలోని వివరాల ప్రకారం సంఘటన జరిగిన రాత్రే గణేశ్ రాయితో తన తలను గాయపరిచాడంటూ శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదైందని పేర్కొన్నారు.

గణేశ్ కుటుంబం పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా, వారి ఫిర్యాదును మొదట్లో జనరల్ డైరీలో నాన్ కాగ్నిజబుల్‌గా నమోదు చేశారు. కోర్టు అనుమతి తర్వాత ఫిబ్రవరి 23వ తేదీన మాత్రమే కేసు నమోదు చేశారు. ఇక, రెండు నెలల శిశువు మరణాన్ని అనుమానాస్పద మృతిగా నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించారు.

మరణానికి కారణాలు అధికారికంగా నిర్ధారించేందుకు ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ హిస్టోపాథాలజీ నివేదిక కోసం నిరీక్షిస్తున్నట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు.

మరోవైపు.. ఫిబ్రవరి 22వ తేదీన పసిపాప తల్లి మౌనిక అదనపు వాంగ్మూలం ఇవ్వడంతో, SC/ST (POA) చట్టం సెక్షన్లు 3(1) (r), 3(1)(o), 3(2)(v) కింద అదనపు కేసు నమోదైంది. ఫిబ్రవరి 23వ తేదీన ప్రధాన నిందితులైన శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డిలను అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. వీరితో పాటు.. ఈ కేసులో నిందితులైన మరో ఆరుగురు.. గ్రామ సర్పంచ్ తుకారాంరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కన్నీరెడ్డి, కటికె నరేష్, సతీష్‌రెడ్డి, మాధవ్‌రెడ్డి పరారీలో ఉన్నారు. వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయని పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించారు. అంతేకాదు.. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్, డీఎస్పీ శ్రీనివాస్ కుమ్మెర గ్రామాన్ని సందర్శించి సంఘటన స్థలాన్ని పరిశీలించారని పోలీసు శాఖ వెల్లడించింది.

ప్రభుత్వం నుంచి స్పందన కరువు- మంత్రుల మౌనం

ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నుండి అధికారిక స్పందన గానీ, తదుపరి చర్యలపై ఆదేశాలు గానీ వెలువడకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. ఈనెల 23వ తేదీ రాత్రి కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులు సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశం తర్వాత విలేకరులు ప్రశ్నించినప్పటికీ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి మౌనంగా ఈ అంశాన్ని దాటవేశారు. మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాత్రం జిల్లా ఎస్పీతో మాట్లాడానంటూ ముక్తసరిగా మాత్రమే సమాధానం చెప్పారు. ఈ పరిణామంతో ప్రభుత్వం తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు నిందితులను వెనుకేసుకొస్తున్నారని, దీనికి కారణం అధికార పార్టీతో వారికున్న సంబంధాలేనని బీజేపీ సహా విపక్షాలు, సామాజికసంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. సర్పంచ్ తుకారాంరెడ్డి ఒక ఎమ్మెల్సీ బావమరిది అని తెలియడంతో ఆ ఆరోపణలకు

బలం చేకూరింది. బీసీ సంఘాలు, వివిధ కుల సంఘాలు వరుసగా 48 గంటల పాటు పెద్ద ఎత్తున నిరసన తెలిపిన తర్వాతనే ప్రభుత్వం, పోలీసులు ఆ మాత్రం కదిలారన్న వాదనలు జోరుగా వినిపిస్తున్నాయి.

జాతీయ స్థాయిలో చర్చ

ఈ పరిణామం రాష్ట్రంలోనే కాదు.. జాతీయ స్థాయిలో కలకలం సృష్టించింది. జాతీయ మానవ హక్కుల సంఘం (NHRC) ఈ ఘటనపై స్వయంగా కేసు నమోదు చేయడంతో పాటు.. సంబంధిత అధికారుల నుండి వివరణాత్మక నివేదిక కోరింది. బీజేపీ పార్లమెంటు సభ్యులు ఈ విషయాన్ని జాతీయ స్థాయిలో లేవనెత్తి ఒత్తిడి తీసుకువచ్చారు.

ఫిబ్రవరి 24వ తేదీన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, రాష్ట్ర అధికార ప్రతినిధులు దిలీప్ ఆచారి, డాక్టర్ సోలంకి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు తదితరులతో కలిసి కుమ్మరకు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంతేకాదు.. అంతకుముందే బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్ గౌడ్ స్వయంగా కుమ్మరకు వెళ్లి డీఎస్పీతో మాట్లాడారు. పసిపాప మరణంపై హత్య కేసు నమోదు చేయాలని, SC/ST అట్రాసిటీ చట్టం కింద కఠినంగా కేసు నమోదు చేసి బాధ్యులైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పసిపాప మృతిపై మహిళా కమిషన్ సుమోటో కేసు నమోదు చేయాలని కూడా కోరారు.

కామారెడ్డిలో హింస, నిర్బంధం

నాగర్‌కర్నూల్ ఘటనతో రాష్ట్రం ఓవైపు.. అట్టుడికి పోతుండగానే.. కామారెడ్డిలో మరో దారుణం చోటు చేసుకుంది. కళాశాల భూమి వివాదం నేపథ్యంలో ఫిబ్రవరి 20, 21 తేదీల్లో కామారెడ్డిలో హింసాత్మక పరిణామాలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్ కార్యకర్తలు.. బీజేపీ ఎమ్మెల్యే కటిపల్లి వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయంపై దాడి చేశారు. పోలీసులపై రాళ్లు కూడా విసిరారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ఇద్దరినీ ఓడించి ''జెయింట్ కిల్లర్''గా ప్రజాదరణ పొందిన నాయకుడు. వెంకటరమణారెడ్డి క్యాంప్ ఆఫీసుపై దాడి వెనుక కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రమేయం ఉందని బీజేపీ నేతలు ఆరోపించారు.

ఈ పరిణామాలతో బాధిత కార్యకర్తలను పరామర్శించేందుకు, ఎమ్మెల్యేకు సంఘీభావం తెలిపేందుకు కామారెడ్డికి బయలుదేరిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావును ఫిబ్రవరి 22వ తేదీ రాత్రి పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. బాన్సువాడలో గాయపడిన కార్యకర్తలను కలిసేందుకు ప్రయాణమైన ఆయనను అడ్డుకున్నారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ మాత్రం పోలీసుల కన్నుగప్పి కామారెడ్డి చేరుకుని, ఎమ్మెల్యేకు సంఘీభావం తెలిపి, దాడిని ఎంపీ ఖండించారు.

కేంద్ర మంత్రుల మండిపాటు

తెలంగాణలో పరిస్థితులు ఆందోళన కలిగించే విగా ఉన్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఎంపీలు, ఎమ్మెల్యేల హౌస్ అరెస్ట్‌లను అప్రకటిత అత్యవసర స్థితితో పోల్చారు. దాడి చేసినవారిపై చర్య తీసుకోకుండా, విపక్ష నేతను నిర్బంధించడం నిరంకుశ పాలనకు నిదర్శనమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రతిస్పందించారు.

హౌస్ అరెస్ట్ నుండి విడుదలైన తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ – కరీంనగర్‌లో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు రెండూ బీజేపీ గెలవడం, ఆదిలాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ తదితర జిల్లాలలో బీజేపీ అతిపెద్ద పార్టీగా నిలవడం వంటి ఎన్నికల పరిణామాలు చూసి తట్టుకోలేక కాంగ్రెస్ పార్టీ అణచివేత మార్గాన్ని ఎంచుకుందని ఆరోపించారు.

రెండు ఘటనల్లోనూ కాంగ్రెస్ మార్క్

కుమ్మర, కామారెడ్డి రెండు చోట్లా బాధితులు బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వెనుకబడిన కుటుంబాలు. అంతేకాదు.. ఈ ఘటనల్లో నిందితులకు అధికార పార్టీతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధాలున్నాయని ఆరోపణలు వచ్చాయి. రెండు చోట్లా పోలీసులు మొదట్లో ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించలేదని, బాధితులను పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ప్రజల నుంచి, విపక్షాల నుంచి విమర్శలు, ఒత్తిళ్లు వచ్చిన తర్వాత పోలీసులు తూతూ మంత్రంగా స్పందించారన్న ఆరోపణలున్నాయి. ఇక, కామారెడ్డిలో పరిస్థితులు ప్రస్తుతం కొంత అదుపులో ఉన్నప్పటికీ రాజకీయంగా ఉద్రిక్తత కొనసాగుతోంది.

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రెండే లక్ష్యాలతో నడుస్తోందని బీజేపీ ఆరోపించింది. ఒకటి ఎంఐఎంను కాపాడుకోవడం, రెండోది అవినీతిని కప్పిపుచ్చేందుకు పోలీసు వ్యవస్థను ఉపయోగించుకోవడం. బీసీలు, ఎస్సీలు, హిందూ సమాజంపై దాడులు చేస్తున్నవారికి కాంగ్రెస్ ప్రభుత్వమే రక్షణగా నిలబడుతోందన్న భావన ప్రజల్లో బలపడుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. రెండు ఘటనల్లోనూ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని బీజేపీ స్పష్టం చేసింది.

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రెండే లక్ష్యాలతో నడుస్తోందని బీజేపీ ఆరోపించింది. ఒకటి ఎంఐఎంను కాపాడుకోవడం, రెండోది అవినీతిని కప్పిపుచ్చేందుకు పోలీసువ్యవస్థను ఉపయోగించుకోవడం. బీసీలు, ఎస్సీలు, హిందూ సమాజంపై దాడులు చేస్తున్న వారికి కాంగ్రెస్ ప్రభుత్వమే రక్షణగా నిలబడుతోందన్న భావన ప్రజల్లో బలపడుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. రెండు ఘటనల్లోనూ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని బీజేపీ స్పష్టం చేసింది. ఈ రెండు పరిణామాలు కేవలం రాజకీయ వివాదానికే పరిమితం కాదని, ఇవి తెలంగాణ సమాజంలో అట్టడుగు వర్గాల భద్రత, చట్టాల అమలు, అధికార యంత్రాంగం విశ్వసనీయత, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు సంబంధించిన మౌలికమైన ప్రశ్నలను ముందుకు తెస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికి మౌనం వీడుతుందో చూడాలి.

సుజాత గోపగోని
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

నేడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను సిలికాన్ చిప్ శాసిస్తోంది. ఈ నేపథ్యంలో, భారతదేశాన్ని గ్లోబల్ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0' కింద భారీ నిధులు కేటాయిస్తుండగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా టెక్నాలజీ కేంద్రంగా అవతరించే దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాలు ప్రవేశపెట్టి భారీ రాయితీలను ప్రకటిస్తూ ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, సెమీకండక్టర్ హబ్‌గా రాష్ట్రాన్ని మార్చే ప్రస్థానానికి నాంది పలికింది. రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా అమరావతిని క్వాంటం వ్యాలీగా, విశాఖపట్నాన్ని డేటా సెంటర్ల హబ్‌గా, కర్నూలును సిలికాన్ కార్బైడ్ చిప్స్ తయారీ కేంద్రంగా, తిరుపతిని ఎలక్ట్రానిక్స్, ప్యాకేజింగ్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. అయితే, కాగితాల మీద అత్యద్భుతంగా కనిపిస్తున్న ఈ "సాండ్ టు సిలికాన్ టు సిస్టమ్" బృహత్తర ప్రాజెక్టులు క్షేత్రస్థాయిలో వాస్తవ రూపం దాల్చాలంటే అనేక సవాళ్లను దాటాల్సి ఉంది.

'సిలికాన్ టు సిస్టమ్'

రాష్ట్రంలో ఫ్యాబ్రికేషన్ యూనిట్లకు అవసరమైన అత్యంత స్వచ్ఛమైన నీరు, అంతరాయం లేని హై-క్వాలిటీ విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కొరత, నిపుణుల లేమి, విధానపరమైన జాప్యం ప్రధాన అడ్డంకులుగా ఉన్నాయి. పొరుగు రాష్ట్రాలు, దేశాల నుండి ఉన్న తీవ్ర పోటీని తట్టుకుని గ్లోబల్ సంస్థలను ఆకర్షించాలంటే.. పారదర్శకమైన సింగిల్ విండో విధానం, డెడికేటెడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కారిడార్లు, స్థిరమైన విధానాలతో పాటు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు తక్షణమే అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

2026-27 కేంద్ర వార్షిక బడ్జెట్‌లో ఆంధ్ర ప్రదేశ్‌కు పారిశ్రామికంగా, ఆర్థికంగా దన్ను లభించింది. ముఖ్యంగా మైనింగ్, ఉత్పత్తి, పరిశోధన, క్రమబద్ధీకరణను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలో రేర్ ఎర్త్ కారిడార్‌ను నెలకొల్పాలని నిర్ణయించింది. పూర్వోదయ పథకం కింద ఆంధ్రప్రదేశ్ సహా ఐదు పూర్వోదయ రాష్ట్రాల్లో సమగ్ర ఈస్ట్ కోస్ట్ పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా ఉన్న ఈ కారిడార్.. కోల్‌కతా నుంచి కన్యాకుమారి వరకు 2,500 కిలోమీటర్ల మేర విస్తరించింది. అలాగే సెమీకండక్టర్ పరిశ్రమ అభివృద్ధికి 'ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0' కింద ఏకంగా రూ.40,000 కోట్లు కేటాయించింది. తయారీ యూనిట్లకు 50% వరకు సబ్సిడీని అందిస్తోంది. దీనికి తోడుగా, రాష్ట్ర ప్రభుత్వం 20-25% క్యాపిటల్ సబ్సిడీ, తక్కువ ధరకు భూమి, నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తూ నూతన పారిశ్రామిక విధానాలను ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌లో రూ.3,161 కోట్లు పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు ప్రోత్సాహకాలుగా కేటాయించింది. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం నాలుగు ప్రధాన నగరాలను నాలుగు ప్రత్యేక హబ్‌లుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. అమరావతిని క్వాంటం వ్యాలీగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. టీసీఎస్, ఐబీఎం సహకారంతో 156-క్విబిట్ సామర్థ్యం గల అత్యాధునిక క్వాంటం కంప్యూటింగ్ సిస్టమ్ ఏర్పాటు ద్వారా భవిష్యత్తు సాంకేతికతకు కేంద్రంగా మారుతోంది. విశాఖపట్నాన్ని ఐటీ, డేటా సెంటర్ల హబ్‌గా అభివృద్ధి చేస్తోంది. గూగుల్ వంటి సంస్థల ఆసక్తితో పాటు, 2047 వరకు పన్ను మినహాయింపు ప్రకటించడం ద్వారా ఇది డేటా సెంటర్ల రాజధానిగా అవతరిస్తోంది. కర్నూలును సెమి కండక్టర్ హబ్‌గా మారుస్తోంది. ఓర్వకల్లులో ఇండిచిప్ సంస్థ రూ.14,000 కోట్ల పెట్టుబడితో భారతదేశపు మొట్ట మొదటి ప్రైవేట్ సిలికాన్ కార్బైడ్ చిప్ తయారీ కేంద్రాన్ని స్థాపిస్తోంది. తిరుపతిని ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు కేంద్రంగా మారుస్తోంది. ఏసీల తయారీ కారియర్ కంపెనీ రూ.1,000 కోట్లతో యూనిట్ పెట్టేందుకు ముందుకు వచ్చింది. అలాగే ఇక్కడే రూ.468 కోట్లతో అధునాతన చిప్ ప్యాకేజింగ్ యూనిట్, ఎలక్ట్రానిక్ వస్తువుల అసెంబ్లింగ్‌కు యూనిట్ ఏర్పాటుకానున్నాయి.

ఎదురవుతున్న అడ్డంకులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెమీ కండక్టర్, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్ల ప్రాజెక్టులు విధానపరంగా, కాగితాల మీద అత్యంత అద్భుతంగా కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వాస్తవ రూపంలోకి తీసుకురావడంలో రాష్ట్రం అనేక క్లిష్టమైన అడ్డంకులను ఎదుర్కొంటోంది. మొదటిది అత్యంత ప్రధానమైనది అత్యున్నత మౌలిక సదుపాయాల కొరత. సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ యూనిట్లకు రోజుకు లక్షలాది లీటర్ల అత్యంత స్వచ్ఛమైన నీరు, సెకను కూడా అంతరాయం లేని, వోల్టేజ్ ఒడుదొడుకులు లేని హై-క్వాలిటీ విద్యుత్ అత్యవసరం. ప్రస్తుతం రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ స్థాయి ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు తక్షణమే పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం ఒక పెద్ద సవాలు. రెండవది, నైపుణ్యం గల మానవ వనరుల లేమి. రాష్ట్రంలో ఐఐటీ తిరుపతి, ఐఐపీఈ విశాఖ, ఐఐఎం విశాఖ వంటి జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఉన్నప్పటికీ, సెమీకండక్టర్ డిజైన్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఫ్యాబ్రికేషన్, క్వాంటం కంప్యూటింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో తక్షణమే పనిచేయగల వేలాది మంది నిపుణుల కొరత స్థానికంగా తీవ్రంగా ఉంది. మూడవది, రెడ్ టేపిజం, విధానపరమైన జాప్యం. వేల కోట్ల రూపాయల భారీ ప్రాజెక్టుల స్థాపనకు అవసరమైన భూసేకరణ, పర్యావరణ అనుమతులు, ఇతర ప్రభుత్వ క్లియరెన్స్‌లు సింగిల్ విండో విధానంలో సకాలంలో రాకపోవడం వల్ల జరిగే జాప్యం, అంతర్జాతీయ పెట్టుబడిదారుల విశ్వాసాన్ని సడలించి వారు వెనక్కి తగ్గేలా చేసే ప్రమాదం ఉంది. దేశీయంగా గుజరాత్, కర్ణాటక, తెలంగాణ వంటి పొరుగు రాష్ట్రాలు కూడా సెమీకండక్టర్ దిగ్గజ సంస్థలను ఆకర్షించడానికి భారీ రాయితీలు, సులభతర వాణిజ్య విధానాలను అమలు చేస్తున్నాయి. అలాగే అంతర్జాతీయ స్థాయిలో తైవాన్, వియత్నాం వంటి దేశాలతో పోటీ పడటం ఆంధ్రప్రదేశ్‌కు మరొక ప్రధాన సవాలు.

ఈ పరిశ్రమలను త్వరగా విజయవంతంగా స్థాపించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ క్రింది చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

పారదర్శకమైన 'సింగిల్ విండో' సిస్టమ్:

మొదటి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం నిజమైన సింగిల్ విండో విధానాన్ని పక్కాగా అమలు

సాకారానికి సూత్రాలు

చేయడం. భారీ పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూసేకరణ, పర్యావరణ అనుమతులు, విద్యుత్, నీటి సరఫరా వంటి అన్ని రకాల ప్రభుత్వ క్లియరెన్స్‌ల ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయాలి. దీనికోసం వివిధ శాఖల సమన్వయంతో పనిచేసే ఒక ప్రత్యేక 'టాస్క్ ఫోర్స్'ను ఏర్పాటు చేయాలి. దరఖాస్తు చేసుకున్న గరిష్ఠంగా 30 రోజుల్లోనే అన్ని అనుమతులు మంజూరు చేసేలా జవాబుదారీతనం తీసుకురావాలి.

డెడికేటెడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కారిడార్లు:

కర్నూలు, విశాఖపట్నం, తిరుపతి, అమరావతి వంటి నాలుగు కీలక ప్రాంతాల్లో ఈ హై-టెక్ పరిశ్రమల కోసమే ప్రత్యేకంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. ఫ్యాబ్రికేషన్ యూనిట్లకు ఒక్క సెకను కూడా అంతరాయం లేని హై-క్వాలిటీ విద్యుత్ కోసం డబుల్ సర్క్యూట్ పవర్ లైన్లు ఏర్పాటు చేయాలి. అలాగే, చిప్ తయారీకి అవసరమైన స్వచ్ఛమైన నీటి కోసం డీశాలినేషన్ ప్లాంట్లు లేదా ప్రత్యేక వాటర్ రిజర్వాయర్లను నిర్మించాలి. ముడిసరుకు తీసుకురావడానికి, తయారైన వస్తువుల లాజిస్టిక్స్ సులభతరం చేయడానికి సమీపంలోని ఓడరేవులు, విమానాశ్రయాలకు గ్రీన్ ఫీల్డ్ కనెక్టివిటీ కల్పించడం అత్యవసరం.

ఇండస్ట్రీ - అకాడెమియా అనుసంధానం

పరిశ్రమలకు నిపుణుల కొరతను తీర్చడానికి విద్యాసంస్థల్లో కేవలం కొత్త కోర్సుల ప్రవేశపెట్టడమే కాకుండా ప్రముఖ యూనివర్సిటీలలో నేరుగా 'చిప్ డిజైన్ ల్యాబ్‌లను' ఏర్పాటు చేయాలి. మారుతున్న గ్లోబల్ టెక్నాలజీ,పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్‌ను నవీకరిస్తుండాలి. చదువుకునే సమయంలోనే విద్యార్థులకు సెమీకండక్టర్ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌లు కల్పించడం ద్వారా వారిని వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్ వంటి సాంకేతిక విభాగాల్లో నిపుణులుగా తీర్చిదిద్దాలి.

స్థిరమైన విధానాలు

భారీ పరిశ్రమలు దీర్ఘకాలిక పెట్టుబడులతో వస్తాయి కాబట్టి, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాలు మారవన్న బలమైన భరోసాను పెట్టుబడిదారులకు కల్పించాలి. అవసరమైతే చట్టబద్ధమైన, న్యాయపరమైన రక్షణ కల్పించడం ద్వారా రాష్ట్రంలో వ్యాపార అనుకూల వాతావరణాన్ని మరింత మెరుగుపరచాలి. ఈ తక్షణ చర్యలను పక్కా ప్రణాళికతో అమలు చేస్తే, రాష్ట్రం అనుకున్న లక్ష్యాన్ని చేరుకుని అంతర్జాతీయ సాంకేతిక కేంద్రంగా అవతరిస్తుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న ప్రస్తుత సబ్సిడీలకు అదనంగా, పరిశ్రమలను వేగంగా ఆకర్షించడానికి ఈ క్రింది ప్రోత్సాహకాలు అత్యవసరం:

జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పీఎల్ఐ స్కీమ్‌కు తోడుగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక 'స్టేట్ పీఎల్ఐ' విధానాన్ని ప్రవేశపెట్టాలి. ఎలక్ట్రానిక్స్, చిప్ తయారీ కంపెనీలు ఉత్పత్తి చేసే ప్రతి మొబైల్, స్మార్ట్ చిప్ లేదా ఎలక్ట్రానిక్ వస్తువు మీద మొదటి ఐదు నుండి ఏడేళ్ల పాటు అదనపు ఆర్థిక రాయితీలు అందించాలి. ఇది పెట్టుబడిదారులకు తమ ప్రారంభ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడానికి విశేషంగా సహాయపడుతుంది. తద్వారా వారు గ్లోబల్ మార్కెట్‌లో పోటీపడి తక్కువ ధరకు నాణ్యమైన ఉత్పత్తులను అందించగలుగుతారు.

సెమీకండక్టర్ ఫ్యాబ్స్, డేటా సెంటర్ల నిర్వహణకు లక్షలాది లీటర్ల అత్యంత స్వచ్ఛమైన నీరు, అలాగే అంతరాయం లేని విద్యుత్ అత్యంత కీలకం. ఈ పరిశ్రమల రోజువారీ నిర్వహణ వ్యయంలో ఇవే సింహభాగం ఆక్రమిస్తాయి. కాబట్టి, సాధారణ వాణిజ్య విద్యుత్ ధరల కంటే తక్కువ ధరకు పరిశ్రమలకు వీటిని అందించాలి. అంతేకాకుండా, రాబోయే కనీసం పదేళ్ల పాటు విద్యుత్, నీటి ధరల్లో ఎలాంటి మార్పులు ఉండవని స్థిరమైన ధరల ఒప్పందాన్ని ప్రభుత్వం చేసుకోవాలి. ఇది కంపెనీలు తమ భవిష్యత్ ఆర్థిక ప్రణాళికలను ధైర్యంగా రూపొందించుకోవడానికి భరోసా ఇస్తుంది.

సాంకేతిక రంగంలో నిరంతర పరిశోధన లేకుండా మనుగడ సాగించడం అసాధ్యం. అమరావతి క్వాంటం వ్యాలీ, రాష్ట్రవ్యాప్తంగా చిప్ డిజైనింగ్ రంగాల్లో వినూత్న పరిశోధనలు చేసే స్టార్టప్‌లు, యువ ఇంజనీర్లు మరియు సంస్థలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రత్యేక ఆర్ అండ్ డి ఫండ్స్ కేటాయించాలి. వారు కనుగొన్న నూతన ఆవిష్కరణ లకు మేధో సంపత్తి హక్కులు నమోదు చేసుకోవడానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించడం లేదా వారికి ఉచితంగా చట్టపరమైన సదుపాయాలు కల్పించడం చేయాలి. ఈ పరిశ్రమల స్థాపనకు అవసరమైన వేలాది ఎకరాల భూమి కొనుగోలు లేదా దీర్ఘకాలిక లీజుపై 100% స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహా యింపును పూర్తిగా అమలు చేయాలి. ప్రభుత్వం ఇప్పటికే విశాఖపట్నంలో డేటా సెంటర్లకు పన్ను మినహాయింపులు ప్రకటించిన స్ఫూర్తితో, కర్నూలు, తిరుపతి, అమరావతి వంటి మిగతా టెక్ హబ్‌లలో స్థాపించే మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలకు కూడా కనీసం 15 ఏళ్ల పాటు రాష్ట్ర వస్తు, సేవల పన్ను రీయింబర్స్‌మెంట్ కల్పించాలి. ఈ విధమైన భారీ పన్ను రాయితీలు, సులభతర వాణిజ్య విధానాలు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలను నేరుగా ఆంధ్రప్రదేశ్ వైపు ఆకర్షించడానికి తిరుగులేని అస్త్రంగా పనిచేస్తాయి.

"సాండ్ టు సిలికాన్ టు సిస్టమ్" అనే ప్రక్రియ రాష్ట్రంలో సాధ్యమైతే, అది ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ముఖచిత్రాన్నే మార్చేస్తుంది. ప్రభుత్వం అడ్డంకులను వ్యూహాత్మకంగా తొలగించి, పారదర్శకమైన ప్రోత్సాహకాలను అందిస్తే రాబోయే దశాబ్దం ఆంధ్రప్రదేశ్ సాంకేతిక ప్రగతికి స్వర్ణయుగంగా మారుతుంద నడంలో ఎటువంటి సందేహం లేదు.

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

ట్రంప్ సుంకాల గందరగోళం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరలు తొడుక్కున్న సుంకాలను విధించాలని పట్టుబట్టడంతో ప్రపంచ వాణిజ్యంలో అనిశ్చితి కొత్త ఊపిరి పోసుకుంది, కానీ తగ్గే సూచనలు లేవు.

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు లేదా సామూహిక విధ్వంసక ఆయుధాల గురించి విపరీతంగా మాట్లాడుతున్నారు. ఈ విషయంలో ఆయనకు లేదా ఆయన నడిపే రిపబ్లికన్ వైట్ హౌస్‌కు ఎటువంటి తేడా లేదు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు ప్రాణాంతక ఆయుధాలు సరఫరా చేయటం లేదా అమ్మటం, సుంకాలు విధించటం లేదా వాటిని సమీక్షించటం కూడా అంతే ఉత్సాహంతో చేస్తున్నారు.

నా మునుపటి వ్యాసాలలో ఒకదానిలో, డొనాల్డ్ ట్రంప్ భౌగోళిక-రాజకీయ, ఆర్థిక, వాణిజ్య సంబంధాలలో ప్రపంచ క్రమానికి 'అతిపెద్ద అంతరాయం కలిగించేవారిలో' ఒకరు అని చెప్పాను. ఇటీవలి రోజుల్లో ఇది నిస్సందేహంగా నిరూపితమైంది. గత వారం అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వు, డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక విధాన రూపకల్పనలో కీలకమైన సుంకాలకు కొన్ని గంటల విరామం మాత్రమే కావచ్చు. ఆ కొన్ని గంటల్లో, ఆయన చట్టాలను, సంబంధిత నిబంధనలను మార్చారు. అమెరికా మిత్రదేశం అయినా లేదా శత్రువు అయినా, వ్యాపారం చేసే ప్రతి దేశంపైనా 15 శాతం దిగుమతి సుంకాలను విధించారు.

ఏదైతేనేమీ, అధ్యక్షుడు ట్రంప్ తన అత్యవసర ఆర్థిక అధికారాల కింద సాగిస్తున్న పరస్పర సుంకాల పాలన ముగిసి ఉండవచ్చు. కానీ, అమెరికా కాంగ్రెస్ ఆమోదం పొందే వరకు 150 రోజుల పాటు సుంకాలను విధించడానికి ఆయన మరో మార్గాన్ని తెరిచారు.

ఫిబ్రవరి నుంచి కొత్త సుంకాల విధానం అమలులోకి వచ్చినప్పటికీ, ఇవి అత్యంత అనుకూల దేశాల (ఎంఎఫ్ఎన్)కు విధించే సుంకాలను మించిపోయాయి. ప్రపంచ వాణిజ్యంలో అనిశ్చితి కొనసాగుతోంది. ఏడు సముద్రాల వెంబడి దేశాధినేతలు కొత్త సుంకాల వల్ల తమ దేశాల భవిష్యత్తు ఎలా ఉంటుందో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

మిత్రదేశాలను, శత్రు దేశాలను లొంగదీసుకోవడానికి సుంకాలను ఆయుధంగా ఉపయోగించడం ద్వారా, సంబంధాలను నిర్మించడంలో ఒక పరీక్షకు నోచుకోని కొత్త నమూనాను డొనాల్డ్ ట్రంప్ ఆవిష్కరించారు.

ఈ ప్రక్రియలో అధ్యక్షుడు ట్రంప్ తనను 'నిర్ణయాత్మక నాయకుడు'గా భావించే దేశీయ శ్వేతజాతి ప్రధాన రాజకీయ నియోజకవర్గాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. అదే సమయంలో ఆయన తనకు అనుకూలమైన ధోరణిలో అమెరికాను పరిపాలించుకుంటూ పోతున్నారు.

చెల్లింపుల సమతుల్యతకు సంబంధించిన నిబంధనల నుండి, అమెరికన్ ప్రయోజనాలపై విపక్ష వరకు, అమెరికాలోని వాణిజ్య చట్టాలలో అనేక ముఖ్యమైన నిబంధనలను అధ్యక్షుడు ట్రంప్ తన మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) ప్రచారంలో

కె.ఎ.బదరీనాథ్
డైరెక్టర్ & చీఫ్ ఎగ్జిక్యూటివ్, సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ అండ్ హోలిస్టిక్ స్టడీస్, న్యూఢిల్లీ.

భాగంగా వాడుకుంటున్నారు.

అమెరికా పాలనపై తన ముద్ర వేయడానికి అధ్యక్షుడు ట్రంప్ దేనికైనా తెగిస్తున్నారు. ఆయన ఇప్పుడు ఏ విషయంలోనూ వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. అయితే అనిశ్చితి కాలం కొనసాగుతుంది. చాలా దేశాలు తమ చర్చల వ్యూహాన్ని పునర్నిర్వచించుకోవడానికి ఈ అనిశ్చితి నెలకొన్న కాలాన్ని ఉపయోగించుకుంటాయి.

కొత్త వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయడానికి ఒక సంవత్సరం చర్చల సమయం లభించడంతో చైనా మెరుగ్గా ఉన్నప్పటికీ, భారత్ తన ఎంపికలను తెరిచి ఉంచింది. వాషింగ్టన్ డీసీతో ఒప్పందం కుదుర్చుకునే ముందు గదిలో మరింత స్వచ్ఛమైన గాలి అవసరం కావచ్చు.

ఇప్పుడు, అంతర్జాతీయ ఆర్థిక అత్యవసర అధికారాల వినియోగాన్ని యూఎస్ సుప్రీంకోర్టు కొట్టివేసినందున యూఎస్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)లో భాగం కావడానికి ప్రతిపాదిత 18శాతం పరస్పర సుంకం నిష్ఫలమైంది. అధ్యక్షుడు ట్రంప్ భారత్‌కు ఏమీ మారలేదని పట్టుబడుతూనే ఉన్నప్పటికీ, భారత్, యూఎస్ మధ్య ఒప్పందం కోసం తాజా చర్చలు జరగడానికి సుంకాలు 18 శాతం కంటే తక్కువగా ఉండటం అనివార్యంగా కనిపిస్తున్నాయి. ఎఫ్‌టీఏపై ప్రస్తుత రౌండ్ చర్చలను తరువాతి తేదీకి వాయిదా వేయడం అమెరికా, భారతదేశం రెండింటికీ మంచిది.

రెండవది, అన్ని ప్రత్యామ్నాయాలను తెరిచి ఉంచడం భారత్, దాని 140 కోట్ల మంది పౌరుల ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటుంది. రానున్న ఆరు నెలల్లో అమెరికాతో మొత్తం ఒప్పందాన్ని తిరిగి రూపొందించడం దురాలోచన కాదు. అది 'వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి'కి కేంద్రంగా ఉంటుంది. ఈ సందర్భంలో, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా సూచించిన విధంగా, అమెరికాకు వ్యతిరేకంగా బిల్డింగ్ బ్లాక్స్ లేదా యూనియన్లు భారత్‌కు ఒక ఎంపిక కాకపోవచ్చు, అయినప్పటికీ ఇటీవల భారత్‌ను సందర్శించిన అధ్యక్షుడు లూలా అలాంటి వ్యూహాన్ని ప్రతిపాదించారు.

అదేవిధంగా, భారత్ తన ఇంధన భాండాగారం, వనరులను వైవిధ్యపరచడం ,సొంతంగా ఇంధనాన్ని శుద్ధి చేసే పనులను చేపట్టడం కొనసాగిస్తుంది. ఇలాంటి సమయంలో రష్యా నుండి చమురు, గ్యాస్ కొనుగోలుకు పూర్తిగా ముగింపు పలకడం అనేది సరైన విధానం కాదు.

యూరోపియన్ యూనియన్‌కు మించి భారత్ అందించే సేవలను భారత్ తో మంతనాలు చేస్తున్న దేశాలు, మధ్యవర్తులు తీవ్రంగా పరిగణించాలి. ఫ్రాన్స్‌తో కుదుర్చుకున్న 'వ్యూహాత్మక సంబంధాలు' భారత్‌కు ఎంతటి ప్రత్యేకతకు సంతరించుకున్నదో అంతే ప్రత్యేకతకు బ్రెజిల్‌తో కుదుర్చుకున్న ప్రత్యేక ఖనిజ ఒప్పందం ఒక చక్కటి ఉదాహరణ.

అలాగే, సరిహద్దుల్లో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ చేసిన దురాక్రమణలు, అతిక్రమణలు ఉన్నప్పటికీ, చైనాతో కార్యాచరణ అవగాహనకు రావడాన్ని(భారత్) తీవ్రంగా పరిగణించాలి. సరిహద్దు సంఘర్షణలను అరికట్టడం, ఇండో–పసిఫిక్‌లో చైనా తన తప్పుడు వాదనలను వదులుకోవడం బీజింగ్‌తో కుదుర్చుకునే కార్యాచరణ ఒప్పందంలో అంతర్భాగంగా ఉండాలి.

మూడవదిగా, రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయెల్– ఇరాన్ మధ్య వివాదంలో భారత్ శాంతియుతమైన దూకుడు పాత్రను పోషించాలి. అంతేకాకుండా తీవ్రవాదం, మతపరమైన ఉగ్రవాదం. విదేశీ జోక్యాలకు వ్యతిరేకంగా ఏమాత్రం ఉపేక్షించడానికి తావులేని వైఖరిని చేపట్టాలి.

నాల్గవది, భారత్ భద్రతా ప్రయోజనాలను కాపాడటానికి మధ్యస్థం నుండి దీర్ఘకాలికంగా మన ప్రపంచవ్యాప్త భాగస్వామ్యంలో బేరసారాలకు తావులేని చక్కటి సమతుల్యతను సాధించడం లక్ష్యం కావాలి. రిపబ్లికన్ లేదా డెమోక్రటిక్ వైట్ హౌస్ వల్ల భారత్‌కు వచ్చేదేమీ ఉండదు. కనుక భారత్ తన స్వప్రయోజనాలను కాపాడుకోవాలి. ★

కేరళ కాదు కేరళం

కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చడానికి కేంద్ర మంత్రివర్గం ఫిబ్రవరి 24న ఆమోదం తెలిపింది. త్వరలో ఈ ఆమోదం కార్యరూపం దాలుస్తుంది. ఇదివరకు రాష్ట్రం పేరు మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కేరళ అసెంబ్లీ అనేకసార్లు తీర్మానాలు చేసింది. అంతేకాకుండా రాష్ట్రంలో అధికారిక రికార్డుల్లో రాష్ట్రం పేరును సవరించాలంటూ ఇటీవల ప్రవేశపెట్టిన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర మంత్రివర్గం రాష్ట్రం పేరును కేరళంగా మార్చడానికి ఆమోదం తెలిపింది.

పేరు మార్పు ప్రక్రియ ఏమంత క్లిష్టమైనది కాదు. మార్పును కేంద్రానికి ప్రతిపాదిస్తూ సంబంధిత రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఆమోదం తెలపాలి. అనంతరం ఇదే విషయమై పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టడానికి ముందు సంబంధిత రాష్ట్రం అభిప్రాయాన్ని రాష్ట్రపతి తెలుసుకుంటారు. ఆ తర్వాత రాష్ట్రపతి సిఫార్సుతో బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. ఉభయసభల్లో సాధారణ మెజార్టీ లభించిన పక్షంలో బిల్లు ఆమోదం పొందుతుంది. అనంతరం రాష్ట్రపతి ఆమోద ముద్రతో సంబంధిత రాష్ట్రానికి అధికారికంగా పేరు మారిపోతుంది.అయితే దీనికి ఎలాంటి రాజ్యాంగ సవరణ అవసరం లేకపోవడం గమనార్హం.

జాగృతి జర్నలిస్టులకు పురస్కారాలు

అవార్డులందుకుంటున్న జంధ్యాల, శ్రీనివాస్, వీరప్ప

ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతిని పురస్కరించుకొని "భాగ్యనగర్ శివాజీ సేవా సమితి" ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఫిబ్రవరి 19వ తేదీ గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా "ఛత్రపతి శివాజీ మహారాజ్ జాతీయ సేవా పురస్కార్ 2026" పేరిట జాతీయవాద జర్నలిస్టులకు పురస్కారాలను ప్రదానం చేశారు. జాగృతి తెలుగు జాతీయ వారపత్రికలో సేవలందిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ జంధ్యాల శరత్‌బాబు, డిజిటల్ ఎడిటర్ గుళ్ళపూడి శ్రీనివాసకుమార్, కాలమిస్ట్ వనకళ్ల వీరప్ప సహా సుమారు 60 మంది పాత్రికేయులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ అంజిరెడ్డి హాజరై జర్నలిస్టులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహరాజ్ అడుగుజాడల్లో నేటి యువతరం నడవాలని పిలుపునిచ్చారు. "భాగ్యనగర్ శివాజీ సేవా సమితి" అధ్యక్షుడు నందనం దివాకర్ మాట్లాడుతూ సమాజాన్ని నిత్యం చైతన్యపరుస్తున్న జర్నలిస్టుల సేవలను గుర్తించి, గౌరవించడం తమ బాధ్యతగా భావించామన్నారు. ఈ వేడుకల్లో భాగంగా పేదకుటుంబాల మహిళలకు చీరల పంపిణీ కూడా చేపట్టి "భాగ్యనగర్ శివాజీ సేవా సమితి" తన సామాజిక బాధ్యతను కూడా నిర్వహించింది. ★

ధారావాహిక నవల

గణపతి దేవుడు

25

దాదాపు అన్ని ప్రముఖ నదులూ అన్ని దక్షిణా వర్తంలోని అన్ని రాజ్యాలలో వర్షాలు కూడా ఒక మాదిరి నుండి భారీవర్షాలు రోజులు, వారాలు, మాసాల పాటు ఎడతెరిపిలేకుండా కురవడంతో ఈ నదులన్నీ పొంగి పొర్లాయి.

ఇకనేముంది.. వాటి ప్రవాహంతో గ్రామాలన్నీ నీట మునిగాయి.. ఊర్లకు ఊళ్లు సర్వనాశనం అయ్యాయి. చాలా గ్రామాలు పూర్తిగా నీట మునగడంతో ఒక్కరు కూడా మిగలకుండా ఆ గ్రామ ప్రజలంతా.. పిల్లా జెల్లా.. ముసలి ముతకా.. పెద్దా చిన్నా, ఆడామగ.. కోడి, కుక్క, ఎద్దు, గేదె.. పెంపుడు జంతువులు.. సర్వం నీట మునిగి చనిపోయాయి. అలాంటి గ్రామాలు ఎన్నో ఎన్నెన్నో.

విషాదం ఏమిటంటే ఆయా గ్రామాలలోని నీట మునిగిన వారిని రక్షించే వ్యవస్థ లేదు సరికదా.. ఫలానా గ్రామంలోని వారంతా చనిపోయారని పక్క గ్రామానికి తెలియజేప్పేవారు కూడా ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు.

ఈ అతివృష్టి రాజ్యాలకు ఒక పెద్ద సమస్య అయితే అప్పుడే మరొక సమస్య మొదలయ్యింది..

అదే అంటురోగాల వ్యాప్తి.

ఎన్నో గ్రామాలు.. నదీతీరాల వెంట మొత్తం తెలుగు రాజ్యాలే కాదు...మరాఠా, కన్నడ, తమిళ రాజ్యాలు.. అన్నిటా అంతటా వర్షాలవల్ల.. పొంగి పొరలిన నదుల వల్ల.. వందల గ్రామాలు ఒక్క మనిషి కూడా మిగలకుండా చనిపోగా, నీటిలో నానిన శవాలు కుళ్లి కుళ్లి ఉబ్బి.. చీలికలు పేలికలైయ్యాయి. అందుండి పుట్టాయి రకరకాల వైరములు..మెట్ట గ్రామాలకు కూడా లిప్తలకాలంలో వ్యాపించాయి.

వైరం అంటే శత్రుత్వం.. ఆరోగ్యానికి శత్రువులు వైరములు. ఈ వైరములు కోట్ల ఏళ్ల నాడే మనిషి కంటే ముందే పుట్టి గాలిలో, నీటిలో, సమస్త జంతుజాలంలో సమృద్ధిగా ఉంటాయి. ఈ వైరములు క్రిములు, కృములు అని రెండు రకాలు. దోమలు, ఈగలు, నల్లులు, పేలు, చదలు, నులు పురుగులు, ఏలిక పాములు, బద్దె పురుగులు, నార పురు గులు.. ఇలా కంటికి కనిపించేవి, పాకేవి కృములు.

తమంతట తామే వృద్ధి పొందే సూక్ష్మాతి సూక్ష్మజీవులను క్రిములు అంటారని అధర్వణ వేదం పేర్కొంది. యూక, పిపీలిక, చర్మది, చర్ముకిక, బిందుకి, వర్తుల, మత్కుణ, పృధుముండ, ఆంత్రధ, దాన్యాశీకురనిభ, హృదయద, సూచీముఖ, ఉదారద, చిపిట, ఉదరవేష్ట, కించుకసన్నిభ, చురు, అనవ, మహాగుడ, మహాకుహ, ధర్భకుసుమ, కాకేరుక, అజ్వ, మాకేరుక, విజ్య, సౌసురద, కిప్య, శసులక, సలూన, గండూపద, లేలిహా, ద్విముఖ.. తదితర క్రిములను చరకుడు, శుశ్రుతుడు తదితర మహా వైద్య పండితులు గుర్తించారు.

ఈ అంటువ్యాధులనేవీ సామాజిక సమస్య. వైద్యం ద్వారా వీటి నివారణ సాధ్యం కాదు. ఎలుకలు తండోపతండాలుగా చస్తోంటే వెనువెంటనే ఇల్లు వదలి, ఊరు విడిచి పారిపోవాలని.. దూరవాసం చెయ్యాలని.. వాత్స్యాయనుడు చెప్పాడు. ఈ అంటువ్యాధులు గుర్తించగానే ముందుగా అందరూ ఊరు విడిచి అరణ్యాల్లోకి పారిపోయి ప్రాణాలు కాపాడుకోవడం అన్ని గ్రామాల ప్రజల తక్షణ కర్తవ్యం. అదే చేస్తున్నారిప్పుడు.

శకునాలపల్లె గ్రామవాసులంతా మహమ్మారిని గుర్తించేటప్పటికే కోళ్లు, ఆవులు, గేదెలు, ఎడ్లు, కుక్కలు, చంటిపిల్లలు, కొందరు ముసలివారు మరణించారు. చాలామందికి ఒంటిపై దద్దురులు, కళ్లు ఎర్రబారటం, దురదలు.. కొందరికి ఒళ్లంతా దురదలు వచ్చేశాయి. అప్పుడు ఊరంతా మహమ్మారి వచ్చేసిందని గుర్తించారు.. అన్నీ వదిలేసి అడవుల్లోకి పారిపోయారు.

ఇదే పరిస్థితి మరెన్నో గ్రామాలలో.. ముఖ్యంగా నదీ తీర గ్రామాలకు కాస్త దగ్గరగా ఉన్న గ్రామాలన్నీ రోజుల సమయంలోనే ఈ మహమ్మారి బారిన పడ్డాయి.

అడవుల్లో నివాసమున్న వారిని కూడా ఈ మహమ్మారి వదలడం లేదు. మరెన్నో రూపాలలో రోజురోజుకీ ఎందరెందరో చనిపోసాగారు. ఉన్న వారు ప్రాణాలు దక్కించుకోవడం కోసం అరణ్యాల లోలోపలికి.. లేదంటే మరోదారి పట్టి దూరదూర ప్రాంతాలకు పరుగులు పెట్టసాగారు. అంటే వీళ్లు ఆ జబ్బులను.. అంటే ఆ క్రిములను మరిన్ని ప్రాంతాలకు, రాజ్యాలకు వ్యాప్తి చేయసాగారు. దాంతో ఆయా ప్రాంతాలు ఈ అంటువ్యాధుల బారిన పడి నాశనం కాసాగాయి. ఇలా ఈ అంటువ్యాధులు కొన్ని నెలలు, సంవత్సరాల పాటు ఎన్నో తెలుగు రాజ్యాల గ్రామాలను నామరూపాలు లేకుండా చేస్తోంది.

కుటుంబాలు, వంశాలు, గ్రామాలు.. వదలి ఎవరెవరో, ఎక్కడెక్కడో బలుసాకు తిని అయినా బతుకుతున్నారు. కొన్నేళ్లకు వాళ్ల కుటుంబ సభ్యులు ఎవరో.. ఎక్కడున్నారో.. ఒకరికి ఒకరు తెలియదు. ఎవరది ఏ ఊరో తెలియదు. గుర్తున్నా వెళ్లేదారి తెలియదు. తూర్పు ఏదో పడమర ఏదో తెలియదు. చాలా గ్రామాలు నిరుపయోగంగా పాడు పెట్ట బడ్డాయి. గుడులు, నివాసాలు, గృహోపకరణాలు, బంగారు వెండి ఆభరణాలు.. నాణేలు, పట్టు పీతాంబరాలు.. అన్ని మట్టిలో కూరుకుపోయాయి. ఒకప్పుడు గొప్ప సంస్కృతీ కేంద్రాలుగా విలసిల్లిన గ్రామాలు, పురాలు, పట్టణాలు, నగరాలు.. ప్రజలు లేక అన్ని అడవుల్లా.. క్రూర జంతువులకు, దోపిడీదారులకు ఆవాసాల్లా మారిపోయాయి.

మరి కొన్నేళ్లకు ఈ పాడుపడిన గ్రామాలలో ఎవరెవరో వచ్చి నివాసాలు ఏర్పరచుకుని.. ఆ గ్రామ పొలాలు స్వాధీనం చేసుకుని.. ఆ గ్రామాలకు కొంత పేర్లు పెట్టుకుని.. తిరిగి నివాసయోగ్యం చేసుకో సాగారు. వాటి కొత్త పేర్లలో 'పాడు' అనేది తప్పక ఉంటుంది. అంటే అది ఒకప్పుడు ప్రజలతో కళకళలాడి తదనంతరం.. అతివృష్టి, అంటువ్యాధులతో పాడుపడ్డ గ్రామమని గుర్తు.

కొన్నేళ్ల తర్వాత అక్కడ ఏ మహారాజో ఎప్పుడో వేయించిన ఓ శాసనం దొరుకుతుంది. నగలు, నాణేలు, దేవతావిగ్రహాలు దొరుకుతాయి.. నేలలో కూరుకుపోయిన దేవాలయ చిహ్నాలు, విరిగిన విగ్రహాల చెక్కా ముక్కా కనిపిస్తాయి. మొత్తంగా ఆ

మత్తి భానుమూర్తి

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

ప్రాంత లేదా ఆ గ్రామ పాతచరిత్ర కొత్త గ్రామస్తులకు, చరిత్రకారులకు ఓ గొప్ప ఆసక్తి కలిగించే చరిత్ర అవుతుంది. అలా చరిత్ర అనే కొత్త అంశం జన్మించింది!!

మళ్లీ తెలుగు రాజ్యాలలోని నదులు, నదాలు, వాగులు, వంకలు, కుంటలు, కాలువలు.. యధా విధిగా ప్రవహిస్తూ ఆయా గ్రామాలను సస్యశ్యామలం చేస్తూ తెలుగువారి సంస్కృతికి కొత్త భాష్యాలు చెబుతూనే ఉన్నాయి... ఉంటాయి.

ఇదంతా పాలకవ్యవస్థలు పట్టించుకోని కాలాన జరిగిన, జరుగుతున్న ఘోరకలి. ఇప్పుడైనా పాలక మహారాజులు ఈ ప్రళయ భీకరవేళ.. కొందరినైనా బ్రతికించే.. కనీసం ప్రకృతి విలయం గురించి మరో గ్రామానికి తెలిసే వ్యవస్థనయినా ఏర్పాటు చేయాలని.. అది చిన్నరాజ్యాల వల్ల కాదని సామ్రాజ్య రూపం ఏర్పడాల్సిందేనని శిబిరం కోరింది.

* * *

గొబ్బూరు గ్రామం.. కొలనుపాక రాజ్యం.

వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి.

ఓ బక్కచిక్కిన కుక్క.. భయంభయంగా అటూ ఇటూ చూసుకుంటూ నేల మట్టివాసన చూస్తూ తలెత్తి అటూ ఇటూ మళ్లీ మళ్లీ చూస్తూ తడబడుతున్నకాళ్లతో నడవలేక నడుస్తోంది. డొక్కలు ఎముకలు తేలి.. కటకటలాడుతున్నాయి. తినడానికి ఎక్కడా ఏమీ లేదు. కాస్త తడి నాకుదామన్నా ఇళ్ల ముందు కనీసం నీటికుండలు కూడా కనిపించడం లేదు. వేడిగాలులు నిశ్శబ్దంగా ఉధృతంగా వీస్తున్నాయి. ఉండి ఉండి గాలి విసురుగా వీచినప్పుడు డొంకలోని మట్టి పైకెగసి సుళ్లు తిరుగుతోంది.

ఓ ఇంటి వెనుక నుండి నలుగురు మనుష్యులు ఆ కుక్కనే చూస్తున్నారు. వాళ్లు రెండు వీధుల నుండి దాని వెనకే మౌనంగా అనుసరించి వస్తున్నారు. ముందున్నవాడు పక్కవాళ్లను ఆగమని సైగచేసి మెల్లగా అడుగులో అడుగు వేస్తో ఆ కుక్క వెనకే వెళ్లాడు. అతని కదలిక చూస్తుంటే దానిని పట్టుకోవాలని అతని తీవ్రమైన ప్రయత్నం. అతన్ని వెనుక నుండి ప్రోత్సహిస్తున్నట్లు ముగ్గురూ చూస్తుండగా మొదటివాడు కుక్క దగ్గరగా వెళుతున్నాడు.

అప్పుడు ఊహించని సంఘటన జరిగింది.

వీళ్లు కుక్క వెనగ్గా వెళుతుండగా ఊహాతీతంగా ముందునుండి మరో బృందం మరో ఇంటి చాటునుండి హఠాత్తుగా వీధిలోకి వచ్చింది. రెండు బృందాలు ఒక్కసారిగా దగ్గరకు వచ్చేసరికి బెదిరిన కుక్క ఆ సన్నని సందులు గొందుల గుండా మాయమైంది. మొత్తం ఆరుగురూ ఆ కుక్క కోసం పరుగులు పెట్టారు. అన్ని ప్రక్కలా చుట్టుముట్టి ఎలాగైతేనేం దానిని పట్టుకున్నారు. లిప్తలకాలంలో దాని నోరు మూసేశారు. పీక పిసికేశారు. గిలగిల కొట్టుకుంటున్న దాని నాలుగు కాళ్లను విడదీసి దాని శరీరాన్ని చీల్చేశారు. రక్తం పలుచగా చిమ్మింది. ముఖంపై పడిన రక్తపు చుక్కలు వేలితో తీసి వేగంగా నోటితో నాకి తృప్తిగా గుటక వేసాడొకడు. సన్నగా కారుతున్న రక్తాన్ని దోసిలితో పడుతూ ఆబగా నోట్లో పోసుకుంటున్నాడొకడు. మొత్తంగా ఏడుగురూ అత్యంత వేగంగా ఆ కుక్క శరీరాన్ని చీల్చేస్తూ అప్పటికప్పుడు నమిలేస్తున్నారు.

మరికాసేపటికి మిగిలిన శరీరభాగాలను తలో ముక్క పంచుకుని భార్యా పిల్లల కోసమన్నట్లు పరుగులు పెట్టారు.

ఇంచుమించు ఇలాంటి దృశ్యాలే కాకతీయ రాజ్యమంతటా.. సామంత రాజ్యాలలో కూడా.

కరువు మరింత విలయతాండవం చేస్తోంది.

ఊరు ఊరంత వేడిగాలులు. తెల్లవారాక ఏ కొద్ది సమయమో చల్లదనం. ఆనక అంతా వేడిగాలులు.. ఎండలు..

ఎండలు.. ఇంకా ధనుర్మాసం ముగియలేదు. అప్పుడే ఎండలు.. 'శివరాత్రికి శివ శివా అంటూ చలి వెళ్లిపోతుంద'ని ఊళ్లో నానుడి. అసలు జనానికి ఎప్పుడు శివరాత్రో.. ఎప్పుడు చలి వచ్చిందో.. ఎప్పుడు పోయిందో.. తెలియదు.

తెలిసిందల్లా కేవలం ఉడకబెట్టే వేడి. నిన్న మొన్నా కాదు గత ఏడేళ్లుగా కరవు. ఏడేళ్లనాడు మెల్లమెల్లగా మొదలయింది. వానలు తగ్గాయి. వేడిగాలులు హెచ్చాయి. రెండో ఏడు పంట తగ్గుముఖం పడుతున్నట్లు రైతులు గుర్తించారు. వాన తగినంత కురవలేదు. మూడో ఏడు కురిసీకురియని వానలతో సాగుచేసినా పంట మరింత తగ్గింది.

మూడేళ్ల వరకు ఎప్పటిలాగే బ్రతకగలిగారు. కాకపోతే పెళ్లిళ్లు లాంటి సంబరాలు కొందరు వాయిదా వేసుంటే కొందరు ఉన్నంతలో జరుపు కున్నారు.

నాలుగో ఏడాది నుండి ఇదొక కరవు సంవత్సరమని గుర్తించారు. వర్షాలు కురవడం లేదు. ఖర్మ ఏవిటంటే అదే సమయంలో ఎండలు మరింత ఎక్కువయ్యాయి. చెరువుల్లో, బావుల్లో ఉన్న కాసిని నీళ్లూ ఆవిరై ఎండిపోయాయి.

ముందుగా అందున్న కప్పలు మాయమౌతాయి. అంటే చచ్చిపోవచ్చు లేదా ముందే మరో బావిలోకో.. చెరువులోకో వెళ్లిపోవచ్చు.

కరవు అనే మహమ్మారిని గుర్తించాక గ్రామదేవతలకు మొక్కు కుంటారు. కొలుపులు చేస్తారు. కప్పల పెళ్లిళ్లు లాంటివి చేసి వానదేవుడి కోసం పొర్లు దండాలు పెడతారు. ఒకరి వొంటిపై గ్రామదేవత పూని, బలి కోరుతుంది. నాలుగు ఎనుబోతులు, రెండు దజన్ల కోళ్లు, పది పల్లికల అన్నం వారబోయ మంటుంది. ఆనందంగా ఏకగ్రీవంగా ఊరు ఊరు ఏకమై చేస్తారు. ఊహు. ఒక్క చుక్క నీటిబొట్టు రాలితే ఒట్టు.

తర్వాత సోది చెప్పే ఎరుకల ఆమెకు గిరాకి. ఇదిగో అదిగో వర్షం అని చెప్పి బంగారంలా దాచుకున్న కాసిని గింజల్లో నాలుగు గుప్పిళ్లు పుచ్చు

కుని పోతుంది. అసలు ఆకాశంలో మేఘాలే కనిపించవు. అంతా తెల్లని ఆకాశం. పాలిపోయిన ఆకాశంలాగే రోజు రోజుకూ పాలిపోతున్న మనుష్యులు..

గ్రామాలలో చాలా కుటుంబాలు గుంపులు గుంపులుగా ఉంటాయి. అంటే నాలుగు, మూడు తరాల ఓ పెద్ద ఉమ్మడి కుటుంబం. వాళ్ల కష్టసుఖాలు వాళ్లంతా పంచుకుంటారు. చర్చించుకుంటారు. ఎలా బతకాలి అనేది ఆయా కుటుంబ పెద్దలు అంచనా వేస్తూ.. చూస్తూ పరిస్థితులను ఆకళింపు చేసుకుని ఓ శుభదినాన మూటా ముల్లె సర్దుకుని పిల్లా పాపలతో, ముసలి ముతకలతో పాటుగా ఆవులు, ఎద్దులు, గేదెలు, గాడిదలు, కుక్కలు, కోళ్లు, బాతులు.. సమస్త ఆత్మీయ పెంపుడు జంతువులతో కలిసి.. ఊళ్లో దినమూ కలిసే ఆత్మీయ మిత్ర కుటుంబాలు వస్తామంటే వాళ్లను కూడా కలుపుకుని ఊరు వదలి వెళ్లిపోతారు.

వెళ్లేటప్పుడు వీడ్కోలు ఓ భరించరాని విషాద సన్నివేశం.

కానీ అది భరించక తప్పదు. గుండెబరువుతో సాగిపోక తప్పదు. తప్పని పరిస్థితుల్లో నడవలేని ముసలివాళ్ల ను అక్కడే వదిలివేయక తప్పదు.

"ఇయ్యాలో రేపో పోయేవాళ్లం కొడుకా.. మమ్మల్ని వదిలెయ్యి. ఎవరైనా దయగల తల్లులు ఇంత ముద్దపెడితే తింటాం. మరి నాలుగురోజులు బతికి ఉంటాం లేకుంటే పోతాం. మీరంతా పచ్చగా ఉన్న మరో ఊరు, మరో అడవి, మరో రాజ్యం చూసుకుని వెళ్లండి. పిల్లాపాపలతో హాయిగా బతకండి.." అని పెద్దలు చెబుతారు. "భలేవాడివి నాన్నా.. నిన్నువదిలి వెళ్లేదే లేదు. ఉన్నంతకాలం అందరం కలిసే ఉంటాం. ఆ దేవుడు ఎవరిని ఎప్పుడు పిలుస్తాడో తెలియదు కదా. కాస్త ఓపిక చేసుకో.. అట్టా అట్టా.. కూర్చుంటా లేస్తా కలిసే పోదాం" అంటారు కొడుకులు.

కోడళ్లు ఈ విషయంలో మౌనంగా ఉంటారు.

కాని బయలుదేరేటప్పటికి పరిస్థితి వేరు. ఒకవేళ పండు ముదుసలులు వెంట కదిలినా ఎక్కడో దారిలో ఓ అడవిలోనో.. ఓ గుడి వద్దో.. ఓ యాచకుల గుంపు వద్దో వాళ్లను వదిలేసి వెళ్లిపోక తప్పదు. అంతెందుకు బాగా బరువున్న పిల్లలను కూడా మోయలేక.. వాళ్ల ఏడుపులు భరించలేక ఎక్కడో ఓచోట వదలివేసి వెళ్లిపోతుంటారు.

ఇది మూడవ ఏడాది దృశ్యం.

* * *

ప్రపంచంలో సామాజిక జీవన పరిణామ చరిత్రలో కరువు కాటకాలు లాంటి ప్రకృతి బీభత్సాలు మానవ వికాసాన్ని పరిహసించిన చరిత్ర అంతో ఉంది. ప్రపంచాన్ని, రాజ్యాలను, వ్యవస్థలను, సామాజిక వర్గాలను, సాధారణ ప్రజలను సర్వ నాశనం చేసిన ప్రకృతి విలయతాండవాలు ఎన్నో.

ప్రపంచంలో సామాజిక జీవన పరిణామ చరిత్రలో కరువు కాటకాలు లాంటి ప్రకృతి బీభత్సాలు మానవ వికాసాన్ని పరిహసించిన చరిత్ర అంతో ఉంది.
ప్రపంచాన్ని, రాజ్యాలను, వ్యవస్థలను, సామాజిక వర్గాలను, సాధారణ ప్రజలను సర్వ నాశనం చేసిన ప్రకృతి విలయతాండవాలు ఎన్నో.
దుర్మార్గులైన మహారాజులు, యుద్ధాలు ఆయా సమాజాలను సర్వనాశనం చేశాయి అనుకుంటారు కాని ప్రకృతి విపత్తులు రాజ్య చరిత్రలను తిరగరాసిన సంఘటనలు కోకొల్లలు.

దుర్మార్గులైన మహారాజులు, యుద్ధాలు ఆయా సమాజాలను సర్వనాశనం చేశాయి అనుకుంటారు కాని ప్రకృతి విపత్తులు రాజ్య చరిత్రలను తిరగరాసిన సంఘటనలు కోకొల్లలు.

నీరు, ఎండ, వాన, చలి.. తదితర ప్రకృతి అంశాలన్నీ మానవులు బతకడానికి అత్యంత ముఖ్యం. కాని ప్రకృతి వనరులు ఉండవలసిన స్థాయి కంటే ఎక్కువయినా ప్రమాదమే తక్కువయినా ప్రమాదమే. ప్రజలు అల్లాడిపోతారు. బతుకులే ఆగమాగం అవుతాయి. సమాజమే అల్లకల్లోలం అయిపోతుంది.

వర్షం.. వర్షం.. నీరు.. నీరు!

సర్వమానవాళికి నీరే ముఖ్యం. నీరు అంటే వర్షం. వర్షం అంటే ఏడాది.. ఓ కాలగమనానికి కొలత, సంవత్సరం అనేది కూడా వర్షం అంటారు మన పూర్వీకులు.

ఆ వర్షం ఎక్కువగా కురిస్తే అతివృష్టి.. అదొక విలయం.

వర్షం తక్కువగా కురిస్తే అనావృష్టి.. అదొక ప్రళయం.

అతివృష్టితో అప్పటికప్పుడు నాశనం జరిగి పోతుంది. ఉండేవాడు ఉంటాడు. పోయేవాడు పోతాడు. కానీ అనావృష్టితో అలా కాదు. అది ఏళ్లకేళ్లు సమాజాన్ని పట్టి పీడిస్తుంది. నెమ్మది నెమ్మదిగా మనిషి నుండి ఊరును.. ఊరు నుండి స్థలను.. స్థల నుండి విషయను.. విషయ నుండి మండలాన్ని.. మండలం నుండి రాజ్యాన్ని.. మొత్తంగా జాతి మూలాలనే నిర్మూలిస్తూ పోతాయి.

అవే కరవు కాటకాలు.

అలాంటి కరవు ఇప్పుడు కాకతీయ రాజ్యాన్ని.. దాని సామంత, మహాసామంత రాజ్యాలను పట్టి పీడిస్తోంది.

ఒక్క ఏడాది వర్షాలు తక్కువ కురిస్తే అదో సమస్య.. తట్టుకోవచ్చు. ఒక ఏడు వర్షం ఎక్కువ కురిస్తే కొంత ప్రాణ నష్టం జరుగుతుంది. దానిని భరించవచ్చు.

కాని ఏడాదికేడాదికి వర్షం కాదు కదా చుక్క నీరయినా కురవకపోతే దానిని ఏమనాలి!!?

అదే ఇప్పుడు పరిస్థితి.

కరవును ముందుగా గుర్తించే విధానాన్ని కూడా మానవుడు ఇంకా ఏర్పాటు చేసుకోలేదు. కరవు కాలంలో.. సాధారణ సమాజం ఉన్నట్టుండి అసాధారణంగా మారిపోతుంది. రైతులు రోజూ పొలాలకు పోతుంటారు. గేదెలు, ఎద్దుల బళ్లు, మేకల అరుపులు, మహిళలు లేచి వీధుల్లో కల్లాపు చెల్లడం, పాలు పితకడం.. వడ్లదంపుళ్లు, అటూ ఇటూ తిరుగుతుండే చాకళ్లు, మంగళ్లు, మాదిగలు, తమ తమ వృత్తిపనుల్లో నిమగ్నులౌతారు. ఈలోగా పంచాణం వారు తమ కొలిములు సిద్ధంచేసు కుంటారు. ఇలా అందరూ తమ తమ పనుల్లో నిమగ్నమవుతుంటారు.

దైనందినం ఇలా ఎప్పటిలా కనిపిస్తుండగానే చాప క్రింద నీరులా మెల్లమెల్లగా ఎవరూ స్పష్టంగా గుర్తించని కాలం నుండి కరువు జాడలు మొదలౌ తాయి. కరవు అంటే ఒక్క మాటలో చెప్పాలంటే వర్షాలు ఆగిపోవడం. కురిసినా తగినంత కురవక పోవడం. ఈ వర్షాలు ఒక్కసారిగా పూర్తిగా ఆగిపోవు. కరవు.. రైతు గుర్తించలేనంత గమ్మత్తుగా మొదలౌతుంది. అది పూర్తిగా గుర్తింపులోకి వచ్చి రాజ్యానికి కరువొచ్చింది అని స్పష్టమయ్యేసరికే సగం మంది రైతులు రైతుకూలీలుగా మారిపోతారు. అప్పటికే రైతు కూలీలుగా బతుకుతున్నవాళ్లు ఉన్న గ్రామంలో పని దొరక్క ఆ గ్రామాన్ని వదిలేసి కుటుంబాలుగా.. కుటుంబ బృందాలుగా పని వెదుక్కుంటూ వెళ్లి పోతారు.

వృత్తులన్నీ మెల్లమెల్లగా మూలబడతాయి. చాకళ్లు, మంగళ్లు తమ వృత్తిని మానేస్తారు. అంటే ఎవరి బట్టలు ఉతకరు. ఎవరికీ క్షౌవరం చేయరు. తమ పంటలో వారి వాటా వారికి ఇవ్వడానికి రైతుకి పంట ఏది?

రెండు మూడేళ్లకు ఈ దైనందినం పూర్తిగా మారిపోతుంది.

పొలాలకు వెళ్లడం అనేది ఉండదు. కల్లాపు చల్లెందుకు కూడా నీటి కరవు. పితకడానికి పశువులకు పాలు ఉండవు. మేకల అరుపులు, కోళ్ల గోల, బాతుల బెకబెకలు వినపడవు. రాత్రుళ్లు కప్పల

బెకబెకలు వినరావు. ఎడ్లబళ్ల గరగరలు లేవు. మేకలు, గొర్రెలు, కుక్కలు, కోళ్లు, బాతులు లాంటి ఇంటి జంతువులు మెల్ల మెల్లగా కనిపించడం తగ్గి పోతుంది.

తర్వాత మనుషులు కూడా కనిపించడం తగ్గిపోతుంది.

ఆ స్థితిగతులున్న కరవు కాలంలో మొదటగా గ్రామం పూర్తిగా చీకటిమయమైపోతుంది. కారణం గ్రామ సమయం వారు దీపాలు వెలిగించే ఆముదపు నూనె కొనడం మానేస్తారు. అంతా.. గ్రామమంతా.. ఇంటింటా.. బ్రతుకంతా చీకటిమయం.

ఈ కరవు కాటకాలు, మసూచిలు, ఆటలమ్మలు.. మూకుమ్మడిగా ఊరు వదిలేసి అడవుల్లో కాపురాలు,

ఊరంతా మూకుమ్మడి సావులు.. ఈ దారుణాలు, దౌర్భాగ్యాలకు దేవుడే దిక్కు అని రక్షించండి దేవుడో అని దేవుడికి మొరపెట్టుకుంటారే గాని కాపాడు ప్రభో.. పన్నులు వసూలు చేసుకుంటున్న మహాప్రభో అనరు.

ఏడేళ్లుగా కరవు కాటకాలు కాకతీయ రాజ్యాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. వందల వేల గ్రామాలు శ్మశానాలు అవుతున్నాయి. డొంకల్లో దారుల్లో జంతుకళేబరాలే కాదు మానవశవాలు కూడా పడి కనిపిస్తున్నాయి. పీక్కు తినడానికి కుక్కలు కూడా లేవు. ఆ కళేబరాలు కుళ్లిపోయి దరిదాపుల్లోని గ్రామాలలో అంటువ్యాధులు పుట్టి మరింత మందిని హరిస్తున్నాయి.

అయితే ప్రకృతిని మనిషి నిర్దేశించలేదు. ఇప్పటివరకు ప్రకృతికి తలవంచి మనిషి బ్రతుకుతున్నాడు. ప్రకృతి ఆగ్రహిస్తే బ్రతికితే బ్రతుకుతున్నాడు. చస్తే చస్తున్నాడు.

ప్రస్తుత వ్యవస్థ ఉన్న తీరు ఇది.

కాని తమ ఈ దౌర్భాగ్యాన్ని రూపుమాపండి అని పాలకులను ఆడగడం ఇప్పుడిప్పుడే మొదలవ్వ బోతోంది.

* * *

నాలుగవ ఏడాది.. బుక్కలూరు ఓ చిన్న పల్లెటూరు.

కోమలి కుర్ర భార్య. వరదయ ముసలి భర్త. బాల్య వివాహం. ఆమెకు ముక్కు చీమిడి తీసుకోవడం రాకముందే పెళ్లి చేశారు. అప్పటికి వరదయ ఓ భార్య చనిపోయి రెండో పెళ్లికి సిద్ధమైనవాడు. నెత్తి అంతా తెల్ల వెంట్రుకలు,

గెడ్డంలో అక్కడక్కడా నల్లవెంట్రుకలు కనిపిస్తున్న వయస్సు. అప్పటికి నాలుగైదు పెళ్లి సంబంధాలు చూశాడు కాని అమ్మాయి తండ్రి అనేవాడు అంగీకరించలేదు. ఎక్కడో ఒక్కడు.. ఒక్క పరమ సన్నాసి.. సొమ్ముకు కూతురును అమ్ముకునేవాడు దొరక్కపోతాడా? అన్న ఆశతో ఓపిగ్గా వెదగ్గా కోమలి తండ్రి దొరికాడు. కోమలి తండ్రి మామూలు సన్నాసి కాదు పరమ నిక్కష్టుడు, అతి దరిద్రుడు. పిల్ల మరీ పసిది అంటే 'పసిడిది' అని ముద్దు నుకుని వరదయ్యకు కట్టేశాడు. పెళ్లి తర్వాతే ఈ కాలపు ఆడపిల్లలకు తండ్రి ఎంత పాపో.. కొనుక్కున్నవాడు ఎంత పరమనీచుడో అవగతమౌతోంది. నా రాత నా గీత అని అన్ని భరిస్తుంది.

అది నిన్నటి వరకు.

ఈ కాలపు అమ్మాయిలు అలా సరిపెట్టుకోవడం లేదు. కానీ వ్యవస్థ అలా చచ్చింది కాబట్టి వెళ్లక తప్పడం లేదు. కాపురానికి వెళ్లేముందే.. వెళ్లాకా అక్కడ సదరుమొగుడిని ఎలా ముప్పుతిప్పలు పెట్టాలో ఆలోచించుకుని మొత్తం ప్రణాళికతో వెళుతున్నారు.

అలా వచ్చిన ఈ కాలపు భార్య కోమలి. రెండు మూడేళ్లు కాపురం చేసిందో లేదో ఈ కరువు వచ్చిపడింది.

భర్తకున్న కాస్తంత కొండ్ర ఇద్దరూ కలిసి సేద్యంచేసి రెండింతలు చేశారు. పిల్లలు పుట్టే అదృష్టం లాంటిది లేదని ఇక ఈ జన్మకు ఈ భర్త బ్రతికుండగా పిల్లల ప్రసక్తే లేదని గుర్తించిన కోమలి వీధిలో అందరికి ఆ ముచ్చట బాహాటం గానే చెప్పి నవ్వించేది.

ఏడాది పైబడినకొద్దీ కోమలి మరింత నునుపుతేలి మిలమిలమెరిసిపోతుంటే వరదయ్య కుళ్లిన కూరగాయలాగా ముడుచుకుపోతున్నాడు. కరవు కాలం మొదటి మూడేళ్లు గాదెలో ఉన్న వడ్లు దంచుకుని తిన్నారు. నాలుగో ఏడు దంచిన బియ్యంతో తను మాత్రమే తిని భర్తకు ఏవో నాలుగు మెతుకులు పడేసేది. రెండునెలలు తిట్టాడు. అరిచాడు. పోట్లాడాడు. మూడోనెల నుండి కడుపులో ఎలకలు తిరుగుతుంటే ఆకలితో ఏడ్చాడు. ఐదో నెలనుండి కడుపులో ఎలకలు కూడా తిరిగి తిరిగి చచ్చాయి. దాంతో జ్ఞానోదయమయ్యింది. బాగా నీరసించి పోయి కూర్చుంటే లేవలేడు కాబట్టి కర్ర చేతికిచ్చింది. అది పుచ్చుకుని ఎట్లాగొట్లా కాలకృత్యాలు తీర్చుకునే శక్తి కలిగేలా తిండి పెట్టేది. ఊళ్లో తనలాంటి దౌర్భాగ్య ముసలి మొగుళ్లు ఎవరున్నారో తెలుసుకుని అంత కలిసి ఓ చెట్టుక్రింద చేరి కుళ్లి కుళ్లి ఏడ్చేవాళ్లు.

(సశేషం)

FORM IV

(See Rule 8)

The Registration of Newspapers (Central) Rules, 1956.

Place of Publication	:	HYDERABAD
Periodicity of Publication	:	WEEKLY
Printer's Name	:	**Nagol Sreenivas Reddy**
Nationality	:	INDIAN
Address	:	10-3-304/13, C/o Ashwini Poly Clinic, Humayun Nagar, Hyderabad-500 028. Telangana.
Publisher's Name	:	**Nagol Sreenivas Reddy**
Nationality	:	INDIAN
Address	:	10-3-304/13, C/o Ashwini Poly Clinic, Humayun Nagar, Hyderabad-500 028. Telangana.
Editor's Name	:	**Dr. Goparaju Narayana Rao**
Nationality	:	INDIAN
Address	:	Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli Kachiguda, HYDERABAD - 500 027.
Names and Address of individuals who own the news paper and partners or Shareholders holding more than one percent of the total capital	:	**JAGRITI PRAKASHAN TRUST(Regd.)** Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli Kachiguda, HYDERABAD - 500 027.

1. I Nagol Sreenivas Reddy hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

1-3-2026 Sd/-

HYDERABAD Publisher

హసీనా ప్రభుత్వ పతనం తర్వాత అనుక్షణం హింసాకాండతో అట్టుడికిన బాంగ్లాదేశ్‌లో ఎట్టకేలకు ప్రజా ప్రభుత్వం ఏర్పాటైంది. ఫిబ్రవరి 17న బాంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్ఎస్) నాయకుడు, దివంగత మాజీ అధ్యక్షురాలు ఖలీదా జియా కుమారుడు తారిక్ రహమాన్ ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించడంతో, భారత్– బాంగ్లాదేశ్ సంబంధాలు తిరిగి గాట్లో పడతాయన్న ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికలు జరిగిన వెంటనే దౌత్యపరంగా మనదేశం వేగంగా పావులు కదిపింది. తారిక్ రహమాన్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మనదేశం తరపున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇరుదేశాల మధ్య ఆర్థిక, భద్రత, సన్నిహిత సహకారాలను పెంపొందించుకోవాలని కోరుతూ ప్రధాని రాసిన లేఖను, బాంగ్లా కొత్త ప్రధానికి అందజేశారు. రహమాన్‌ను మనదేశానికి ప్రధాని మోదీ ఆహ్వానించారు. ఎన్నికల్లో విజయం సాధించగానే తారిక్ రహమాన్‌కు అన్నిదేశాలకంటే ముందుగా శుభాకాంక్షలు తెలపడం ద్వారా ప్రధాని నరేంద్రమోదీ, ప్రస్తుతం దెబ్బతిన్న సంబంధాల స్థానంలో మునుపటి స్నేహం కొనసాగించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

తాజా పరిణామాలను పరిశీలిస్తే నూతన ప్రభుత్వం భారత్‌తో సమతుల్య సాన్నిహిత్యాన్ని కొనసాగిస్తూనే చైనా, పశ్చిమ దేశాలతో కూడా సన్నిహిత సంబంధాలు పెంపొందించుకోవాలన్న ఉద్దేశంతో ఉన్నట్టు స్పష్టమవుతోంది. ఇదే సమయంలో అంతర్గతంగా షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీతో కూడా సఖ్యంగా మెలగాలన్న అభిప్రాయం కూడా వ్యక్తమవడం విశేషం. ఇక మనదేశంతో సంబంధాల విషయానికి వస్తే నీటి పంపకాలు, సరిహద్దు నిర్వహణ, అసమతుల్య వాణిజ్యం వంటి అంశాల విషయంలో తారిక్ రహమాన్ ప్రభుత్వం కచ్చితంగా వ్యవహరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతానికి ఇరుదేశాల మధ్య అనుసంధానత, వాణిజ్యంపై రెండు ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించనున్నాయి. ఇక ముందు బాంగ్లాదేశ్‌తో సంబంధాలు ప్రధానంగా జాతీయ ప్రయోజనాలు, సార్వభౌమత్వ పరిరక్షణ కేంద్రంగానే కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది. గడచిన దశాబ్దకాలంలో పరస్పర సహకారం, పూర్తిస్థాయి విశ్వాసంతో కొనసాగిన సంబంధాలకు ఇది భిన్నం.

భారత్‌తో సంబంధాలు

దక్షిణాసియాలో బాంగ్లాదేశ్ మనకు అత్యంత పెద్ద వాణిజ్య భాగస్వామి. ఇరుదేశాల మధ్య జరిగే వాణిజ్యం విలువ వార్షికంగా 13 బిలియన్ డాలర్లు! షేక్ హసీనా ప్రభుత్వ పతనంతోనే ఈ వాణిజ్య స్వర్ణయుగం ముగిసింది. మళ్లీ అంతటిస్థాయికి వాణిజ్యం చేరుకోవడం ప్రస్తుత బీఎన్‌పీ ప్రభుత్వ వ్యవహారశైలిపై ఆధారపడి ఉంది.నువ్వు ఒక అడుగు ముందుకేస్తే...నేను నాలుగు అడుగులు ముందుకు వస్తానన్న రీతిలో భారత్ వ్యవహరిస్తోంది. యూనస్ హయాంలో జరిగిన పరిణామాలను పక్కనబెట్టి కొత్త ప్రభుత్వం కొలువు తీరిన వెంటనే, అక్కడి అధికారులు, జమాతే ఇస్లామీ వంటి విపక్షాలతో మనదేశ అధికారులు సమావేశమయ్యారు. ముఖ్యంగా అట్టడుగుకు చేరిన ద్వైపాక్షిక సంబంధాలను గాట్లో పెట్టడమే ప్రధాన లక్ష్యం. భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య సహకారం ప్రధానంగా ఈశాన్య రాష్ట్రాల అనుసంధానత, ఇంధనంతో పాటు సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించే అవకాశముంది. బాంగ్లాదేశ్ నుంచి మనదేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య చొరబాట్లు!

గతంలో బీఎన్‌పీ అధికారంలో ఉన్నప్పుడు ఈ చొరబాట్ల స్థాయి విపరీతంగా ఉండేది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ "పరస్పర భద్రత కోసం కలిసి పనిచేయడం" అన్న వ్యూహాన్ని ముందుకు తీసుకు వచ్చారు. కొత్త ప్రభుత్వం భారత్‌తో సంబంధాలు కొనసాగిస్తూనే చైనా, పాకిస్తాన్‌లతో కూడా సన్నిహితంగా మెలగాలని కోరుకుంటోంది. ఈ నేపథ్యంలో బాంగ్లాదేశ్ ముఖ్యంగా పాకిస్తాన్‌తో వ్యవహరించే తీరును మన ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. ఈ వ్యవహారశైలి ప్రాంతీయ శాంతి సుస్థిరతలపై కనబరచే ప్రభావంపై అంచనా వేస్తోంది. అక్రమ చొరబాట్లను నిరోధించడం, బాంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక శక్తులను కఠినంగా నియంత్రించే చర్యలను కొత్త ప్రభుత్వం తక్షణమే చేపట్టాలన్నది భారత్ అభిప్రాయం. ఇరుదేశాల మధ్య గంగానదీ జలాల ఒప్పందం గడువు ఈ ఏడాది డిసెంబర్ నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించాలన్న ఉద్దేశంతో కొత్త ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో అగ్రస్థానంలో ఉంచింది. ఇటీవల టీ20 క్రికెట్ మ్యాచ్ విషయంలో ఇరుదేశాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. బాంగ్లాదేశ్ కొత్త క్రీడలమంత్రి ఈ విషయంలో ఇప్పటికే దౌత్యపరంగా సమస్యను పరిష్కరించుకుందామని చెప్పడం సానుకూల పరిణామం. కొత్తగా ఏర్పడిన బీఎన్‌పీ ప్రభుత్వం నుంచి సానుకూల పవనాలు వీస్తున్నప్పటికీ, బాంగ్లా చొరబాట్లు, అక్కడి మైనారిటీ హిందువులపై దాడులు, హత్యలు మనదేశానికి ఆందోళన కలిగిస్తున్నాయి.

సంబంధాల విధ్వంసకుడు యూనస్

షేక్ హసీనా పాలనా కాలాన్ని భారత్– బాంగ్లాదేశ్ సంబంధాల్లో స్వర్ణయుగంగా పోల్చవచ్చు. ఆమె ప్రభుత్వాన్ని పడగొట్టి, ప్రభుత్వ సలహాదారుగా మహమ్మద్ యూనస్ పగ్గాలు చేపట్టిన నాటినుంచి ఇరుదేశాల సంబంధాలు వేగంగా పతనమయ్యాయి. ఈ కాలాన్ని "భారత విద్వేష" యుగంగా పరిగణించాలి. హసీనాను తమకు అప్పగించాలని బాంగ్లాదేశ్ మన దేశంపై ఒత్తిడి తీవ్రం చేసింది. అందుకు అంగీకరించకపోవడంతో, ఇది మిత్రవైఖరి కాదంటూ విమర్శించడం మొదలుపెట్టింది. దీంతో "ఇండియా

జెట్” ఉద్యమాన్ని అధికారులు, కొన్ని మతతత్వ గ్రూపులు మొదలుపెట్టాయి. భారత్‌పై విద్వేషం పరాకాష్టకు చేరుకుంది. వాణిజ్య పరిమితులు విధించడంవల్ల భారత వస్తువులు ముఖ్యంగా వస్త్ర పరిశ్రమకు అవసరమైన నూలు దిగుమతులు నిలిచిపోయాయి. మనదేశం నుంచి విద్యుత్ సరఫరా ఆగిపోయింది.

దేశంలో మౌలిక వసతుల ప్రాజెక్టులు ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. వస్త్రపరిశ్రమలు వరుసగా మూతపడటంతో లక్షలాదిమంది కార్మికులు వీధులపాలయ్యారు. ఇంతగా దేశ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, యూనస్ “మేం భారత్‌కు లొంగి ఉండే ప్రసక్తే లేదు” అని తెగేసి చెప్పడం అతని మూర్ఖత్వానికి పరాకాష్ట! అంతేకాదు ఫిబ్రవరి 16న తన వీడ్కోలు ప్రసంగంలో మాట్లాడుతూ, భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలు (సెవెన్ సిస్టర్స్) చుట్టూ భూభాగాలతో పర్యవేష్టితమై ఉన్నందువల్ల, సముద్రతీరం ఉన్న బాంగ్లాదేశ్‌తో వాణిజ్య సంబంధాలు పెట్టుకున్నట్లయితే ఇవి మరింత సుసంపన్నమై ఉండేవని వ్యాఖ్యానించడం, కేవలం భారత సార్వభౌమాధికారాన్ని ప్రశ్నించడమే! ఇరు దేశాల మధ్య ఇంతటి ఉద్రిక్తలు నెలకొన్నప్పటికీ ఏప్రిల్, 2025లో ప్రధాని నరేంద్రమోదీ, యూనస్‌ల మధ్య బ్యాంకాక్‌లో చర్చలు జరిగాయి. సరిహద్దు సమస్య, నీటి వాటాలు, మైనారిటీల రక్షణ వంటి అంశాలు ఇందులో ప్రస్తావనకు వచ్చాయి.

పాక్‌తో సంబంధాలు

బాంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ అస్థిరతను పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఐఎస్ఐ తన వ్యూహాత్మక లక్ష్యాల సాధనకు ముఖ్యంగా భారత ఈశాన్య ప్రాంతంలో తన ఉనికిని మరింత విస్తరించుకునేందుకు ఉపయోగించుకున్నదన్న విశ్లేషణలు మీడియాలో వచ్చాయి. యూనస్ పగ్గాలు చేపట్టిన తర్వాత ఆకస్మాత్తుగా బాంగ్లా-పాక్‌ల మధ్య స్నేహం పెరగడాన్ని చూస్తే 1971కి ముందు నాటి కాలం గుర్తుకు వచ్చింది. ఐఎస్ఐ తనకు అనుకూల జమాతే ఇస్లామీ, దాని విద్యార్థి విభాగం ఇస్లామీ ఛాత్ర శిబిర్‌ల సహాయంతో హసీనా వ్యతిరేక ఆందోళనతో పాటు హింసాకాండ సుదీర్ఘకాలం పాటు కొనసాగే విధంగా వ్యూహాన్ని అమలు చేసిందనేది నిపుణులు చెప్పే మాట. ఇదే సమయంలో పాకిస్తాన్‌లోని సోషల్ మీడియా ప్రజల్లో భారత వ్యతిరేకతను విపరీతంగా ప్రచారం చేయడమే కాకుండా హింసాకాండ ఉధృతంగా కొనసాగేందుకు కావలసిన ఆజ్యం పోసింది. భారత్-బాంగ్లాదేశ్‌ల మధ్య భద్రతా సహకారం బలహీనపడటంతో, ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్రవాద నెగళ్లను రాజేసేందుకు ఐఎస్ఐ ప్రయత్నించింది. ఈ తీవ్రవాదులకు బాంగ్లాదేశ్ స్వర్గధామంగా మారడం గమనార్హం.

భారత్-బాంగ్లా సంబంధాలను దెబ్బతీసి, తనకు అనుకూల ఇస్లామిక్ వ్యవస్థను ఒకవైపు, మరోవైపు చైనాతో బాంగ్లా సంబంధాలు బలపడేవిధంగా పాకిస్తాన్ తన వ్యూహాలను అమలు చేసింది. మే, 2025లో పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ ఒక వీడియో విడుదల చేసింది. హసీనా ప్రభుత్వాన్ని పడగొట్టింది తామేనని అందులో పేర్కొంది. విధ్వంసాన్ని సృష్టించి ఈ పనిని విజయవంతంగా పూర్తిచేసినట్టు వివరించింది. యూనస్ హయాంలో బాంగ్లాదేశ్ యుద్ధ నౌక, పాక్ నౌకా విన్యాసాల్లో పాల్గొనడం 1971 తర్వాత ఇదే మొదటిసారి! సిలిగురి కారిడార్ సమీపంలో తీస్తానది పునరుద్ధరణ ప్రాజెక్టును చైనా మద్దతుతో చేపట్టాలని యూనస్ నిర్ణయించాడు. ఇక్కడ భారత్ భద్రతా పరమైన సమస్యలను ఎంతమాత్రం ఖాతరు చేయలేదు. పాకిస్తాన్‌తో చారిత్రక సంబంధాల పునరుద్ధరణ కోసం తహతహలాడారు. ఇందుకోసం పాకిస్తాన్ జనరల్స్‌ను పదేపదే తమ దేశంలోకి ఆహ్వానించారు. “గ్రేటర్ బాంగ్లాదేశ్” పేరుతో ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమ బెంగాల్, బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాలను కలిపి రూపొందించిన వివాదాస్పద మ్యాప్‌ను పాకిస్తాన్ జనరల్‌కు బహూకరించడంతో దుమారం రేగింది.

హిందువులపై దాడులు

గత ఆగస్టులో చెలరేగిన విధ్వంసకాండలో పలు హిందూ ఆలయాలు ధ్వంసమయ్యాయి. కేవలం 2024లోనే మైనారిటీ హిందువులపై 2000 దాడులు జరిగాయంటే బాంగ్లాదేశ్‌లో హిందువుల పట్ల ఎంతటి వ్యతిరేకత పెరిగిపోయిందీ అర్థమవుతుంది. 2024, ఆగస్టు 4-20 మధ్యకాలంలో మతోన్మాదులు విచ్చలవిడిగా హిందువుల ఆస్తుల విధ్వంసం, వ్యాపార ప్రదేశాలు, ఇళ్లపై దాడులు దహనకాండకు పాల్పడ్డారు. ఈ లూటీలు, దహనకాండలో 1700 హిందూ కుటుంబాలు వీధినపడ్డాయి. 82 మంది హిందువులు హత్యకు గురయ్యారు. అల్లరిమూకలు వీరి ఆస్తులను బలవంతంగా ఆక్రమించుకున్నాయి. 152 హిందూ ఆలయాలు ధ్వంసమయ్యాయి. 2021లో దుర్గాపూజ సందర్భంగా 50 దేవాలయాలు, హిందువుల ఇళ్లు దాడుల్లో ధ్వంసమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన అల్లర్లలో 9మంది మరణించారు. వివిధ జిల్లాల్లో ఒక పద్ధతి ప్రకారం విధ్వంసకాండ జరిగింది. గత ఏడాది డిసెంబర్‌లో వస్త్రపరిశ్రమలో పనిచేసే దీపూ చంద్రదాస్ అనే హిందూ కార్మికుడిని హింసించి బహిరంగంగా సజీవదహనం చేశారు. డిసెంబర్, 2025లో చిట్టగాంగ్‌లోని రాంజాన్ ఏరియాలో హిందువులను ఇళ్లలో ఉంచి బయట తాళం పెట్టి మరీ ఇళ్లను తగులబెట్టారు. నవంబర్, 2024లో చిన్మయ కిషన్ దాస్‌ను రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారన్న కారణంగా అరెస్ట్ చేయడంతో, ఛట్టోగ్రామ్‌లో పెద్దఎత్తున అల్లర్లు చెలరేగాయి. అయితే వీటిపై దర్యాప్తు జరిపిన పోలీసులు కొన్ని మతపరమైన విధ్వంసంగా, రాజకీయ విభేదాలు, స్థానికంగా ప్రత్యర్థి వర్గాల మధ్య జరిగిన పరస్పర దాడులుగా పేర్కొన్నారు. సోషల్ మీడియాలో దైవదూషణపై విపరీత ప్రచారం, రాజకీయ అనిశ్చితి లేదా దుర్గాపూజ సమయాల్లో అల్లర్లు, విధ్వంసం జరుగుతోంది. ముఖ్యంగా గోపాల్‌గంజ్ వంటి హిందువులు అధికంగా ఉన్న ప్రాంతాలపైనే ఈ దాడులు జరగుతుండటం గమనార్హం. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం భద్రతాదళాలను దించి, పరిస్థితిని చక్కబెట్టినా ఫలితం ఉండటంలేదు. మైనారిటీలకు ఎటువంటి భద్రత లేకపోవడంతో, వీరి రక్షణకోసం “బాంగ్లాదేశ్ మైనారిటీ జనతా పార్టీ” వంటి పార్టీల ఆవిర్భావం జరిగింది. మన విదేశాంగ శాఖ బాంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రతపై ఎప్పటికప్పుడు ఆందోళన వ్యక్తం చేస్తూవస్తోంది. బాంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఐక్యరాజ్య సమితిని, పశ్చిమ దేశాలను 125 అంతర్జాతీయ గ్రూపులు అర్థించాయంటే, అక్కడ హిందువుల పరిస్థితి ఎంతటి దయనీయంగా ఉన్నదీ అర్థమవుతుంది.

జమలాపురపు విఠల్‌రావు

సీనియర్ జర్నలిస్ట్

సమతుల్య దృష్టి ఏమిటంటే –

వారు విశేష సంస్కారసంపన్నులు; అయినా వారు మానవులే.

మనమూ మానవులమే; కాబట్టి ఆత్మసాధనకు మనకూ అవకాశముంది.

భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో బాలజ్ఞానుల కథలు కేవలం పురాణ రమ్యత కాదు; అవి మనసును ఉన్నత లక్ష్యాల వైపు మలిచే చిహ్నాలు. కారణజన్ములైన మహనీయులను మనతో పోల్చి "ఇది కల్పితం" అని తిరస్కరించడం సబబు కాదు. అదే సమయంలో, వారిని అందనంత దూరంలో ఉంచి మనసాధనను వదిలేయడం కూడా తగదు.

వారి జీవితం ఒక సూత్రాన్ని చెబుతుంది –

జ్ఞానం వయస్సుపై ఆధారపడదు; సంస్కారంపైనే ఆధారపడుతుంది.

సాధన ఎప్పుడైనా ప్రారంభించవచ్చు; ఫలితం ఈ జన్మలో కాని మరొక జన్మలో కాని వికసించ వచ్చు.

అందుకే భారతీయ దృష్టిలో బాలజ్ఞానులు అసంభవం కాదు – వారు సంస్కారం, సాధన, దైవానుగ్రహ సమన్వయముల ఫలితాలు.

చతురామ్నాయ పీఠాలు – కాంచీ కామకోటి పీఠం – అద్వైతం, ఆత్మనిర్భర భారత దృష్టి

చతురామ్నాయ, మూలామ్నాయ పీఠవ్యవస్థ – శంకరభగవత్పాదుల నిర్మాణమే, ఆదిశంకరుల అద్వైతం–ఆత్మనిర్భర భారతానికి ఆధ్యాత్మిక మూలాధారం.

భారతదేశ ఆధ్యాత్మిక చరిత్రలో ఆదిశంకరభగవత్పాదుల అవతరణం ఒక మహత్తర సంధికాల ఘట్టం. భారతదేశ చరిత్రలో కొన్ని మహనీయులు కాలాన్ని మలిచారు. వారిలో ఆదిశంకరభగవత్పాదులు అగ్రగణ్యులు. ఉపనిషత్తుల అద్వైతసారాన్ని స్పష్టంగా ప్రతిపాదించి, వేదప్రామాణ్యాన్ని పునరుద్ధరించి, దేశవ్యాప్తంగా సంచరించి తాత్త్విక ఐక్యతను స్థాపించిన మహోన్నత కర్తృత్వం శంకరులది. వారి ఆవిర్భావం కేవలం తాత్త్విక పరిణామం మాత్రమే కాదు; అది సాంస్కృతిక, ఆధ్యాత్మిక, జాతీయ పునర్నిర్మాణ ఉద్యమం. ఆ పునర్నిర్మాణానికి సంస్థాగత రూపం చతురామ్నాయ పీఠవ్యవస్థ. ఈ వ్యవస్థ శంకరుల నిర్మాణమే అనే దృఢనిశ్చయంతో చూస్తే, అద్వైత వేదాంతం భారత ఆత్మనిర్భరతకు మూలాధారమని స్పష్టమవుతుంది.

ఆచార్య రాణి సదాశివమూర్తి
ఉపకులపతి,
శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, తిరుపతి

ఈ తాత్త్విక పునరుజ్జీవనానికి శాశ్వతత్వం కలిగించేందుకు వారు సంస్థాగత నిర్మాణాన్ని సమకూర్చారు. సంప్రదాయంగా అంగీకరించిన శృంగేరి, ద్వారకా, పురీ, జ్యోతిర్మఠ రూపమైన చతురామ్నాయ పీఠవ్యవస్థ భారతదేశాన్ని నాలుగు దిక్కులుగా ఆధ్యాత్మికంగా ఏకం చేసిన నిర్మాణశిల్పం.

ఈ పరంపరలోనే కాంచీ కామకోటి పీఠం కూడా విశిష్ట స్థానాన్ని పొందింది. దక్షిణ భారత ఆధ్యాత్మిక–శాస్త్రపరంపరలో కాంచీ ఒక ప్రాచీన విద్యాక్షేత్రం. వేద, ఆగమ, శాస్త్ర సంప్రదాయాల సంగమస్థలంగా అది చిరకాలంగా కీర్తి పొందింది. సంప్రదాయ విశ్వాసం ప్రకారం శంకరభగవత్పాదుల కృపాపాత్రంగా కామకోటి పీఠం అద్వైత సంప్రదాయాన్ని పరిరక్షిస్తూ భారతీయ చైతన్యానికి మార్గదర్శకత్వం వహించింది. చారిత్రక చర్చలు ఉన్నా, ఆధ్యాత్మిక ప్రభావం విషయంలో కాంచీ పీఠం భారతదేశంలో అద్వైత ధర్మబోధకు ప్రముఖ కేంద్రమైనది అనేది నిర్వివాదం.

అద్వైతం ప్రకటించిన మహావాక్యం – అహం బ్రహ్మాస్మి – వ్యక్తికి ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. తత్త్వమసి– సమష్టి ఐక్యతను సూచిస్తుంది. జీవాత్మ–పరమాత్మల మధ్య అభేదసత్యం ఎలాగైతే పరమార్థం, అలాగే భారతదేశం, భారతీయుల మధ్య ఉన్న అంతఃసంబంధం కూడా అభేదమే. ఈ భావన వ్యక్తిని హీనభావం నుంచి, సమాజాన్ని విభజన నుంచి, దేశాన్ని పరాధీనత నుంచి విముక్తం చేస్తుంది.

చతురామ్నాయ పీఠాలు, కాంచీ కామకోటి పీఠం కలిసి భారతదేశాన్ని భౌగోళికంగా మాత్రమే కాదు, ఆధ్యాత్మికంగా కూడ కట్టిపడేసిన కేంద్రాలుగా నిలిచాయి. వేదపారంపర్యం, గురుశిష్య సంబంధం, శాస్త్రసంరక్షణ – ఇవన్నీ ఈ పీఠాల ద్వారా నిరంతరాయంగా కొనసాగాయి. ఈ సంస్థాగత ఐక్యతకు మూలం అద్వైత తాత్త్విక దృష్టి; ఆ దృష్టికి మూలం ఉపనిషత్తుల అభేదసత్యం.

అందువల్ల శంకరుల ఆత్మనిర్భర దృష్టి – వ్యక్తి అంతరంగ స్వాతంత్ర్యం – పీఠవ్యవస్థ ద్వారా ఏర్పడిన సమాజ ఐక్యత–ఈ రెండూ కలిసి ఆధునిక ఆత్మనిర్భర భారతానికి ఆధ్యాత్మిక పునాది. ఈ వ్యాసం ఆ అభేద దృష్టిని, చతురామ్నాయ, కాంచీ కామకోటి పీఠాల పాత్రను, అద్వైతం ద్వారా వ్యక్తి–దేశ సమగ్రతను పరిశీలించడానికి ప్రయత్నిస్తుంది.

1. కాలపరిమాణంలో శంకరుల అవసరం

శంకరుల అవతరణ సమయానికి భారతదేశం తాత్త్వికంగా విభిన్న దారుల్లో విస్తరించింది. బౌద్ధ, జైన, శైవ, వైష్ణవ, శాక్త, గాణాపత్య, సౌర, కౌమార సంప్రదాయాలు వేర్వేరు ఆరాధనలతో విభజితమై ఉన్నాయి. వేదమూలాధారం ఉన్నా, సమన్వయ దృష్టి తగ్గింది. ఈ నేపథ్యంలో శంకరులు అవతరించి: వేదప్రామాణ్యాన్ని స్థాపించారు. ఉపనిషత్తుల అద్వైతసారాన్ని వెలికి తీశారు. భాష్యరచనల ద్వారా శాస్త్రసంప్రదాయాన్ని క్రమబద్ధీకరించారు. దేశవ్యాప్తంగా సంచరించి తాత్త్విక ఐక్యతను ప్రతిష్ఠించారు. ఈ కార్యాచరణకు శాశ్వతత్వం కలిగించేందుకు సంస్థాగత నిర్మాణం అవసరం. అదే చతురామ్నాయ, మూలామ్నాయ పీఠవ్యవస్థ.

2. చతురామ్నాయ పీఠాలు - జాతీయ ఐక్యతకు ధార్మిక రూపకల్పన

సంప్రదాయ ప్రకారం శంకరులు నాలుగు దిక్కులలో నాలుగు పీఠాలను స్థాపించారు:

శృంగేరి–దక్షిణామ్నాయము
(యజుర్వేద సంబంధం)
ద్వారకా–పశ్చిమామ్నాయము
(సామవేద సంబంధం)
పురీ– తూర్యామ్నాయము (ఋగ్వేద సంబంధం)
జ్యోతిర్మఠ/బదరీ– ఉత్తరామ్నాయము
(అథర్వవేద సంబంధం)
శ్రీ కాంచీపుర కామకోటి – మూలామ్నాయము

ఆ పీఠాల స్థా

ఈ వ్యవస్థలో గంభీరమైన ఆలోచన దాగి ఉంది. భారతదేశాన్ని కేవలం భౌగోళికంగా కాదు, ఆధ్యాత్మికంగా ఒకటిగా నిలపడం. నాలుగు దిక్కులలో నాలుగు వేదప్రవాహాలు ప్రవహిస్తూ, ఒకే అద్వైత సిద్ధాంతాన్ని పరిరక్షించాలి–ఇదే శంకరుల సంకల్పం.

ఇది కేవలం మఠస్థాపన కాదు; ఇది ఒక ఆధ్యాత్మిక పరిపాలనా వ్యవస్థ. ప్రతి పీఠం ఒక వేదాన్ని, ఒక మహావాక్యాన్ని, ఒక సంప్రదాయాన్ని పరిరక్షిస్తుంది. ఈ విధంగా దేశం మొత్తాన్ని ఒకే తాత్త్విక దారంలో కట్టిపడేసింది.

3. అద్వైతం - ఆత్మనిర్భరతకు మూలతత్త్వం

అద్వైత వేదాంతం ప్రధాన సూత్రం:

"బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః"

ఈ సిద్ధాంతం వ్యక్తిలో భయాన్ని తొలగిస్తుంది. ఎందుకంటే అతడు పరబ్రహ్మస్వరూపుడే. ఆత్మ విశ్వాసం, స్వాభిమానము, స్వాతంత్ర్యభావం – ఇవి అద్వైతానుభూతి నుంచి ఉద్భవిస్తాయి.

ఆత్మనిర్భర భారతం అంటే కేవలం ఆర్థిక స్వావలంబన కాదు. అది సాంస్కృతిక, ఆధ్యాత్మిక, మానసిక స్వాతంత్ర్యం.

అద్వైతం చెబుతుంది: మనం పరాధీనులం కాదు. మన మూలం పరబ్రహ్మ. జ్ఞానం మన అంతరంగంలోనే ఉంది.

పకులు ఆదిశంకరులే!

ఈ భావన వ్యక్తిని లోపల నుంచి బలపరుస్తుంది. వ్యక్తి బలపడితే సమాజం బలపడుతుంది; సమాజం బలపడితే దేశం బలపడుతుంది.

4. చతురామ్నాయ, మూలామ్నాయ పీఠాలు - ఆత్మనిర్భర భారతానికి నిర్మాణ శిల్పం

శంకరులు కేవలం తత్వవేత్త కాదు; వారు దూరదృష్టి గల సంస్కృతిశిల్పి. పీఠాల ద్వారా వేదాధ్యయన పరంపర కొనసాగింది. సంస్కృతం, శాస్త్రాలు, ధర్మసూత్రాలు పరిరక్షించబడ్డాయి. గురుపరంపర నిరంతరత్వం పొందింది. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం ఏర్పడింది.

ఈ వ్యవస్థ వల్ల:

విదేశీ ఆలోచనల ఒత్తిడిలో కూడా వేద సంప్రదాయం నిలిచింది. భిన్నమతాలు ఉన్నా, వేదాధారిత ఐక్యత నిలిచింది.

ఆధ్యాత్మిక కేంద్రాలు దేశ ఐక్యతకు మూలస్తంభాలయ్యాయి. ఇది ఆత్మనిర్భరతకు సాంస్కృతిక ఆధారం.

5. అద్వైతం- జాతీయ చైతన్యానికి అంతరాత్మ

అద్వైతం భేదాలను తొలగిస్తుంది.

జాతి, మత, ప్రాంత, వర్ణ విభేదాలన్నీ పరమార్థంలో అనత్యమని ఉపదేశిస్తుంది. ఈ భావన దేశాన్ని అంతర్గతంగా ఏకం చేస్తుంది. ఒకే చైతన్యం అన్న భావన కలిగిన సమాజం విభజనకు లోను కాదు. శంకరుల సంచారం – కేరళ నుంచి కాశ్మీరం వరకు – ఒక జాతీయ యాత్ర. ఆ యాత్ర ఫలితమే చతురామ్నాయ, మూలామ్నాయ పీఠవ్యవస్థ.

చతురామ్నాయ, మూలామ్నాయ పీఠవ్యవస్థ శంకరుల నిర్మాణమే అని సంప్రదాయం దృఢంగా నమ్ముతుంది. చారిత్రక వాదప్రతివాదాలు పాశ్చాత్య భావదాస్య సముత్పన్నాలు. భారత ఆధ్యాత్మిక ఐక్యతపై ఆ వ్యవస్థ చూపిన ప్రభావం అనివార్యం. అద్వైతం వ్యక్తికి ఆత్మవిశ్వాసం ఇస్తుంది; పీఠవ్యవస్థ సమాజానికి నిర్మాణం ఇస్తుంది.

అందువల్ల ఆదిశంకరుల అద్వైతం కేవలం తత్వశాస్త్రం కాదు–

అది ఆత్మనిర్భర భారతానికి ఆధ్యాత్మిక రాజమార్గం.

వ్యక్తి బ్రహ్మస్వరూపుడని తెలుసుకున్నప్పుడు దేశం దాస్యమనోభావం నుంచి విముక్తమవుతుంది.

అదే శంకరుల సందేశం. అదే చతురామ్నాయ, మూలామ్నాయ పీఠవ్యవస్థ లక్ష్యం.

అదే ఆత్మనిర్భర భారతానికి ఆధ్యాత్మిక మూలాధారం.

శంకరుల "ఆత్మ" నిర్భరతే ఆధునిక "ఆత్మ నిర్భరత"

జీవాత్మ–పరమాత్మ అభేదం వంటి భారత–భారతీయుల అభేదమే ఆత్మనిర్భర భారతం–

"ఆత్మనిర్భర భారత్" అనే నినాదం ఆధునిక భారతదేశ ఆర్థిక–సామాజిక దిశను సూచిస్తుంది. కానీ భారతీయ దృష్టిలో "ఆత్మ" అనే పదం కేవలం వ్యక్తిగత సామర్థ్యాన్ని మాత్రమే సూచించదు; అది ఆధ్యాత్మిక పరమార్థాన్ని సూచిస్తుంది. ఈ సందర్భంలో ఆదిశంకరభగవత్పాదుల అద్వైతసిద్ధాంతం ఒక లోతైన ఆధ్యాత్మిక మూలాన్ని అందిస్తుంది. శంకరుల "ఆత్మనిర్భరత" భావన – జీవాత్మ పరమాత్మల మధ్య అభేదాన్ని ప్రకటించిన దృష్టి – ఆధునిక ఆత్మనిర్భర భారతానికి అంతరాత్మగా నిలుస్తుంది.

1. అద్వైతం – ఆత్మలోనే పరిపూర్ణత

శంకరులు ప్రకటించిన మహావాక్యార్థం:

"తత్త్వమసి"

"అహం బ్రహ్మాస్మి"

జీవుడు పరమాత్మతో వేరుకాదని అద్వైతం ప్రకటిస్తుంది.

అజ్ఞానం వల్లనే భేదభావం ఉద్భవిస్తుంది. జ్ఞానం కలిగితే అభేదసత్యం ప్రత్యక్షమవుతుంది.

ఈ సిద్ధాంతం వ్యక్తిలో ఒక మహత్తర విశ్వాసాన్ని నింపుతుంది:

నేను పరిమితుడను కాను. నా మూలం అనంతం.

పరాధీనత నా స్వరూపం కాదు.

అనే ఈ అంతర్గత స్వావలంబనే నిజమైన "ఆత్మనిర్భరత".

2. వ్యక్తి-దేశ సంబంధం:

తాత్త్విక సమాంతరము

ఎలాగైతే జీవాత్మ పరమాత్మల మధ్య పరమార్థంలో భేదం లేదో, అలాగే భారతదేశం, భారతీయుల మధ్య కూడా భేదం లేదు.

దేశం అనేది భూమి మాత్రమే కాదు; అది ప్రజల చైతన్యరూపం.

భారతీయుల ఆత్మస్వరూపం, సంస్కృతి, ధర్మబోధ, విలువలు – ఇవే భారతదేశం.

అందువల్ల భారతీయుడు బలపడితే భారతం బలపడుతుంది.

వ్యక్తి ఆత్మవిశ్వాసం దేశ ఆత్మవిశ్వాసంగా మారుతుంది.

ఇది అద్వైత దృష్టిలో సామాజిక అన్వయం.

3. పరాధీనతకు మూలం – అజ్ఞానం

అద్వైతం ప్రకారం బంధనానికి కారణం అజ్ఞానం (అవిద్య).

అదేవిధంగా జాతీయ పరాధీనతకు కారణం కూడా మనసులోని దౌర్బల్యం.

''మనకు సాధ్యం కాదు'' అనే భావం, "విదేశీయులే శ్రేష్ఠులు" అనే మోహం స్వసంస్కృతిపై నమ్మకం కోల్పోవడం ఇవి సమష్టి అజ్ఞానం.

శంకరుల సందేశం ఏమిటంటే –

సత్యాన్ని తెలుసుకో. నీ స్వరూపాన్ని గ్రహించు. అప్పుడు భయం తొలగిపోతుంది.

ఇదే జాతీయ స్థాయిలో ఆత్మనిర్భరతకు మూలసూత్రం.

4. అభేద భావం – ఐక్యతకు మూలం

అద్వైతం భేదాన్ని ఉపాధి ఆధారంగా మాత్రమే

శృంగేరి పీఠం

ద్వారకా పీఠం

పురీ పీఠం

బదరీ పీఠం

అంగీకరిస్తుంది.

స్వరూపంలో ఏకత్వమే.

భారతదేశంలో భాషలు, ప్రాంతాలు, ఆచారాలు వేర్వేరు. కానీ సంస్కృతి మూలం ఒకటే. ధర్మబోధ ఒకటే.

జీవాత్మ–పరమాత్మల మధ్య ఉన్న అభేదమే. భారత–భారతీయుల మధ్య ఉన్న అంతఃసంబంధానికి ప్రతీక.

ఈ భావన పెరిగితే:

ప్రాంతీయ విభేదాలు తగ్గుతాయి. మతవర్గ విభేదాలు నడలుతాయి. సామాజిక ఐక్యత బలపడుతుంది

ఇదే ఆత్మనిర్భర భారతానికి పునాది.

5. శంకరుల సంచారం – జాతీయ చైతన్యం

శంకరులు కేరళలో జన్మించి కాశ్మీరంలో శారదాపీఠాన్ని అధిరోహించారు.

పురీ, ద్వారక, శృంగేరి, బదరీ – నాలుగు దిక్కులను సంచరించారు. అలాగే మధ్యలో కాంచీపురం. ఈ యాత్ర కేవలం తాత్త్విక విజయం కాదు;

అది భారతీయ ఐక్యతకు సంకేతం. అందువల్ల వారి అద్వైతం కేవలం వ్యక్తిగత మోక్షసాధన కాదు;

అది సమాజ ఐక్యతకు మార్గదర్శకం.

6. ఆధునిక ఆత్మనిర్భరత – ఆధ్యాత్మిక మూలం

నేడు ఆత్మనిర్భరతను ప్రధానంగా ఆర్థిక స్వావలంబనగా చూస్తున్నారు. కానీ ఆర్థిక శక్తికి మూలం మానసిక శక్తి. మానసిక శక్తికి మూలం ఆత్మ విశ్వాసం. ఆత్మవిశ్వాసానికి మూలం స్వస్వరూప జ్ఞానం.

అందుకే శంకరుల అద్వైతం ఆధునిక ఆత్మనిర్భర భారతానికి తాత్త్విక ఆధారం. విద్యలో స్వావలంబన, సంస్కృతిలో గౌరవభావం, విజ్ఞానంలో స్వతంత్రత, ధర్మంలో స్థిరత్వం ఇవి అన్నీ అద్వైత దృష్టిలో నుంచే ఉద్భవించగలవు.

ముఖ్యమైన విచారం

జీవాత్మ పరమాత్మల మధ్య అభేదం తెలిసినవాడు ఎప్పుడూ హీనభావంతో జీవించడు.

అలాగే భారతదేశం, భారతీయుల మధ్య ఉన్న అంతఃసంబంధం గ్రహించిన సమాజం ఎప్పుడూ పరాధీనతను అంగీకరించదు.

శంకరుల "ఆత్మ" నిర్భరత వ్యక్తి అంతరంగ బంధ విముక్తి.

ఆధునిక "ఆత్మనిర్భర భారత్" జాతీయ అంతరంగ బంధ విముక్తి.

ఈ రెండూ వేర్వేరు కాదు. అద్వైత దృష్టిలో అవి ఒకటే.

అందుకే చెప్పవచ్చు –

శంకరుల ఆత్మనిర్భరతే ఆధునిక ఆత్మనిర్భర భారతం.

అభేద భావమే భారత భవిష్యత్తు.

చతురామ్నాయ, మూలామ్నాయ పీఠవ్యవస్థ – – అద్వైత తాత్త్వికత – ఆత్మనిర్భర భారతం

శంకరదర్శనం

శంకర దర్శనం అంటే వారి ఉపదేశాలను చూడటం కాదు. వారిని చూడటం. వారిని ఎలా చూడాలో తెలియాలి అంటే ఈ ఏకాత్మతా స్తోత్రాన్ని అర్థం చేసుకోవాలి.

యం వైదికా మంత్రదృశః పురాణాః
ఇంద్రం యమం మాతరిశ్వా నమాహుః।
వేదాన్తినో నిర్వచనీయమేకమ్
యం బ్రహ్మ శబ్దేన వినిర్దిశన్తి॥
శైవాయమీశం శివ ఇత్యవోచన్
యం వైష్ణవా విష్ణురితి స్తువన్తి।
బుద్ధస్తథార్హన్ ఇతి బౌద్ధ జైనాః
సత్ శ్రీ అకాలేతి చ సిఖ్ఖ సన్తః॥
శాస్తేతి కేచిత్ కతిచిత్ కుమారః
స్వామీతి మాతేతి పితేతి భక్త్యా।
యం ప్రార్థయన్తే జగదీశితారమ్
స ఏక ఏవ ప్రభురద్వితీయః॥

"స ఏక ఏవ ప్రభురద్వితీయః" – ఇది శంకర భగవత్పాదుల సర్వమతసమ్మత స్వరూపం

"యం వైదికా మంత్రదృశః పురాణాః ఇంద్రం యమం మాతరిశ్వానమాహుః... వేదాంతినో నిర్వచనీయమేకం యం బ్రహ్మ శబ్దేన వినిర్దిశంతి" –ఈ వాక్యాలు భారతీయ ఆధ్యాత్మిక దృష్టిలోని విశాలతను ప్రకటిస్తాయి. వేదదృష్టికి అది ఇంద్రుడు, యముడు, వాయువు; వేదాంతికి అది నిర్వచనాతీత బ్రహ్మ; శైవునికి శివుడు; వైష్ణవునికి విష్ణువు; బౌద్ధునికి బుద్ధుడు; జైనునికి అర్హత్; సిఖ్కుకు 'సత్ శ్రీ అకాల్'. పేర్లు భిన్నం – పరమార్థం ఒక్కటే. "స ఏక ఏవ ప్రభురద్వితీయః"– ఆయనే ఒకడు, ద్వితీయుడు లేడు.

ఈ సమగ్ర దృష్టికి మూర్తిమంత రూపమే ఆదిశంకరభగవత్పాదులు. శంకరులు కేవలం అద్వైత తత్వాన్ని బోధించిన తాత్త్వికులు మాత్రమే కాదు; సర్వమత సమన్వయాన్ని ఆచరణలో చూపిన ఆచార్యులు. శైవుడికి ఆయన పరమ శివస్వరూపుడు; వైష్ణవునికి వేదాంతభాష్యకర్తగా నారాయణ స్వరూపుడు; శాక్తేయునికి శ్రీచక్ర ప్రతిష్ఠాపకుడిగా దేవీమయుడు; గాణాపత్యునికి గణనాథ తత్త్వప్రతిపాదకుడు; షణ్ముఖోపాసకునికి జ్ఞానశక్తి రూపమైన సుబ్రహ్మణ్య స్వరూపుడు; సౌరోపాసకునికి "జ్ఞానం ప్రకాశయతి" అని జ్ఞానసూర్యునిగా ప్రకాశించే తేజోమూర్తి.

అద్వైతసిద్ధాంతంలో బ్రహ్మమే సత్యం. అదే బ్రహ్మ భక్తుడి భావానుసారం అనేక రూపాలలో దర్శనమిస్తుంది. భక్తి రసంలో "శాస్తా", "కుమార", "స్వామి", "మాతా", "పితా" అని పిలిచే ఆ జగదీశ్వరుడు తత్త్వదృష్టిలో అభేద స్వరూపుడు. శంకరులు ఈ రహస్యాన్ని **"బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః"** అనే వాక్యసారంగా ప్రతిపాదించారు.

అందువల్ల శంకరభగవత్పాదులు స్వయంగా ఏకత్వ తత్త్వానికి ప్రతీక. ఆయనలో శైవ, వైష్ణవ, శాక్త, గాణాపత్య, సౌర, కౌమార సంప్రదాయాలు విరోధాలు కాదు– సమన్వయ ప్రవాహాలు. షణ్మత స్థాపన భావన ఈ సమగ్రతను సూచిస్తుంది. భిన్న ఆరాధన మార్గాలు, కానీ లక్ష్యం ఒక్కటే – ఆ పరబ్రహ్మ స్వరూప దర్శనం.

భక్తుడి దృష్టిలో ఆచార్యుడు దైవం అవుతాడు. జ్ఞానదృష్టిలో దైవమే ఆచార్యుడిగా అవతరిస్తాడు. అందుకే శంకరులు వైష్ణవునికి విష్ణువుగా, శైవునికి శివునిగా, శాక్తేయునికి దేవీమయుడిగా, గాణాపత్యునికి గణపతిరూపుడిగా, షణ్ముఖారాధకునికి సుబ్రహ్మణ్యునిగా, సౌరోపాసకునికి జ్ఞానసూర్యునిగా అనుభవంలో ప్రత్యక్షమవుతారు.

పేర్లు మారినా పరమార్థం మారదు. రూపాలు భిన్నమైనా తత్వం ఏకం. ఆ ఏకత్వానుభూతినే శంకరులు జీవన మార్గంగా చూపించారు. అందుకే–

"స ఏక ఏవ ప్రభురద్వితీయః"

అయనే సర్వరూపుడు. ఆయనే సర్వనామము. ఆయనే అద్వితీయ పరబ్రహ్మస్వరూపుడు. అలాగే భారతీయులు, భారతం వేరు కాదు. ★

ప్రత్యేక వ్యాసం

సామరస్య జీవన సంవిధానానికి, ఆధ్యాత్మిక చైతన్యానికి , సంప్రదాయ ప్రాభవానికి ప్రతీక హోళీ. పిల్లల నుంచి వృద్ధుల వరకు ఆనందోత్సాహాలను పంచే వేడుక.వ్యక్తుల మధ్య సత్సంబంధాలకు, సుహృద్భావానికి నిదర్శనం. మనలోని దుర్గుణాలను అగ్నికి ఆహుతి చేసి జీవితాన్ని రంగుల మయం చేసుకోవాలని, వ్యక్తిగా కంటే సమష్టిగా జీవనం సాగించాలనే భావన ఇందులో దాగి ఉంది. రంగులు, ఆటలు, వసంతాలు, రాధాకృష్ణుల ఆరాధన, చంద్ర ఆరాధన... ఇలా వసంతాల కేళి

సమరస జీవన హేల... హోళీ

హోళీ పర్వదినం రాక్షసపీడ నివారణకు సంకేతం. 'స్మృతి కౌస్తుభం'లో ఈ పండుగ ప్రస్తావన ఉంది. భాగవతం ఈ పండుగను వసంత వేడుకగా పేర్కొంది. ఈ పర్వదినానికి సంబంధించి అనేక పౌరాణిక గాథలు ప్రచారంలో ఉన్నాయి. హిరణ్య కశిపుడు తన కుమారుడు ప్రహ్లాదుడితో హరినామ స్మరణను మానిపించే ప్రయత్నంలో భాగంగా, ఆతనిని మంటలకు ఆహుతి చేయవలసిందిగా సోదరి హోళికను నియోగిస్తాడు. ఆమె బాలుడిని ఒడిలో కూర్చుండబెట్టుకొని అగ్నిలోకి దూకగా, ప్రహ్లాదుడు విష్ణుమాయతో రక్షణ పొందుతాడు. ఆ రక్కసి ప్రాణాలు కోల్పోతుంది. దానికి సూచనగా హోళీమంటలు వేస్తారు. విజయదశమి నాడు రావణ విగ్రహం మాదిరిగా, ఈ పండుగ ముందు రోజున హోళిక విగ్రహాన్ని దహనం చేస్తారు 'దుంధ'అనే అసుర సంహారానికి ప్రతీకగా సత్యయుగం నుంచి ఈ పండుగను జరుపుకుంటున్నట్లు విష్ణుపురాణం అభివర్ణించింది.

ద్వాపరంలో పాలీయవచ్చిన మాయాపడతి (పూతన)ని బాలకృష్ణుడు హతమార్చాడు. అందుకు గుర్తుగా ఆయనను ఉయ్యాలలో ఉంచి ఆరాధిస్తారు. అదే డోలోత్సవం.అయిదవ నాడు (ఫాల్గుణ బహుళ పంచమి) ఈ పండుగ ముగింపు సూచనగా రంగులతో 'రంగపంచమి' జరుపుకుంటారు.

వైదిక కాలంలో ఈ పండుగకు 'నవాహేష్టి' అని పేరు. దీనిని మదనపూర్ణిమ, కామ దహనమనీ వ్యవహరిస్తారు. త్రిపురాసుర సంహారానికి యోధుడి జననం (కుమారస్వామి) ఈ పండుగ నేపథ్యం. శివపార్వతుల ఉద్దీపనతో కుమార సంభవం అనివార్యంగా భావించి, దేవతల ప్రోత్సాహంతో మన్మథుడు తన పుష్పబాణాలతో మహేశ్వరుడి తపస్సుకు భంగం కలిగిస్తాడు. దాంతో ఆగ్రహించిన ఆయన మదనుడిని తన ఫాలనేత్రంతో భస్మం చేస్తాడు. మన్మథనతి రతీదేవి విలాపంతో 'అనంగుడి'గా సజీవమవుతాడు. కామదహనం పేరిట జనావాసాల కూడళ్లలో పెద్ద మంటలు వేసి, అలా వచ్చిన భస్మాన్ని నుదుట ధరిస్తారు.ఐహిక కోరికలకు అతీతంగా నిష్కామకర్మతో వ్యవహరించాలని ఈ పండుగ సందేశాన్ని ఇస్తోంది.యజ్ఞ స్వరూపమైన అగ్నిలో శారీరక వాంఛలు దగ్ధమైనట్లు ఈ పండుగకు ఆధ్యాత్మిక కోణంలో అర్థం చెబుతారు.

ఫాల్గుణ పౌర్ణమికి గల మరికొన్ని విశిష్టతలు పరిశీలిస్తే... మధుర మీనాక్షీదేవి తపస్సు చేసి సుందరేశ్వర స్వామిని పరిణయమాడింది ఫాల్గుణ పౌర్ణమినాడే. ఆ రోజు దేవీదేవతలకు కల్యాణోత్సవం నిర్వహిస్తారు. లక్ష్మీనారాయణవ్రతం, అశోక పూర్ణిమ వ్రతం, శయనదాన వ్రతం, శశాంక పూజ, రాధాకృష్ణుల కల్యాణం కూడా ఆ తిథినాడు జరుపుకుంటారని చతుర్వర్గ చింతామణి, పురుషార్థ చింతామణిలాంటి గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఫాల్గుణ శుద్ధ అష్టమి నుంచి పౌర్ణమి వరకు 'హోలాష్టకం' అంటారు. అష్టమి నాడు దుర్గార్చనతో మొదలుపెట్టి రోజుకో శక్తిమాతను ఆరాధించే సంప్రదాయాన్ని 'మహాశక్తి తంత్రం' పేర్కొంది.

కొత్తగా పండిన ధాన్యం, ఆవుపాలు, చెరకు రసంతో పాయసం (క్షీరాన్నం) చేసి సూర్యుడికి నివేదించి ఫాల్గుణ ప్రసాదంగా స్వీకరించేవారు.

దుష్ట సంహారం,వసంత రుతువు ఆగమనం నేపథ్యంలో ఆనంద చిహ్నంగా రంగులు చల్లుకుంటూ, మధుర పదార్థాలు పంచుకొని ఆరగిస్తారు. రుతువు మారే క్రమంలో చిన్నపాటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రకృతి సహసిద్ధ రంగులు దోహద పడతాయని నాటి పెద్దలు చెప్పేవారు. అలా వేపగింజలు, కుంకుమ, పసుపు తదితర ప్రకృతి సిద్ధ, ఆయుర్వేద పదార్థాలతో సంప్రదాయ బద్ధంగా రంగులు తయారు చేసేవారు. మొక్కల నుంచి తయారయ్యే సహజ రంగుల వల్ల అనారోగ్య సమస్యలను నివారించినట్లవుతుందని ఆయుర్వేద గ్రంథాలు పేర్కొంటున్నాయి. మామిడి చిగుళ్లు, తేనె, వేపపూత మిశ్రమాన్ని 'మధుప్రాశనం'గా సేవించడం వల్ల ఉదర సంబంధిత వికారాలు తొలగిపోతాయని 'చరక సంహిత' వివరించింది చెట్ల ఆకులు, పూలు, పండ్లు, బెరడు ఇతరత్రా ప్రకృతి సిద్ధంగా తయారయ్యే రంగులు ఔషధాలుగా పని చేస్తాయి. దీనినే 'రంగుల చికిత్స' అంటారు.

కాలక్రమంలో రసాయనాలతో కూడిన రంగులు వాడకంలోకి వచ్చాయి. వీటిని చల్లుకోవడంలో ఆనందం, వినోదం మాట అటుంచి ఆరోగ్యపరంగా నష్టం వాటిల్లుతోందని, వాతావరణం కలుషితమవుతోందని నిపుణులు అంటున్నారు. రసాయనాల కారణంగా అలెర్జీ, చర్మవ్యాధులు, అంధత్వం, మూత్రపిండాల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. సంప్రదాయకంగా వస్తున్న పండుగలను జరుపుకోవలసిందే. అదే సమయంలో పూర్వికులు ప్రతిపాదించిన నియమాలను పాటించడం ద్వారా ఆరోగ్యాలను, పర్యావరణాన్ని కాపాడినవారమవుతాం.

డా॥ ఆరవెల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

బాధ్యతాయు

'ఇచ్చి పుచ్చుకోండి'– ఇదీ ఈ సంవత్సర ప్రచార అంశం.

ఏటా మార్చి 8న ప్రపంచ వ్యాప్తంగా మహిళా దినోత్సవం. ప్రతీ సంవత్సరమూ ఒక్కో అంశానికి ప్రధాన స్థానం. మరి ఇప్పటి థీమ్ ఏం చెప్తోంది?, ఏం ఇవ్వాలి, ఏది అందుకోవాలి.... మన దేశ నేపథ్యంలో చెప్పాలంటే స్త్రీలకు మర్యాద ఇచ్చి పుచ్చుకోండి. ఇక్కడే కాదు, ఎక్కడైనా ఎప్పుడైనా ఎవరికైనా వర్తించిత తీరాల్సిన కీలక సూత్రం ఇది.

నిరుటి అంశం : వనితాభ్యుదయ సాధనకు వేగం పెంచు. ఇందులో భాగమా అన్నట్లు– ఇప్పుడు ఇక మర్యాద గురించిన ప్రస్తావన. ఆ మాటకొస్తే... ప్రతీ ఒక్కరికీ గౌరవం ఇచ్చినపుడే, తిరిగి అందుతుంది. మహిళలు అనేసరికి మర్యాదా మన్ననా అనేది ముఖ్యపాత్ర వహిస్తుంది సర్వసహజంగా.

మహిళా దినోత్సవ ప్రకటన ఇప్పటిది కాదు. అంతర్జాతీయంగా నూట పదకొండు ఏళ్లనాటిది. అమెరికా, జర్మనీ, ఆస్ట్రియా, డెన్మార్క్, స్విస్; అటు తర్వాత రష్యా, చైనా, స్పెయిన్, మరెన్నో దేశాలు ఇందులో భాగమయ్యాయి.

ఒక దేశానికో, సిద్ధాంతానికో, భావజాలానికో పరిమితమైపోకుండా స్థూల అర్థంలో పరిశీలిస్తే – ఇంటా బయటా పడుతుంది మరింత బాధ్యతాయుతపాత్ర. బాధ్యతగా ఉంటారు కాబట్టే వారికి గౌరవం ఇవ్వండి, వారి నుంచి గౌరవాన్ని పొందండి అంటోంది అంతర్జాతీయ సమాజం.

బాధ్యత ఉన్నచోటనే హక్కులూ ఉంటాయి. ఇవి కలివిడిగా ఉండేవే కానీ విడదీయటానికి వీలు పడనవి. ఇన్ని దశాబ్దాల తర్వాత కూడా ఇంకా 'మర్యాద ఇవ్వండి' దగ్గరే ఆగిపోయామా? ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సింది ఎవరికి వారే! ప్రత్యేకించి భారత్‌లో నేటి సందర్భాన్ని అనుసరించి అంతా కోరుతోంది 'బాధ్యతాయుత సాధికారత'నే.

ఒకే ఒక అక్షరం 'స్త్రీ'. తెలుగులో పర్యాయ పదాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. అవన్నీ చాలా మటుకు విశేషణాలు.

అతివ, ఇంతి, కాంత, చెలి, తరుణి, నారి, నాతి, మగువ, ముద్రిత, వెలది, ఇంకా ఎన్నెన్నో పేర్లు.

ఆడది, అబల వంటి పదాలు ఏ సమాజమూ అంగీకరించనవి. గృహిణిని ఆంగ్లంలో హోమ్‌మేకర్ అంటున్నాం. ఆమె బాధ్యతనీ అధికారాన్నీ ప్రతిఫలించే మాట.

ఇంత ప్రాముఖ్యత ఉన్నప్పటికీ; మర్యాదను ఇచ్చిపుచ్చుకోండి, మహిళను గౌరవంగా చూసి ఆమె నుంచి గౌరవాన్ని పొందండి అనాల్సిన పరిస్థితి నేటికీ ఉందంటే... పూర్వాపరాల ఆలోచన చేయాల్సిందే.

అది 1910. విశ్వవ్యాప్త మహిళా సదస్సు ఏర్పాటైంది. తదుపరి వత్సరంలో కొన్ని దేశాల్లో మార్చి నెలలోనే వనితా దినోత్సవాలయ్యాయి. వారి శ్రమశక్తికి గమనింపు, గుర్తింపు, గౌరవం, ఆదరం లభించాలన్న నినాదాలు మారుమోగాయి.

శాంతి, హక్కులు అనే రెండూ అనంతర కాలంలో ప్రాచుర్యం అందుకున్నాయి. ఐక్యరాజ్య సమితికి చెందిన సర్వప్రతినిధి సభ పిలుపునివ్వడంతో ప్రపంచ మహిళా దినోత్సవ నిర్వహణ మార్చి 8గా ఖాయమైంది.

ఆ పిలుపు వెలువడి దరిదాపు అర్ధశతాబ్ది!

భారతదేశానికి సంబంధించి–

కెప్టెన్ లక్ష్మీ సెహగల్‌ను గుర్తు చేసుకోవాలి అందరూ.

నేతాజీ స్థాపిత ఆజాద్ హింద్ ఫౌజ్ మహిళా దళ ప్రముఖురాలు.

నాయకురాలిగా కెప్టెన్. వృత్తిపరంగా వైద్యసేవ.

ఝాన్సీ రెజిమెంట్‌కు కీలక ప్రాతినిధ్యం వహించిన నారీమణి.

నేతాజీ కుడిభుజమై
స్వాతంత్ర్య క్షేత్రానికి – జాతిని నడిపిన
దివ్య జ్యోతి, వీరఝాన్సీ స్ఫూర్తి!

అప్పట్లో స్త్రీ లోకాన్ని ఏకీకృతం చేసిన నేతల్లో ఒకరు ఆమె.

శ్రమకు ఫలితం ఉండాలన్న నినాదంతో సంఘటితపరిచారు.

ఏటేటా నేపథ్య అంశాలను ఐరాస ప్రకటిస్తూ వస్తోంది. అవి ఇవీ :

1996 గత అవగాహన, భావి కార్యాచరణ
1997 శాంతి సామరస్య సాధన
1998 హక్కుల గుర్తింపు, పాటింపు.
1999 స్త్రీలపై హింస నివారణ
2000 వనితా ప్రపంచ సమన్వయం

తదుపరి ఈ పాతికేళ్లలో... నారీ లోకానికి అవకాశాల కల్పన, సమత్వ భావన, నిర్ణయశక్తిని వేగవంతం చేయడం, బాలికల సంరక్షణ, సమాన అవకాశాల లభ్యత, సాంకేతికతలో మరింత ముందడుగు, గ్రామీణ వనితలపై చూపు సారింపు, అందరినీ శక్తిమంతంగా రూపుదిద్దడం, సృజనాత్మకతకు చోటు, నవీన ఆవిష్కరణలు, ఇంకెన్నో థీమ్‌ల పరంపర.

2011కు విశేష ప్రాధాన్యం ఉంది. ఆ ఏడాదిన వనితా దినోత్సవం వంద దేశాల్లో జరిగింది. 'వంద'

త సాధికారత!

ఎందుకంటే, సరిగ్గా అంత చారిత్రక నేపథ్యక్రమం ఉండటమే. అంటే అది శతవసంతోత్సవ ఘట్టం!

'దినోత్సవం కాదు, మాసోత్సవం' అంది ఒక దేశం, మరో దేశం ప్రత్యేక నాణేన్ని విడుదల చేసింది. వేడుకల్లో భాగంగా, వేలాది మైళ్ల ప్రయాణం అంటూ నాన్‌స్టాప్ విమానాన్ని నడిపింది వేరొక దేశం. ఆ వేరొక ఆ మరేదో కాదు–సాక్షాత్తు మన దేశమే!

దేశవ్యాప్తంగా పలుచోట్ల సమస్యల పరిష్కార కేంద్రాలను స్థాపించింది భారత ప్రభుత్వ నిర్వహణలోని మహిళాభివృద్ధి మంత్రిత్వశాఖ.

వనితల సాధికారతకు పనిచేసే శాఖ ఇదే. దీనికి రెండు దశాబ్దాల ప్రత్యేక చరిత్ర. విద్య, ఆరోగ్యం, పోషణ, పరిరక్షణ, ఆర్థిక స్వావలంబన, ఇతరత్రా కూడా కార్యక్రమాలు చేపడుతోంది.

లక్ష్మీ సెహగల్

వ్యవసాయం, కళారంగం, పరిశ్రమలు, వాణిజ్య వ్యవహారాలు, ఉపాధి శిక్షణ, ఆర్థిక అంశాలు, వైద్యసేవలు, కుటుంబ సంక్షేమం, నిర్వహణ వంటి అనేకానేక రంగాల్లో స్త్రీల స్థితిగతులను పరిశీలిస్తుంటుందీ మంత్రిత్వ విభాగం. కమిటీలు, కమిషన్లు, చట్టబద్ధంగా గల ఇతర సంస్థలు, స్వయంప్రతిపత్తి వర్తించేవి, సంబంధిత సొసైటీలన్నీ దీనిలోనివే. పథకాల రూపకల్పన, సమగ్ర ఆచరణ, విశ్లేషణ, సమన్వయ విధులు నిర్వర్తిస్తుంటుందీ శాఖ.

జాతీయ మహిళా కమిషన్, హక్కుల పరిరక్షణ సంస్థ, సామాజిక సంక్షేమ పరికల్పన, సాధికారతా మిషన్... ఇలా అనేకం ఉన్నాయి. పనులు నిర్వర్తిస్తూన్నాయి.

సాధికారతకు అర్థం – నిర్ణయశక్తి. అన్నింటా తగినంత ప్రాతినిధ్యం ఉండటం, సమాజ వికాసంలో భాగస్వామ్యం కావడం. రాజకీయ సాధికారత కాగితాలకే పరిమితం కాకూడదు. సాంస్కృతికంగా అది వైరుధ్యాలకు దారితీయకూడదు. ఇప్పటి సమాజంలో 'వనితా సాధికారత ఎందుకు?' అని ప్రశ్నించే వాళ్లున్నారు. 'మరీ ఇంత సాధికారతా' అంటూ దీర్ఘాలు తీసేవారూ ఉన్నారు. 'ఆడపెత్తనం' అని ఈసడించే వ్యక్తులూ కనిపిస్తున్నారు. అణగి మణిగి ఉండాలని శాసించే ప్రబుద్ధులూ ఉన్నారు నేటి వ్యవస్థలో. నియంత్రణ ఎప్పుడని అడిగేవారూ సరేసరి!

ఎందరు ఎన్ని విధాలుగా భావిస్తున్నా, కొన్ని ప్రశ్నలకు మాత్రం ఇప్పటికీ సమాధానాలు లేవు. రావు,

1. స్త్రీని చిన్న చూపు చూడటమనేది కొందరి సహజ లక్షణమా, కాదా?

2. నిందలు, దూషణలు స్త్రీ ఆధారంగా జరుగుతున్నాయా, లేదా?

3. నేరాలూ, ఘోరాలూ స్త్రీల మీద నానాటికీ పెరగడం లేదా?

4. కించపరిచే ధోరణికి కొందరు అలవాటు పడటమనేది నిజమా, కాదా?

నాదాలూ నినాదాలకు కొదవలేదు ఇక్కడైనా, ఎక్కడైనా! మహిళా దినోత్సవం అనేగానే ప్రపంచ మంతా తక్షణ స్పందనతో నిండుతుంది. సందేశాలూ, ఉపదేశాలూ టన్నులకొద్దీ పుట్టుకొస్తాయి. దేశంలోనూ ఊరూ వాడా సభలూ సమావేశాలతో హోరెత్తుతాయి. ఇవన్నీ ఈ అన్నీ ఎప్పుడంటే, ఒక్క రోజువరకే! దినోత్సవం అనేది నిత్యోత్సవం కానంతవరకూ పరిస్థితి ఇలాగే ఉంటుంది.

రాజ్యాంగ అధికరణలు ఎన్నెన్నో చెప్తున్నాయి. వనితలకు ప్రత్యేక సదుపాయాలు ఉండాలని, ఉపాధి అవకాశాలు విస్తృతం కావాలని, సామాజిక భద్రత విస్తరించాలని, జీవనభద్రత చట్టనిబంధనలకు సరిసమానమవ్వాలనీ... వివరిస్తూన్నాయి. జాతీయ స్థాయిన మహిళా విధానమంటూ ఉంది. మిలీనియం అభివృద్ధి లక్ష్యాల్లో వనితలకు సంబంధించినవి అనేకానేకం. ఎన్నో కమిటీలు ఎన్నెన్నో సూచనలిచ్చాయి, ఇస్తున్నాయి. అయినా, వనితల భద్రత, సాధికారతలు ఇవాళ్టికీ ప్రశ్నార్థకాలుగా మిగిలిపోతున్నాయి. తెలియనిదెవరికి?

పడతి మీద హత్యాచారం జరిగితే... పత్రికలూ ప్రసార సాధనాలూ ఘోషిస్తాయి. నిరసనలు వెల్లువెత్తుతాయి. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు సైతం దిగ్భ్రాంతి వ్యక్తపరుస్తుంటారు. పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామంటారు. న్యాయస్థానాల తీర్పులు కొన్ని తమవంతు పాత్రను పోషిస్తుంటాయి.

నేరగాళ్లు బహిరంగంగా తిరుగుతుంటారు. పోలీసులకు మాత్రం కనిపించరు! ఆ నేరగాళ్లే ప్రచార ప్రసార రంగాల్లో ప్రత్యక్షమై విజయ చిహ్నం. చూపుతుంటారు. ఏం జరిగిందో అంతు పట్టక, ఏది జరగనుందో ఊహకైనా తట్టక సామాన్యులు ఉక్కిరిబిక్కిరవుతుంటారు. వీటన్నింటి నట్టనడుమ మిణుకుమిణుకుమంటూ ఉంటుంది వనితా భద్రత!

స్థానికం, ప్రాంతీయం, జాతీయం, అంతర్జాతీయం... ఏ స్థాయిలోనైనా, ఏ దశలో అయినా స్త్రీని గౌరవించడమనేది ప్రచారాలతో రాదు. ఏడాదిలో ఒక రోజున ఉత్సవం అంటూ ఉత్సాహం ప్రదర్శిస్తే, స్త్రీలకు ఒనగూడేది ఏదీ ఉండదు. అలా అని స్త్రీలు సాధికారతకు సంబంధించి సొంత నిర్వచనాలు వల్లించడం అన్ని సందర్భాల్లోనూ శోభించదు.

'లలనా! నీవు లేని జగతిలో దీపాలు వెలుగునా' అంటాడో కవి. 'నీ శ్రమ అంచనాలకు అందునా' అనీ వర్ణిస్తాడు. ఈ వాక్యాల వెనక ఉన్న అంతర్లీనతను సవ్యంగా అర్థం చేసుకున్న వ్యక్తులు ఉన్నపుడే– మహిళా సాధికారత ప్రత్యక్షమవుతుంది. అది కొరవడితే వనితా దినోత్సవ నిర్వహణ వార్షిక తంతుగానే మిగిలిపోతుంది.

కావాల్సింది, కోరాల్సిందీ, కలకాలం నిలబెట్టుకోవాల్సిందీ వనితల బాధ్యతాయుత సాధికారతనే! అది అందరి చేతుల్లో, చేతల్లో ఉంది, ఉంటుంది.

జంధ్యాల శరత్‌బాబు

సీనియర్ జర్నలిస్ట్

అలనాటి నౌ

'యుక్తి కల్పతరు'-భారతీయ చరిత్ర కారులకు స్మరణీయ గ్రంథం. ధారానగర పాలకుడు భోజుడు (11వ శతాబ్దం) సంస్కృతంలో రాశాడు. ఇదొక విజ్ఞాన సర్వస్వం. ప్రాచీన భారతదేశంలో ఓడల నిర్మాణం, రకాలు, సముద్రయానాల గురించి ప్రామాణిక సమాచారం ఇస్తుంది. The work deals with diverse subjects of secular interest such as a few topics, relating to polity, construction of buildings and selection of sites therefor articles of furniture, precious stones, ornaments, weapons, drought and other animals vehicles, ships, ship buildings etc. The last two subjects are very rarely met with and contribute not a little to the value of the book" (Yukti Kalpataru, forword)

'యుక్తి కల్పతరు' సమాచారం ఎంత ప్రామాణికమో చెప్పే గ్రంథాలు తరువాత చాలా వచ్చాయి. సంజీవ సన్యాల్ భారత ప్రధాని ఆర్థిక సలహాదారు, ఆర్థిక చరిత్రకారుడు. ఆయన, ప్రాచీనకాలంలోనే భారతీయ వర్తకులు సముద్రాలను దాటి గ్రీస్, రోమ్, చైనా, అరేబియాలతో పాటు మధ్య దక్షిణ, తూర్పు, ఆసియా ప్రాంతాలకు వెళ్లి వాణిజ్య వ్యవహారాలు సాగించేవారు. సొంత సైన్యాన్ని సమకూర్చుకునేవారు. ఐరోపా దేశాలు భారత్‌ను పరిపాలించడానికి ముందే భారతీయ వ్యాపారులు అంతర్జాతీయ వాణిజ్యం నిర్వహించేవారు. ఉత్తర, దక్షిణ భారతంలో అద్భుతమైన నౌకా నిర్మాణ కేంద్రాలు ఉండేవి. వారు ఎక్కడా మేకులు ఉపయోగించకుండా తాళ్లతోనే చెక్కలు కట్టి దృఢమైన ఓడలు నిర్మించేవారు అని వెల్లడించారు. అంటే ఇనుము వాడిన మాగ్నెట్‌ల వల్ల ప్రమాదమని నాడే గుర్తించారన్న మాటను గుర్తు చేశారు. జలమార్గాలు అతి ప్రాచీనమైన రవాణా సాధనాలు. మన పూర్వులు సరుకు రవాణాకు నదులు, కాలువలు వంటి మార్గాలను సముద్రానికి అనుసంధానం చేశారు. జలమార్గాలు ఆర్థికవ్యవస్థ ఆయువుపట్టు.

ప్రాచీన భారతదేశంలో వ్యవసాయం ప్రధాన వృత్తి. చేతివృత్తులు ఉపవృత్తులు. కావలసిన ముడి సరుకు ఎక్కడ తక్కువ ధరకు లభిస్తే అక్కడ కొనేవారు. తక్కువ ధర ఉంటే విదేశీ మార్కెట్లనే ఆశ్రయించారు. రోమన్ సామ్రాజ్యం, ఆగ్నేయాసియా దేశాలతో వ్యాపారం చేశారు. నిజానికి క్రీ॥పూ॥ 3000 సంవత్సరాల నాడే (లోథాల్, సింధు నాగరికత) విదేశీ వాణిజ్యం జరిగింది. వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు, లోహాలు వివిధ రకాల రాళ్లు ఎగుమతి అయ్యేవి.

'యుక్తి కల్పతరు' భారతీయ సముద్రయానం గురించి వివరించింది. పులోమావి గురించి వివరిస్తూ, అక్కడ యుద్ధ నౌకల ముద్రలు ఉన్న నాణేలు దొరికిన సంగతి చెప్పారు. ఇవి ఒక నౌకాదళ విజయానికి గుర్తుగా జారీ చేసిన నాణేలు (పేజీ 650). మౌర్యుల నౌకాదళం అశోకుని వరకు కొన సాగింది. రెండవ పులకేశి మనుమడు విజయాదిత్యుడికి పెద్ద నౌకాదళం ఉండేదని, తద్వారా ఉత్తర భారతదేశపు రాజులను సయితం ఓడించగలిగాడని ఐహోల్ శాసనం వివరించింది. మహేంద్రుడు (అశోకుని కుమారుడు) బౌద్ధమత వ్యాప్తికి సిలోన్ (శ్రీలంక) వెళ్లాడు. క్రీ॥శ॥ 48వ సంవత్సరంలో అయోధ్య యువరాణి సూరిరత్న ఒక పడవలో ప్రయాణించి కొరియాలోని కరక్ రాజ్యానికి చేరుకుంది. కరక్ రాజు కిమ్‌సురో ఆమెను వివాహం చేసుకున్నాడు. ఆమె భారతీయ సంస్కృతి, బౌద్ధం, తేయాకు విత్తనాలు, సుగంధ ద్రవ్యాలను కొరియాకు పరిచయం చేసింది. భారతదేశానికి 7516.6 కి॥మీటర్లు తీర రేఖ (దీవులతో కలిపి) ఉంది. కాబట్టి వారికి సముద్రయానం, సముద్ర వ్యాపారం పెద్ద విషయం కాదు.

మధ్యయుగ చోళ సామ్రాజ్య (900–1100) నౌకాదళం హిందూ మహా సముద్రంపై ఆధిపత్యం చేసింది. ఆగ్నేయ ఆసియాలోని శ్రీ విజయ సామ్రాజ్యానికి (ఆధునికి ఇండోనేషియా, మలేషియా) వ్యతిరేకంగా వాణిజ్య విస్తరణ, సైనిక విజయాలకు వీలు కల్పించింది. రాజేంద్రచోళుని నౌకావిజయాన్ని గురించి. "Transforming the Bay of Bengal into a 'Chola Lake" అని చరిత్రకారులు రాశారు.

'యుక్తి కల్పతరు' తామ్రలిప్తి, కావేరి, భరుఖచ్ఛ, సుర్పరక మొదలైన నౌకాశ్రయాల గురించి పేర్కొన్నది. అనేకమంది హిందూ సముద్ర వ్యాపారులు ఆఫ్రికా తీరదేశాలలో స్థిరపడ్డారని 'పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ' గ్రంథం చెబుతున్నది. సముద్రయానం ప్రమాదకరం. తుపానులతో ఎందరో వ్యాపారులు, నావికులు మరణించారు. అయినా సముద్రయానంపై మోజు, ఆ వాణిజ్యంతో వచ్చే లాభాలు వాటిని లెక్క చేయనివ్వలేదు. మెగస్తనీసు (ఇండికా) చంద్రగుప్త మౌర్యుని సైన్యం గురించి రాస్తూ, తన సైన్యాన్ని 6 సమితులుగా విభజించాడని దానిలో మొదటిది 'నావికాదళం' అని చెప్పాడు. ఈ దళ నిర్వహణను ఐదుగురు సభ్యుల మండలి నిర్వహించేది. కౌటిల్యుని అర్థశాస్త్రంలో 'నవాధ్యక్షుడు' అంటే నౌకల నిర్వహణాధికారే. పాన్యపట్టణ చరిత్ర (వాణిజ్యరేవుల చరిత్ర)లో సుల్క (వాణిజ్య ఓడలపై విధించే పన్ను) హింస్రిక (ఓడ దొంగలు) (పైరేట్స్) (పేజీ 649) అన్న మాటలు ఉన్నాయి. కాసకుడి శాసనాల ప్రకారం పల్లవరాజు నరసింహవర్మ శ్రీలంక లేక సిలోన్‌ను జయించాడు. పెద్ద నావికాదళం లేకుండా ఈ విజయం సాధ్యపడదు. సముద్ర గుప్తుని సార్వభౌమత్వాన్ని అనేకమంది రాజులు అంగీకరించారని హరిసేనుడి అలహాబాద్ శాసనం చెబుతున్నది. వారిలో సింహళ, వివిధ దీవుల రాజులు ఉన్నారు. హర్షవర్ధనుడు గొప్ప నావికాబలాన్ని కలిగి ఉన్నట్లుగా శాసనాలు తెలియజేస్తున్నాయి. కామరూప రాజు భాస్కరవర్మ 30 వేల ఓడలతో వచ్చి కనోజ్ రాజు హర్షవర్ధనుని చేరగా ఇరుసైన్యాలు గౌడ శశాంకునితో యుద్ధం చేసి ఓడించాయని చైనా యాత్రీకుడు యువాన్‌చ్వాంగ్ రాశాడు.

మలబార్ తీరం (కేరళ)లో 'ముజిరిస్' ప్రసిద్ధ ఓడరేవు. దీనిని సుగంధ ద్రవ్యాల మార్గంగా పిలుస్తారు. ముఖ్యంగా మిరియాలు రవాణా అయ్యేవి. ఇంకా దంతాలు, గంధపుచెక్క, గుర్రాలు, ముత్యాలు, మద్యం, బంగారం ఎగుమతి అయ్యేవి. చేర రాజవంశం కాలంలో ఇది విశ్వనగర కేంద్రం. ఓడ దొంగలు కూడా ఎక్కువే. ఇస్లామ్, క్రైస్తవ మతాల రాకతో ఈ రేవు మూతపడింది. తుత్తుకుడి (ట్యూటికోరిన్) ఇది తమిళనాడులోని ప్రధాన ఓడరేవు. ఇక్కడ సముద్రంలో ముత్యాలవేట ఎక్కువగా జరుగుతుంది. కాబట్టి ముత్యాల నగరమని పేరు. గుజరాత్ తరువాత అత్యధికంగా ఉప్పును తయారు చేసే కేంద్రం కూడా. కొల్లాం (పూర్వపు పేరు క్విలన్)ను

ొకాయానం

చరిత్రలో దేశింగనాడు అని పిలిచారు. ఇది తిరువనంతపురానికి 71 కిలో మీటర్ల దూరంలో ఉంది. జీడిపప్పు తయారీ, కొబ్బరికాయల ఉత్పత్తికి ప్రసిద్ధి కొల్లాం. కాలువ ద్వారా జలమార్గాలకు అనుసంధించి ఉండేది. రోమన్లు, చైనా వారు, అరబ్బులు, ఇతర పాశ్చాత్యదేశాల వారు ఈ కేంద్రం నుండే తమ వ్యాపారాన్ని కొనసాగించేవారు.

తమిళనాడులోని మైలదుత్తురై జిల్లాలోని పూంపుహార్ (కావూరి పూం) పురాతన ఓడరేవు. ఇది క్రీ॥పూ॥ 3వ శతాబ్దం నుండి కీ.శ. 4వ శతాబ్దం వరకు చోళ రాజుల మొదటి రాజధానిగా ఉంది. ప్రసిద్ధ తమిళ ఇతిహాసాలు శిలప్పదికారం, మణిమేఖలై ఈ నగరం గురించి వర్ణించాయి.

తామ్రలిప్తి (తమ్లుక్) పశ్చిమ బెంగాల్‌లోని ప్రసిద్ధ ఓడరేవు. ఇక్కడ నుండి రాగి ఎగుమతి అయ్యేది బౌద్ధమత వ్యాప్తికి దోహదపడ్డ మహానగరం. దీని గొప్పతనం గురించి, జరిగిన వ్యాపారం గురించి రోమన్ యాత్రీకుడు ప్లినీ, చైనా యాత్రీకులు పాహియాన్, యువాన్‌త్సాంగ్‌లు తమ గ్రంథాలలో వివరించారు. ఇక్కడ నుంచి రాగి, నల్లమిరియాలు, పట్టుబట్టలు ఎగుమతి చేసేవారు. బంగారం దిగుమతి చేసుకునేవారు. పారదీప్ ఒడిస్సాలోని ప్రధాన ఓడరేవు. ఇక్కడి నుండి ఎరువుల సరఫరా జరుగుతుండేది. ఇవికాక కలకత్తా, బొంబాయ్, మద్రాసు ఓడరేవులు గొప్ప వాణిజ్య కేంద్రాలుగా విలసిల్లుతున్నాయి. పుదుచ్చేరి, కరైకల్, మహే, యానాం వంటి ఇతర ఓడరేవులు కూడా ఉన్నాయి. రోమన్ సామ్రాజ్యం నుండి దీనికి వ్యాపార సంబంధాలున్నాయి. తరువాత ఇది ఫ్రెంచ్ వారి ఆధీనంలోనికి వచ్చింది. భారతీయుల అతి ప్రాచీన ఓడరేవు 'అరికమేడు'. వీరు రోమ్‌తో వ్యాపారం చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. తెలుగువారి నౌకాశ్రయాలకు వస్తే మసులా (మచిలీపట్నం) ఘంటసాల, పితుండా (పిఠాపురం త్రవ్వకాలలో) కొత్తపట్నం-క్రీకు (కయ్యా) (ఒంగోలు సమీపం) తాళ్లరేవు కోరంగి, కాకినాడ, కళింగపట్నం, దంతపురం (శ్రీకాకుళం) కృష్ణపట్నం, భీమునిపట్నం, విశాఖపట్నం మొదలైనవి.

నాటి మసులాను ఆనుకుని ఉన్న ఘంటసాల దగ్గర ప్రవహించే ఉప్పుటేరు సముద్రానికి కలిసేది. అప్పట్లో ఈ ప్రాంతంలో ప్రత్తి, వరి విస్తారంగా పండేవి. ఇక్కడ నుండి రోమన్ సామ్రాజ్యానికి వస్త్రాలు, ధాన్యం ఎగుమతి అయ్యేవి. కాలక్రమేణా ఇవి ప్రాభవం కోల్పోయాయి. పిఠాపురంలో జరిపిన త్రవ్వకాల్లో 'పితుండ' అనే రేవు పట్టణం బయట పడింది. ఇక్కడ నుండి చంపా (నేటి కంపూచియా) దేశంతో వర్తకం కొనసాగించినట్లు తెలుస్తున్నది. మోటుపల్లి (బాపట్ల సమీపంలో) రేవు నుండి కాకతీయ గణపతి దేవునికాలంలో సముద్ర వ్యాపారం జరిగినట్లు శాసనాధారం ద్వారా తెలుస్తున్నది. కొత్తపట్నం (ఒంగోలు సమీపం) లో కృత్రిమ ఓడరేవును అభివృద్ధి చేశారు. కోరంగి, తాళ్లరేవులకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఇంగ్లండ్, ఫ్రాన్స్, నెదర్లాండ్, పోర్చుగల్ దేశాలతో వాణిజ్య సంబంధాలు ఉండేవి. 1839లో వచ్చిన తుపానులో ఈ పోర్టులు కొట్టుకుపోయాయి. కళింగపట్నం ఓడరేవు తూర్పుగాంగుల రాజధాని. నాగర్లపేట త్రవ్వకాలలో బయల్పడ్డ 'దంతపురం' (శ్రీకాకుళం రైల్వే స్టేషన్ దగ్గర) నుండి తామ్రలిప్తి, మాయన్మార్, శ్రీలంక మలేషియా దేశాలతో వర్తకం జరిగిన దాఖలాలున్నాయి.

ఆంగ్లేయులు రాకపూర్వం ప్రపంచ జీడీపీలో భారత్ వాటా 27 శాతమని అంగస్ మాడిసన్ అనే బ్రిటిష్ ఆర్థికవేత్త పేర్కొన్నాడు. అంతటి వాణిజ్యపు జాడలు నేటికి కొన్ని కన్పిస్తున్నాయి. ఉదా. బెంగాల్ మస్లిన్ వస్త్రాలు. పారిశ్రామిక విప్లవం పుంజుకుంటున్న రోజుల్లో తమ మిల్లు వస్త్రాలకు పోటీకి రాకుండా నైపుణ్యం కలిగిన నేతన్నల బొటనవేళ్లు కత్తిరించారు.

తూర్పు ఇండియా వర్తక సంఘానికి నౌకాయానంలో పోటీ పడినవారు మన వద్దా ఉన్నారు. వారిలో 1 అర్దేషిర్ కర్సెట్జీ 2. వి.ఓ.చిదంబరం పిళ్లై 3. వాల్‌చంద్- హీరాచంద్, 4. జోతీంద్రనాథ్ టాగూర్ 5. సింధియా చరిత్ర ప్రసిద్ధులు.

అర్దేషీర్ కర్సెట్జీ (1808-1877) ఒక ప్రముఖ భారతీయ ఓడల నిర్మాణ నిపుణుడు. లండన్ రాయల్ సొసైటీకి ఎంపికైన మొదటి భారతీయుడు. ఆవిరి యంత్రాలపై ఆయనకు గల ఆసక్తితో 1833లో ఇండస్ అనే 60 టన్నుల ఓడను నిర్మించాడు. బోంబే డాక్‌యార్డ్‌లో 17 సంవత్సరాలపాటు ఇంజనీర్‌గా పనిచేశాడు. నవంబర్ 16,1877లో మరణించాడు.

తమిళనాడుకు చెందిన చిదంబరం పిళ్లై ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. బాల గంగాధర్ తిలక్ అనుయాయుడు. బ్రిటిష్ గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా 'స్వదేశీ నావిగేషన్ కంపెనీ' (ఎస్.ఎస్.ఎన్.సి) స్థాపించారు. తుత్తుకూడి- కొలంబోల మధ్య భారతీయుల సొంత నౌకను నడిపించాడు. బ్రిటిష్ వారితో పోటీపడి స్వదేశీని ప్రోత్సహిస్తున్న కారణంగా 40 ఏళ్ల ద్వీపాంతర వాస శిక్షపడింది. జైలులో ఎద్దుకు బదులు ఆయననే కట్టి గానుగ లాగించారు. ప్రస్తుతం తూత్తుకూడి ఓడరేవుకు ఆయన పేరు పెట్టారు. వాల్‌చంద్ హీరాచంద్ స్వతంత్ర్య పోరాటానికి మద్దతుగా ఫ్రీ ప్రెస్ ఆఫ్ ఇండియా వార్తా సంస్థను ప్రారంభించాడు. అలాగే వ్యాపారంలో హిందూస్థాన్ ఎయిర్‌క్రాఫ్ట్ లిమిటెడ్, సింధియా స్టీమ్ నావిగేషన్ కంపెనీని స్థాపించి 'ఎస్.ఎస్. లాయల్టీ' అనే ఓడను నిర్మించాడు. భారతదేశ పారిశ్రామిక వేత్తల పితామహునిగా పిలుస్తారు.

జ్యోతీంద్రనాథ్ టాగోర్ (రవీంద్రనాథ్ టాగోర్ అన్న) 1884లో ఇన్ లాండ్ రివర్ స్టీమ్ నావిగేషన్ సర్వీసెస్‌ను ప్రారంభించారు. ఇది కలకత్తా - ఖుల్నా బారిసల్ ప్రాంతాల మధ్య ఓడలను నడిపింది. కానీ బ్రిటిష్ వారితో తీవ్రమైన పోటీని ఎదుర్కొని చివరికి ఆర్థికంగా నష్టపోయింది.

సింధియా స్టీమ్ నావిగేషన్ కంపెనీని 1919లో నరోత్తమ్ మోరారీ, వాల్ చంద్ హీరా చంద్‌లు కలిపి స్థాపించారు. వీరు విశాఖపట్నంలో షిప్ యార్డ్‌ను నిర్మించి ఎమ్.వి. జలఉషను నిర్మించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ, దేశీయ నౌకా పరిశ్రమ అభివృద్ధిలోనూ ముఖ్య పాత్రను పోషించాడు. ఇది ఇప్పటికి నడుస్తున్న భారతీయ షిప్పింగ్ కంపెనీ, 1941లో వైజాగ్ పోర్టు నిర్మాణంలో ప్రముఖపాత్రను పోషించారు. డా॥ బాబూ రాజేంద్రప్రసాద్ దీనిని ప్రారంభించారు.

భారతదేశ ఆర్థిక రంగంలో సాధిస్తున్న ప్రగతి వెనుక శతాబ్దాల అనుభవైక చరిత్ర ఉందన్న నిజాన్ని నేటితరం తెలుసుకోవాలి. దేశానికి వాణిజ్యరంగంలోనూ ఘన చరిత్ర ఉన్నదన్న వాస్తవాన్ని పాఠశాలల్లోనూ, కళాశాలల్లోను, విశ్వవిద్యాలయాల్లోనూ బోధించాలి.

డా. కొశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

కుటుంబ ప్రబోధన్ 2008లో ప్రారంభమై, క్రమంగా వికసించింది. గత సంవత్సరం ఓంకారేశ్వర్‌లో జరిగిన బైఠక్‌లో పరమ పూజనీయ సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్ సమక్షంలో కుటుంబ ప్రబోధన్ ధ్యేయం వెల్లడైంది. మంగళ సంవాద్ మాధ్యమంగా ప్రతి కుటుంబంలో వ్యక్తిగత, పారివారిక,సామాజిక జీవనంలో లోకహితం కోసం కావలసిన పరివర్తనను సాధించాలి. ఇది రోజు మనం స్మరించుకోవాలి.

కుటుంబ ప్రబోధన్ అఖిలభారత సంయోజక్ డాక్టర్ రవీంద్రశంకర జోషి ప్రసంగ వ్యాసం.

అదృష్టం కొద్దీ మనం కుటుంబ ప్రబోధన్ పనిలో ఉన్నాం. కుటుంబ మిత్రులను మనం తయారు చేసుకోవాలి. సంఘ శతాబ్ది సంవత్సరంలో మనకు సంఘంలోని 50 లక్షలమంది కార్యకర్తలు మినహా మిగిలిన వారిని కుటుంబ మిత్రులుగా చేసుకోవాలి. తులసీదాసు చెప్పినట్లు ప్రియంగా మాట్లాడుతూ మనం కుటుంబ మిత్రులం కావాలి. కుటుంబ వ్యవస్థలో 14 సమస్యలు ఉన్నాయని వైజ్ఞానికులు చెప్పారు. చెన్నై రామకృష్ణ మఠం ప్రచురించే వేదాంత కేసరి డిసెంబరు 25 సంచిక the enlightning parenting పేరుతో వెలువడింది. సమస్యలు చాలా ఉన్నాయి కానీ మనకు పరిష్కారం కావాలి. ఆదర్శ కుటుంబ వ్యవస్థ కోసం మనం కొన్ని గుణాలు అలవర్చుకోవాలి. భగవద్గీత 16వ అధ్యాయంలో అనేక దైవీగుణాలు సద్గుణాల ప్రస్తావన ఉంది. వాటిని మనం సంక్షిప్తంగా ఎనిమిది గుణాలుగా వర్గీకరించాం. అవి బలం, శీలం, ఓజస్సు, ధైర్యం, యుక్తి, బుద్ధి,దక్షత, దృష్టి. ఈ గుణాలను మనం కొనలేం. గుణాలను నిర్మించాలి. వికసింప చేయాలి.

1. బలం : శారీరక, భౌతిక, ఆర్థిక, ఆధ్యాత్మిక బలం. మాఘమాసంలో రథసప్తమి వస్తుంది. మన పూర్వ సర్ సంఘచాలక్ పరమ పూజనీయశ్రీ గురూజీ యుక్త వయసులో 250 సూర్య నమస్కారాలు చేసేవారు. ఈ విషయం చివరిరోజులలో వారే చెప్పారు. 'నేను 33 సంవత్సరాల పాటు సంవత్సరానికి రెండుసార్లు భారత భ్రమణం చేయగలగడానికి కారణం ఆ విధంగా సూర్య నమస్కారాలు చేయడమే' అని చెప్పారు. దీన్నే బలోపాసన అంటారు. ఇలాంటి ఉదాహరణ మన కుటుంబంలో, పరిసర కుటుంబాలలో కూడా చూడవచ్చు. నేను మహారాష్ట్ర పర్యటనలో బారామతి వెళ్లాను. ఉదయం 5 గంటలకు చేరాను. స్నానం చేసి వచ్చాను. కుటుంబ సభ్యులందరూ లేచి వచ్చారు. వారు చెప్పారు, 'మేమంతా ఐదు గంటలకు లేస్తాం, అందరం కషాయం తాగుతాం, మేమెప్పుడు రోగగ్రస్తులు కాలేదు, కాము, మాది సరి అయిన దినచర్య, రోజంతా మేము ఉత్సాహంగా ఉంటాం' అని చెప్పారు.మొన్న భాగ్యనగర్‌లో జరిగిన విశ్వ సంఘ శిబిరంలో ఏడాది శిశువు దగ్గర నుంచి 92 ఏళ్ల వయసు వరకు శిబిరంలో పాల్గొన్నారు. నా పర్యటనలో నేను 123 ఏళ్ల వృద్ధుల్ని చూస్తుంటాను. ఏ రోగము లేకుండా ఆరోగ్యంగా ఉంటారు, కారణం వారి దినచర్య. మంగళప్రభాత్ మంగళ భోజన్, మంగళ భజన్, మంగళశయన్ -ఇది మన దినచర్యలో భాగం కావాలి.విశ్వసంఘ శిబిరంలో నేను తీసుకున్న బైఠక్‌లో వారికి ఒక ఫార్ములా చెప్పాను. ఏమి చేయాలి, ఏమి చేయకూడదు. జీవన మూల్యాలు ఏమిటి? నేను చేస్తున్న పనివల్ల పరిణామం ఏమిటి? పర్యవసానం ఏమిటి? పిల్లలు ఉన్నారు -స్కూల్లో ఎవరిదైనా పెన్ను దొంగిలించడం, లేదా వేరే వాళ్ల హోమ్‌వర్క్ మీద ఏదైనా రాయడం ఇలా.. యువకులున్నారు యువతీ యువకులు సహజీవనం చేయడం, మద్యం, ధూమపానం వంటి వ్యసనాల బారిన పడటం, ఇలా చేయడం వల్ల వచ్చే పరిణామాలు తెలుసుకొని ఈ పనులు చేస్తున్నారా? ఈ విషయంలో మనం ఇరుగుపొరుగును, మన ఇంటిని జాగృతిని చేయడం, మనం ఈ 8 గుణాల వెలుగులో ఏ పని చేయాలో ఆ పని చేయగలుగుతామా? స్వామి వివేకానంద చెప్పినట్లు మనకు head, heart, hand అని ఉంటాయి . ఏదైనా ఈ మూడింటి ద్వారానే అవుతాయి. ఇవి ఈ ఎనిమిది గుణాలు తీసుకుని వర్తిస్తే మనకు మంచి జరుగుతుంది.

2. శీలం- ఇది సర్వశ్రేష్ఠ గుణం. ప్రహ్లాదుడి కథ మనకు తెలుసు. ఎంత కష్టమైనా నారాయణుని స్మరించాడు. నరసింహ అవతారంగా వచ్చి హిరణ్యకశ్యపుని సంహరించాడు. తర్వాత ప్రహ్లాదుడు రాజు అయ్యాడు. అప్పుడు ఇంద్రుడు తానెప్పుడు రాజు కాగలనా అనుకుని బ్రాహ్మణవేషంలో వెళ్లి శీలాన్ని దానంగా అడిగాడు. శీలంతో పాటు లక్ష్మి, రాజ్యం, బలం, బుద్ధి అన్ని వెళ్లిపోయాయి. శీలం అంటే స్వయంగా మోహానికి దూరంగా ఉండడం. స్వామి రామతీర్థ అన్నారు say no to all

temptations అని. జీవితంలో ఇలాంటి సంఘటనలు ఎదురవుతాయని, స్త్రీ కోసం, ధనం కోసం జరిగే వీటికి దూరంగా ఉండి ఆత్మ సంయమం పాటించాలి. ఇది మన ఇంట్లో మనం ప్రస్తావించాలి. తల్లిదండ్రులు పిల్లలను డాక్టరు, ఇంజనీరు,వకీలు చేయాలనుకుంటారు. కానీ శీలం లేనప్పుడు ఇవన్నీ ఎందుకు?ఈ విషయాలు మనం ఇంట్లో, ఇరుగుపొరుగు కుటుంబాలలో ప్రస్తావించాలి. ఈ గుణముల కోసం ఉపాసన చేయాలి ఆరాధన చేయాలి.

3. ఓజస్సు: అంటే సాధువులు సన్యాసులు బ్రహ్మచర్యం పాటించి తపస్సు వల్ల సాధించింది. మన ప్రధాని మాననీయ శ్రీ నరేంద్ర మోదీ రోజూ 16 నుంచి 18 గంటలు ఎలా పని చేస్తారు? ఆయన ముఖంలో ఎక్కడ దైన్యం ఉండదు, చిరునవ్వు ఉంటుంది. ఈ మధ్య జరిగిన విశ్వ సంఘశిబిరంలో మన విదేశాంగ మంత్రి డాక్టర్ జయశంకర్ ఒక సెషన్ లో 90 నిమిషాలు ఉన్నారు. అరగంట పాటు భారత ప్రగతికి 'సురక్ష, సమృద్ధి,సంస్కృతి' అనే

కుటుంబ వ్యవస్థ

విషయమై ప్రసంగించారు. ఒక గంట ప్రశ్నోత్తరాలు జరిగాయి. ఒక శిబిరార్థి 'మోదీ యోగా దినోత్సవం ప్రపంచానికి పరిచయం చేసినట్లే భగవద్గీతను ఎప్పుడు ప్రపంచానికి చేరుస్తారు?' అని అడిగారు. 'మనం ఈ కురుక్షేత్రంలో ఈ విషయం తీసుకున్నాం త్వరలోనే ఇది నిజమవుతుందని' డాక్టర్ జయశంకర్ చెప్పారు

4. ధైర్యం– ఆంగ్లంలో nothing teachers like careful observation అన్నట్లుగా మన కుటుంబంలో ప్రతి బాలుడు, బాలికల అవలోకనా గుణం పెంచాలి. ఏ మంచి నేర్చుకోవడానికి మనకు ఏ విషయం దొరుకుతుంది అని ఆలోచించాలి. మంచి జీవన చరిత్రలు చదవాలి. ఏదైనా కష్టం వస్తే ధైర్యంగా ఎలా ఎదుర్కొన్నారు తెలుస్తుంది. రామాయణంలో రాముడి వివాహం తరువాత పరశు రాముడు వచ్చాడు. వాళ్లు ఆనందంలో ఉన్న వేళ పరుశురాముడు వచ్చి కలవరపెట్టాడు. రాముడు పరశురాముని చాలా వినమ్రతతో, ధైర్యంగా ఎదుర్కొన్నాడు. కరోనా సమయంలో చాలామంది భయపడ్డవాళ్లు చనిపోయారు. మానసికంగా ధైర్యం తెచ్చుకున్న వారు నిలబడ్డారు.

5. యుక్తి– మహాభారతంలో యుద్ధం మొదలైంది. కొన్ని రోజులు గడిచాయి. కానీ పాండవులు ఎవరు చనిపోవడం లేదు. ఇది దుర్యోధనుడికి చింత కలిగించింది. ఏదో మ్యాచ్ ఫిక్సింగ్ లాంటిది జరుగుతోందని అనుమానపడ్డాడు. భీష్ముడి దగ్గరికి వెళ్లాడు.ఆయన సైన్యాధిపతి. ఆయనను 'పాండవులు ఎవరూ చనిపోవడం లేదు ఏంటి 'అని అడిగాడు. అప్పుడు భీష్ముడు ఐదు స్వర్ణబాణాలు తన తపో బలంతో నిర్మాణం చేశాడు. దుర్యోధనుడు 'ఇదేమిటి 'అని అడిగాడు. 'రేపు వీటితో పాండవులను వధిస్తాను' అన్నాడు భీష్ముడు. కానీ దుర్యోధనుడికి అనుమానం. 'ఈ ఐదు బాణాలు నేను తీసుకు వెళ్తాను. రేపు యుద్ధంలో ఇస్తాను' అన్నాడు దుర్యోధనుడు. శ్రీకృష్ణుడికి విషయం తెలిసింది. కృష్ణుడు అర్జునుడికి ఒక పాత సంఘటన గుర్తు చేశాడు. పాండవులు వనవాసం చేస్తున్న సమయంలో చూడడానికి దుర్యోధనుడు వెళ్లి, గంధర్వులతో గొడవపడ్డాడు. చివరికి గంధర్వులు దుర్యోధనుడిని ఒక చెట్టుకు కట్టివేశారు. ఈ విషయం తెలిసి ధర్మరాజు 'దుర్యోధనుడు మన సోదరుడని, అతన్ని రక్షించాలని గంధర్వులపై యుద్ధం చేయమని' ఆదేశించాడు. అర్జునుడు వెళ్లి యుద్ధం చేసి దుర్యోధనుడ్ని విడిపించాడు. దుర్యోధనుడు రాజహంకారంతో 'నీకేం కావాలో చెప్పు.నేను ఇస్తాను' అని అర్జునుడితో అన్నాడు. అర్జునుడు 'అవసరం వచ్చినప్పుడు అడుగుతాను' అన్నాడు. కృష్ణుడు ఈ విషయం గుర్తు చేసి 'దుర్యోధనుడి దగ్గరకు వెళ్లి ఆ ఐదు బాణాలు తీసుకో' అన్నాడు. అర్జునుడు వెళ్లి ఆ బాణాలు అడిగాడు. దుర్యోధనుడు ఇచ్చివేశాడు. అలా సంకట కాలంలో యుక్తితో పనులు చక్కబెట్టుకోవాలి. యుక్తి ఉంటే శక్తి, శక్తి ఉంటే యుక్తి– దానితో విజయం సిద్ధిస్తుంది.

6. బుద్ధి – వాల్మీకి రామాయణంలో 8 విషయాలు ఉన్నాయి. వినాలని, అర్థం చేసుకోవాలి, సమీక్షించాలి, నిర్ణయం తీసుకోవాలి, అర్థజ్ఞానం, తత్వజ్ఞానం తెలిసి క్రియాన్వితం చేయాలి. ఇవి బుద్ధికి సంబంధించిన కొన్ని సూచనలు– ఈ తరహా బుద్ధి మనకు కావాలి.

7. దృష్టి – కళ్లతో చూసేది సామాన్యమే భారతీయ జీవన దృష్టి, జీవన మూల్యాలు జీవన వ్యవహారం ఇవి ముఖ్యం. ప్రపంచంలో భారత దేశంలో మాత్రమే మాతృవత్ పరదారేషు, పరద్రవ్యే ష్ లోష్టవత్, ఆత్మవత్ సర్వభూతేషు, యః పస్యతి సపండితః// అన్నారు. పర స్త్రీ తల్లితో సమానం అన్నారు. పరుల ధనం మట్టితో సమానం, అందరిని ఆత్మీయులుగా భావించడం ఇది మన సంస్కృతి. కేరళలో కాలడి నుండి బయలుదేరి శంకరాచార్యుల వారు వారణాసి వచ్చారు. అన్నపూర్ణ దర్శనం చేసుకుని అన్నపూర్ణాష్టకం రాశారు. 'అన్నపూర్ణే సదాపూర్ణే, శంకర ప్రాణ వల్లభే! జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాందేహీ చ పార్వతి, మాతా చ పార్వతీదేవి, పితాదేవో మహేశ్వర, బాంధవా శివ భక్తాశ్చ, స్వదేశో భువన త్రయం!మూడు భువనాల్లో ఉన్న శివభక్తులంతా నా సోదరులే అన్నారు. వివేకానందుడు sisters and brothers of America అన్నారు. ఈ మాట 1200 సంవత్సరాల క్రితమే శంకరులు చెప్పారు. రామతీర్థ జీవితంలోనూ ఇది ఉంది. అమెరికా వెళ్ళినప్పుడు అక్కడ విమానాశ్రయంలో దిగేదాకా ఆయనకు తెలియదు. 'మీకు మిత్రులు ఎవరు ఉన్నారు' అని ఒక అమెరికన్ అడిగాడు. 'నాతో మాట్లాడిన నువ్వే నా మిత్రుడివి' అన్నాడు రామతీర్థ.'అలాగా అయితే నాతో మా ఇంటికి వస్తారా' అని అడిగాడు అమెరికన్. 'తప్పకుండా' అంటూ అతని వెంట నడిచి వెళ్లారు రామతీర్థ. ఇలా అందరూ నా వాళ్లే అనుకోవడం, ఈ ఆత్మీయత వ్యవహారం ఇది భారతీయ దృష్టి.

8. దక్షత – విశ్వసంఘ శిబిరంలో రామజన్మ భూమి మందిరం ట్రస్టు కోశాధ్యక్షులు శ్రీ గోవిందదేవ గురూజీ ఉద్ఘాటనలో మాట్లాడారు. ఆయన యుధిష్ఠిర యక్ష సంవాదం ప్రస్తావించారు. యక్షుడు ధర్మరాజును ధర్మాన్ని ఒక శబ్దంతో ఎలా నిర్వచిస్తారు చెప్పమన్నాడు. అప్పుడు ధర్మరాజు 5000 సంవత్సరాల క్రితమే 'దక్షత(alerness) అని జవాబు ఇచ్చారు. అన్ని రకాల సావధానత కావాలి. సావధానంగా ఉంటే దుర్ఘటనలు జరగవు. ఇది మన

కుటుంబంలోని ప్రతి వ్యవహారంలో ప్రతిబింబించాలి. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఒకరోజు రైలులో ప్రయాణిస్తుండగా చైన్ లాగి రైలు ఆపారు. కిలోమీటర్ దూరంలో ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. చాలా మంది ప్రాణాలు కాపాడారు. ఇలా ఈ 8 గుణాలు మనం సమాజంలో కుటుంబాలలో వికసింప చేయాలి. అలాగే ఆరు దుర్గుణాలను మనం మన కుటుంబాల నుంచి దూరం చేయాలి.

1. భయం– చిన్న చిన్న విషయాల పట్ల ఎందుకు భయం కలుగుతుంది?

2. స్వార్థం– నేను నిస్వార్థంగా జీవిస్తున్నానా? నిస్వార్థంగ జీవించలేమా?

3. ఇంట్లో బయట చిన్న చిన్న విషయాల పట్ల అహంకారం ఎందుకు? దాన్ని నమ్రతగా మార్చగలమా?

4. బద్దకం– ఇంట్లో అందరం పని చేయాలి. కొందరు బద్ధకస్తులైతే ఎలా? పనులు పంచుకోవాలి.

5 తప్పుడు సామాజిక గుర్తింపు–దీనివల్ల భేదభావం, పెద్ద, చిన్న, ఉచ్ఛ నీచ, భావాలు వస్తాయి. మన గ్రామంలో బస్తీలో అలాంటి సమస్యలు ఏమి ఉన్నాయి అని ఆలోచించాలి? ఉదా: దక్షిణ కర్ణాటకలో RBIలో మేనేజరు, ఆయన మన ప్రాంతం టోలిలో ఉన్నారు. ఆయన కోడలు గర్భవతి. కొడుకు పుడితే కనకాభిషేకం చేస్తామన్నారు,మరి కూతురు పుడితే అని అడిగాం. ఏమీ చేయమన్నారు. అదెలా? మరి మనం కుటుంబ ప్రబోధన్ వాళ్లం కదా! భ్రూణహత్యలు జరుగుతున్న విషయం మనకు తెలుసు. చర్చల తర్వాత వారు కొంత సమాధాన పడ్డారు. అదే సమయంలో సిందూర్ ఆపరేషన్ రోజున ఆమెకు ఆడపిల్ల పుట్టింది. పాపకు సింధూర అని పేరు పెట్టారు. ఐదు నెలల తరువాత కనకాభిషేకం చేస్తాము అన్నారు. దీన్నే వ్యక్తిగత పారివారిక సామాజిక జీవనం లోకహితం కావడం అంటారు. విశ్వసంఘ శిబిరంలో ఒక బౌద్ధిక్‌లో రాముడి వనవాసం గురించి చెబుతూ రాముడు తనలోని మలినాన్ని తొలగించుకునేందుకు 14 ఏళ్ల వనవాసం చేశారు. అని చెప్పారు.

6. బౌద్ధిక జడత్వం – కొత్త విషయాలు నేర్చుకుంటుండాలి. పాకిస్తాన్‌తో యుద్ధం జరిగినప్పుడు నాటి మన ప్రధాని లాల్‌బహుదూర్‌శాస్త్రి జై జవాన్ జై కిసాన్ నినాదం ఇచ్చారు. అటల్ బిహారీ వాజపేయి జై విజ్ఞాన్ నినాదం ఇచ్చారు. నేడు మన మోదీ జై అనుసంధాన్ అన్నారు. ఇది కేవలం సైన్స్ విషయం లోనే కాదు ఏ కారణం చేత మన యువతీ యువకులు పెళ్లి చేసుకోరు? 30, 32 ఏళ్ళు వచ్చినా ఎందుకు పెళ్లి చేసుకోరు, దీని కారణం కనుక్కోవాలి. మానసిక నిపుణులు దీని గురించి ఆలోచించాలి. నేనేం చేయలేను అనకూడదు. అదొక జీవనచక్రం. సరైన సమయంలో పెళ్లి కావాలి, పిల్లలు పుట్టాలి, దీని గురించి ఆలోచించాలి.

కనుక 8 గుణాల వికాసం గురించి 6 అవగుణాలు దూరం చేయించడం గురించి మనం ఆలోచించాలి. ★

అవీ ఇవీ

ఫిబ్రవరి 17న సుప్రీంకోర్టులో రసవత్తరమైన సన్నివేశం చోటు చేసుకుంది. ప్రజా ప్రయోజన వ్యాజ్యం పేరుతో, సెక్యులరిజం పరిరక్షణ పేరుతో, హక్కుల రక్షణ పేరుతో వ్యాజ్యాలు పడుతుంటాయి. వీటిని దాఖలు చేసేవారు అల్లాటప్పా వాళ్లేమీ కాదు. ప్రఖ్యాత వ్యక్తులు, మేధావులు. అయితే గమనించవలసిన విషయం– వీళ్లు స్వయం ప్రకటిత మేధావులూ, వ్యక్తులే. వీళ్ల వ్యాజ్యాలన్నీ బీజేపీ మీద, ఆర్ఎస్ఎస్ మీద వ్యతిరేకతతోనే ఉంటాయి. ఇంకా చెప్పాలంటే అలాంటి సంస్థలను అడ్డం పెట్టుకుని హిందూత్వం మీద దాడి చేస్తూ ఉంటారని చెప్పాలి. ఇంతకీ ఫిబ్రవరి 17న సుప్రీంకోర్టు ఇలాంటి స్వయం ప్రకటిత మేధావులు, ప్రముఖులకు ఎందుకు తలంట వలసి వచ్చిందీ అంటే–

బహిరంగంగా మాట్లాడేటప్పుడు ఎవరినీ రెచ్చగొట్టే తీరులో ఉండకూడదనీ, ఇతర మతాల వారిని లక్ష్యం చేసుకోకుండా ఉండాలనీ ఆదేశాలు ఇవ్వాలని కొంతమంది 'ప్రముఖులు' సుప్రీంకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యం ఆరోజు విచారణకు వచ్చింది. ఇలాంటి దీని మీద సుప్రీంకోర్టు ఎందుకు ప్రతికూలంగా స్పందించవలసి వచ్చింది? ఎందుకు తీవ్రమైన వ్యాఖ్యలు చేయవలసి వచ్చింది. అందుకు కారణం లేకపోలేదు. కేవలం బీజేపీ ముఖ్యమంత్రులు, నాయకులు చేసిన ఉపన్యాసాలనే తమ వ్యాజ్యంలో ఆ 'ప్రముఖులు' ఉదాహరించారు. ఇంత పక్షపాతంతో కూడిన వ్యాజ్యం ఎక్కడైనా

కేరళ స్టోరీ 2... పినరయి

హిందువులపై జరిగిన హింసను, అణచివేతను సెక్యులరిజం, ఉదారవాదం చాటున దాచి పెట్టడమే మేధావుల ఉద్దేశం. జిహాద్ పేరుతో హిందూ యువతులను చెరబట్టి, సెక్స్ స్లేవ్స్‌గా అమ్మినా హిందూ ముస్లిం ఐక్యత కోసం మెజారిటీ ప్రజలు 'సంయమనం' పాటించాలంటుంది వామపక్షం. ది కేరళ స్టోరీ అనే సినిమాకు వ్యతిరేకంగా ఇదే వాదాన్ని కేరళలో కమ్యూనిస్టులు లేవదీశారు. ఆ సినిమాలో చూపించినదంతా అవాస్తమేనని కొట్టిపారేశారు. ఆఖరికి కేరళ క్రైస్తవ సమాజం అదే ఆరోపణ చేసినా అదే విధంగా స్పందించారు. కేరళ స్టోరీ సినిమా తీసిన దర్శకుడు కామాఖ్య నారాయణ్‌సింగ్ ఇప్పుడు కేరళ స్టోరీ 2 (కేరళ స్టోరీ 2 గోస్ బియాండ్) పేరుతో సిక్వెల్ రూపొందించి విడుదల చేస్తున్నారు. ఇది కూడా దుష్ప్రచారమేనంటూ సాక్షాత్తు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నోరెట్టుకు పడిపోతున్నారు. టీజర్ కేరళ గౌరవ ప్రతిష్టలను మంటగలిపేది ఉందంటూ శ్రీదేవి నంబూదిరి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి, చిత్రం విడుదలను నిలిపివేయాలని కోరారు. ఈమె బయాలజిస్ట్ అట. టీజర్‌లో కేరళ, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లకు చెందిన యువతులు ఉగ్రవాదుల ప్రేమవలలో చిక్కుకుని మత మార్పిడికి, హింసకు గురైనట్టు చూపించారని ఆమె కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సినిమా వల్ల దేశంలో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని కూడా ఘంటాపథంగా చెప్పేశారు. ఇందుకు సంబంధించి హైకోర్టు కేంద్ర శాఖలకు, నిర్మాత, దర్శకులకు నోటీసులు కూడా జారీ చేసింది.

దేశంలో జనాభా సమీకరణాలను మార్చడానికి యువతులను ఎరవేసి పట్టుకుంటున్నారని, ఆ విషయంలో వారిలో చైతన్యం కలిగించే ఉద్దేశంతోనే ఈ చిత్రం

ప్రముఖులపై సుప్రీం కోర్టు కొరడా

ఉంటుందా? అసలు ఇతరులు ఎవరూ, అంటే బీజేపీయేతర ముఖ్యమంత్రులు లేదా నాయకులు అసలు రెచ్చగొట్టే ప్రసంగాలే చేయడం లేదా అని నిలదీసింది ధర్మాసనం. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వశర్మ మాటలు మాత్రమే మీకు వినిపించాయా? అని 'ప్రముఖుల'కు, వారి తరఫున వాదించడానికి తగుదునమ్మా అంటూ వచ్చిన కపిల్ సిబల్‌కు సుప్రీంకోర్టు ధర్మాసనం మొట్టికాయలు వేసింది. ఈ అంశం మీద న్యాయం కావాలంటూ సంతకాలు చేసిన ప్రముఖులు మొత్తం 12 మంది. నిజంగా మీకు ఇలా రెచ్చగొట్టే ప్రసంగాలను నిరోధించాలన్న చిత్తశుద్ధే ఉంటే సమగ్రంగా పిటిషన్ తయారు చేసి తీసుకురండని కూడా మొహం మీద తలుపెసేసింది. ఇలాంటి రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ, వాతావరణాన్ని కలుషితం చేస్తున్నవారిని నిరోధించే శక్తి కేవలం అత్యున్నత న్యాయస్థానానికి మాత్రమే ఉందని ఒక బిస్కెట్ విసిరినా ధర్మాసనం అక్షింతలు వేయకుండా ఆగలేదు.

అసలు మీరు దాఖలు చేసిన పిటిషన్‌లో తాటస్థ్యం ఎక్కడ ఉంది అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేరుగా ప్రశ్నించడం విశేషం. ఈ పిటిషన్‌ను విచారించడానికి నియమించిన ముగ్గురు సభ్యుల ధర్మాసనంలో ఆయన కూడా ఉన్నారు. ఇది కొందరు వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని మాత్రమే దాఖలు చేసినట్టు ఉందని మిగిలిన ఇద్దరు సభ్యులు జస్టిస్ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ అన్నారు. వ్యాజ్యం దాఖలు చేసిన వాళ్లలో ప్రముఖులు ఉన్న మాటను మేమూ అంగీకరిస్తున్నాం. ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్, రూప్‌రేఖా వర్మ వంటివారు ప్రసిద్ధులే. కానీ మీరు కొందరు వ్యక్తులను లక్ష్యంగా చేసుకున్నారు అని ధర్మాసనం దుయ్యబట్టింది. ఆ ఇద్దరు కాక మిగిలిన ప్రముఖుల పేర్లు కూడా విని తరిద్దాం. హర్ష్‌మందిర్, జాన్ దయాళ్, అశోక్ కుమార్ శర్మ తదితరులు. యోగి ఆదిత్యనాథ్, హిమంత, దేవేంద్ర ఫడణవీస్, పుష్కర్ సింగ్ ధామీ, అనంతకుమార్ హెగ్డే, గిరిరాజ్‌సింగ్ వీరు మాత్రమే రెచ్చ గొట్టే ప్రసంగాలు చేసేవారిగా ఈ 12 మంది ప్రముఖులు కనిపెట్టేశారు. ఈ మొట్టికాయలతో మేలుకొన్న ప్రఖ్యాత న్యాయవాది కపిల్ సిబల్, అయితే ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నామని, మరొక సమగ్ర పిటిషన్‌తో దర్శనం చేసుకుంటామని చెప్పవలసి వచ్చింది. జస్టిస్ బాగ్చీ అయితే నేరుగా కపిల్ సిబల్ ముఖం మీద పేడనీళ్లు చల్లారు. ఇదో అస్పష్ట పిటిషన్. ప్రజలలో పేరు కోసం చేసే విన్యాసంలా కాకుండా, రాజ్యాంగ బద్ధంగా నిర్మాణాత్మక ప్రక్రియతో రండి! ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసేటప్పుడు వికృత రాజకీయాలు ప్రభావం చూపకూడదు అన్నారాయన.

ఇటీవల అస్సాం బీజేపీ సభ్యుడు ఒకరు తన ఎక్స్ వేదికగా ఒక చిత్రం పెట్టాడు. అందులో ముఖ్యమంత్రి హిమంత ఇద్దరు వ్యక్తుల మీద తుపాకీ గురి పెట్టి ఉంటారు. ఆ ఇద్దరిలో ఒకరు స్కల్ టోపీ, రెండోవారు గెడ్డంతో ఉంటారు. అయితే తరువాత ఈ పోస్టును తొలగించారు. నిజానికి ఈ పోస్టు మీద ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో దర్యాప్తు చేయించాలంటూ దాఖలైన వ్యాజ్యం మీద అంతకు ముందు రోజే సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అది గౌహతి హైకోర్టులో దాఖలు చేయాలని ఆదేశించింది.

హైదరాబాద్ ఒవైసీ సోదరుల రెచ్చగొట్టే ప్రసంగాలు, తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రసంగం, ఉత్తరప్రదేశ్‌లో అనేక మంది మౌల్వీలు ఇచ్చిన ప్రసంగాలు ఇవేమీ ఈ ప్రముఖులకు వాళ్ల న్యాయవాది కపిల్ సిబల్‌కు వినిపించవు. వాళ్ల ఉద్దేశం రెచ్చగొట్టే ప్రసంగాలను నిరోధించడం కాదు. ఎన్నికల ముందు బీజేపీ నేతల ముందరి కాళ్లకు బంధం వేయడం. ఎవరినైనా ఒకటి లేదా రెండుసార్లు మోసం చేయగలరు.కలకాలం చేయలేరు. ఇప్పుడు దేశంలో ఈ ప్రముఖులు, మేధావులు, ఉదారవాదులు ఈ చివరి అంశాన్ని గుర్తించాలి. ★

పాత పాట

నిర్మించామని దర్శకుడు వివరణ ఇచ్చారు. ఇంకా చెప్పాలంటే ఇది కేరళ ప్రాంత యువతులు, కుమార్తెల ఘోష మాత్రమే కాదని, దేశమంతా ఇదే తరహా మోసం జరుగుతున్నదని ఆయన చెప్పారు.కాబట్టి ఇది వాస్తవాల ఆధారంగా నిర్మించిన చలనచిత్రమని స్పష్టం చేశారు. కేరళ స్టోరీ 2కు సంబంధించిన ట్రయిలర్ మాత్రమే విడుదలయింది. దీనితోనే కేరళ మార్క్సిస్టులు గోల మొదలుపెట్టడం విశేషం. హిందూ బాలికలను ఏ విధంగా ప్రేమ పేరుతో ప్రలోభాలకు గురి చేస్తున్నదీ, తరువాత పెళ్లిళ్లు చేసుకుంటున్నదీ, గృహహింసకు పాల్పడుతున్నదీ, హక్కులు లేకుండా చేస్తున్నదీ; ఆఖరికి బలవంతంగా ఇస్లాంలోకి

మార్చుతున్నదీ ఈ సినిమాలో వివరించినట్టు దర్శకుడు వివరించారు. కేరళ స్టోరీ మొదటి భాగాన్ని ప్రేక్షకులు ఆదరించారని, రెండో భాగాన్ని కూడా ఆదరిస్తారన్న నమ్మకం తమకు ఉందని నారాయణ్‌సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. మనం కళ్లు మూసుకుని లేదా, అలాంటిదేమీ లేదని ముందే నిర్ధారణకు వచ్చి వాస్తవాన్ని కాదనడం సరికాదని ఆయన అన్నారు.అలాంటి అన్యాయాల గురించి సమాజం గళమెత్తి తీరాలి. ప్రజలను చైతన్యవంతం చేసి తీరాలి. లేకపోతే జరిగేది ఒక్కటే- మన సోదరీమణులను, మన కూతుళ్లను ఎరవేసి ఎత్తుపోవడం సాగిపోతూనే ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ స్టోరీ 2 వాస్తవాన్ని అందించే పరికరమని ఆయన అభివర్ణించారు. ఈ సినిమా దుష్ప్రచారం కోసమేనని మాట్లాడుతున్నవారు కోర్టులలో ఉన్న పత్రాలను, పత్రికల కథనాలను పరిశీలించవచ్చునని ఆయన సవాలు విసిరారు. అలాంటి బాధ్యతా రహితమైన విమర్శలు చేసే ముందు అలాంటి ఉచ్చులో పడిపోయిన వారి జీవితాలను ఒక్కసారి పరిశీలించమని కోరుతున్నానని కూడా ఆయన అన్నారు. ★

ఆర్థిక వ్యవస్థకు బిర్యానీ పోటు

హోటళ్లలో తనిఖీలు సర్వసాధారణం. హైదరాబాద్ నగరంలో ప్రారంభమైన బిర్యానీ హోటళ్ల తనిఖీ దేశమంతటా విస్తరించవలసిన అవసరం వచ్చింది. ఫలితాలు చూసి అధికారులు నోరెళ్లబెట్టవలసి వచ్చింది. దేశంలోని బిర్యానీ హోటళ్లు రూ 70,000 కోట్లు పన్ను ఎగవేతకు పాల్పడుతున్నాయి. సాధారణంగా వ్యాపారులకు నాలుక చివర ఉండేమాట– గిట్టుబాటు కావడం లేదు, ఈ మధ్య వ్యాపారం బాగాలేదు. కానీ తనిఖీ తరువాత కొన్నేళ్ల సమాచారాన్ని మథిస్తే బిర్యానీ పన్ను ఘాటు గుప్పుమంది. ఇదంతా ఒక ప్రముఖ జాతీయ ఆంగ్ల దినపత్రికలో వెలువడింది.

బిల్లులు రాయడానికి హోటళ్లు ఉపయోగించే భారీ కంప్యూటర్ వ్యవస్థను పరిశీలించిన తరువాత గత కొన్నేళ్లుగా ఇలా పన్ను ఎగవేత యథేచ్ఛగా సాగిపోతున్నదని తేలింది. ఇలా పన్నుల నుంచి తప్పించుకోవడానికి చక్కగా సహకరించే సాఫ్ట్‌వేర్‌ను దేశంలోని దాదాపు లక్ష వరకు హోటళ్లు ఉపయోగించుకుంటున్న సంగతి కూడా బయటపడింది. తలదన్నేవాడు ఒకడైతే, తాడిని తన్నేవాడు ఒకడని సామెత. అది ఇక్కడ సరిగ్గా సరిపోతుంది. పన్ను నుంచి తప్పించే ఆ సాఫ్ట్‌వేర్‌ను అధికారులు కంప్యూటర్ పరికరాలతోను, ఆర్టిషిఫియల్ ఇంటెలిజెన్స్‌తోను పట్టుకున్నారు. ఇందుకోసం అధికారులు పడిన శ్రమ తక్కువేమీ కాదు. దేశంలో ఇలా తనిఖీ అవసరమైన హోటళ్లు 1.77 లక్షలు. వాటిలో బిల్లింగ్ రికార్డుకు సంబంధించి 60 టెరాబైట్ల సమాచారాన్ని వారు విశ్లేషించారు. వచ్చిన వినియోగదారుడు బిల్లు చెల్లిస్తాడు. అక్కడి వరకు బాగానే ఉంటుంది. కానీ సిస్టమ్ లోపల ఆ బిల్లు మాయమైపోవచ్చు. లేకపోతే మార్పులు సంతరించుకోవచ్చు కూడా. దేశ వ్యాప్తంగా ఇలా ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి మాయం చేసిన బిల్లుల విలువ రూ. 13,000 కోట్లని తేలింది.ఒక్క తెలుగు రాష్ట్రాలలోనే ఇలాంటి అజ్ఞాత బిల్లుల విలువ రూ 5,100 కోట్లు. ఈ ఎగవేత గురించి ఒకటికి రెండుసార్లు అధికారులు తనిఖీ చేసుకుని, జాగ్రత్త పడ్డారు కూడా. 40 హోటళ్లను ఎంచుకుని వాటిలో నిజంగా జరిగిన అమ్మకాలు, కంప్యూటర్‌లో నమోదు చేసిన మొత్తాలను బేరీజు వేశారు. ఈ 40 హోటళ్లలోనే రూ 400 కోట్లు పన్ను ఎగవేత బయటపడింది. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకుని దేశంలోనే అత్యధికంగా బిల్లులు మాయం చేయడం లేదా అంకెలు మార్చిన రాష్ట్రం కర్ణాటక. తరువాత స్థానాలలో తెలంగాణ, తమిళనాడు ఉన్నాయి. ఇంత మాయను గమనించిన తరువాత, అదంతా బయటపడిన తరువాత కూడా చాలామంది హోటల్ యజమానులు అబ్బే బేరాలు లేవు, గిట్టుబాటు కావడం లేదన్న పాత రికార్డే వినిపించారు. ఏమైనా హోటళ్ల అమ్మకాలలో నాలుగో వంతు అజ్ఞాతంగానే ఉండిపోతున్నాయి. మొదట ఇలాంటి దర్యాప్తు హైదరాబాద్‌లో జరిగింది. తరువాత విశాఖ, ఆ నగరం పక్కన ఉన్న ఊళ్లలో తనిఖీలు జరిపారు. ఆ తరువాత ఈ తనిఖీ దేశ వ్యాప్తంగా చేపట్టవలసిన అవసరం కనపడింది. ★

బిహార్‌లో ఆఖరి మావోయిస్ట్ లొంగుబాటు

మార్చి 31, 2026కు భారత్‌ను నక్సలిజం రహిత దేశంగా నిలబెడతామని కేంద్రం హోం మంత్రి అమిత్ షా పలుసార్లు ప్రకటించారు. ఆయన మాటను బిహార్ మొదటిగా అమలులో చూపించింది. ఆ రాష్ట్రంలోని ఆఖరి మావోయిస్ట్ సురేశ్ కొండా ఫిబ్రవరి 17న ముంగేర్ జిల్లా ప్రత్యేక పోలీసు బలగాల వద్ద లొంగిపోయారు. మస్తాకిమ్ అనే మారు పేరుతో కార్యకలాపాలు సాగించిన సురేశ్ పట్టిచ్చినవారికి రూ 3 లక్షల బహుమానం ప్రభుత్వం ప్రకటించింది. ఆ గడువు దగ్గర పడుతున్నది. సురేశ్ కొండా లడాయితండా పోలీసు స్టేషన్ పరిధిలోని పైస్రాకు చెందినవాడని స్పెషల్ టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ కుందన్ కృష్ణ తెలియచేశారు. లఖీసరాయ్, జముయి జిల్లాలలో ఇతడి మీద 69 వరకు కేసులు ఉన్నాయి. నక్సల్ కార్యకలాపాలు అధికంగా ఉన్న ముంగేర్, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా నక్సల్స్‌ను పూర్తిగా ఏరివేశామని డైరెక్టర్ జనరల్ తెలియచేశారు. కాబట్టి రాష్ట్రం నక్సల్ ముక్త రాష్ట్రంగా పేర్కొనవచ్చునని చెప్పారు.

కాగా మార్చి 31వ తేదీ దగ్గర పడుతున్నకొద్దీ నక్సల్ నిర్మూలనపై ఉత్కంఠ ఎక్కువైంది. అయితే దేశంలో 300 మంది మావోయిస్టు కార్యకర్తలు మాత్రమే మిగిలారని కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు చెబుతున్నాయి. వీరంతా తెలంగాణ–చత్తీస్‌గఢ్ సరిహద్దులలోను, జార్ఖండ్‌లోని కొన్ని ప్రాంతాలలోను కేంద్రీకృతమై ఉన్నారని సీఆర్‌పీఎఫ్ అభిప్రాయపడుతున్నది. ఆ మూడు వందల మందిలో నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు. వారు గణపతి, దేవ్‌జీ, మల్ల రాజారెడ్డి, మిసిర్ బెస్రా. గడచిన సంవత్సరం కేంద్ర కమిటీ సభ్యులు 20 మంది ఉన్నారు. ఇప్పుడు ఆ సంఖ్య నాలుగుకు పడిపోయింది. దేవ్‌జీ, ఆయన సహచరులు కేసా సోధిలను పట్టుకునేందుకు కేజీహెచ్2 పథకం పేరుతో 2000 మంది సీఆర్‌పీఎఫ్ దళ సభ్యులు వెతుకుతున్నారు. భద్రతా బలగాలు పోలీసులు కలిపి నిర్వహించిన సంయుక్త చర్య వల్ల నిరుడు 370 మంది మావోయిస్టులు అజ్ఞాతం వీడి బయటకు వచ్చారని పోలీసులు చెబుతున్నారు. కాగా ఇంతవరకు 2,391 మంది మావోయిస్టులు, వారి సహాయకులు లొంగిపోయారు. 1,175 మందిని పోలీసులు నిర్బంధించారు. ★

భాగం-25



రాజసత్త ఎలా ఏర్పడింది?!

'మానవులు మొదట ప్రాకృతిక స్థితిలో ఉండేవారు. వారికి వివేకం కలగగానే రాజ్యాన్ని నిర్మించుకున్నారు. దీర్ఘకాయులు అంటే బలవంతులైన వారిని రాజుగా ఎన్నుకుని, వారికి సర్వాధికారాలు అప్పగించేవారు' అని థామస్ హాబ్స్ అనే రాజనీతి శాస్త్రజ్ఞుడు చెప్పాడు. భారతీయుల దృష్టికోణం ఈ విషయంలో మరింత విస్తారమైనది.

ప్రాకృతిక స్థితి చేత విసుగు చెందిన మానవులు వికాస స్థితిలో వివేకాన్ని మార్గ దర్శకంగా స్వీకరిస్తారు. అందుకు ఫలితంగా మానవులందరూ ఏకతాటిపైకి, ఒక ఒడంబడికకు వస్తారు. ఒక సంఘటిత ప్రభుత్వానికి తమ అధికారాలన్నింటినీ అప్పగిస్తారు. ఒప్పంద / ప్రతిజ్ఞా పత్రాలపై ఆ మేరకు సంతకాలు చేస్తారు. ఇట్టి ప్రతిజ్ఞల ద్వారా ప్రాకృతిక స్థితి అంతమవుతుంది. సమాజం లేదా రాజ్యం మనుగడలోకి వస్తుంది. మానవ ఇతిహాసానికి ఒక కొత్త అధ్యాయం అలా ప్రారంభమవుతుంది.

ఒకానొక వ్యక్తి రాజవుతాడు. బహుసంఖ్యాకులైన ప్రజలు ఇట్టి ఒడంబడికలో భాగమవుతారు. ఒకవేళ అల్పసంఖ్యాకులైన ఎవరో కొంతమంది ప్రజలు ప్రాకృతిక నియమాలతోనే జీవించడానికి పట్టుబడితే, వారిని శిక్షించి, రాజ్యంలో భాగస్తులను చేయడం అనుచితం కాదు. థామస్ హాబ్స్ అభిప్రాయంలో, 'రాజసత్తాధారి అయిన రాజు నుంచి ఇట్టి ప్రతిజ్ఞను సేకరించాల్సిన పనిలేదు. వ్యక్తులు మాత్రమే శపథ పూర్వకంగా తమ అధికారాలను రాజసత్తయందు సమర్పించాల్సి ఉంటుంది.'

ప్రాకృతిక స్థితియందే మానవుడు ఉండిపోతే, 'నిరాశతో ఈ ప్రపంచానికి ఎంతో చెడు చేసి ఉండేవాడు' అనే నమ్మిక వల్ల... అప్పటి పరిస్థితుల్లో కూడా మానవులు కొన్ని అధికారాలను త్యాగం చేస్తుండేవారు. హాబ్స్ ఇటువంటి సత్తాధారులైన వ్యక్తులను, 'దీర్ఘకాయులు' (మానవులలో దేవుళ్లుగా) పిలిచాడు. దీర్ఘకాయులు (లెవియాథన్ మానవులు) అనేదే అతను రచించిన పుస్తకం పేరు. ఎలాగైతే పీడిత మానవులు దేవతల వద్ద శపథాలు చేస్తుంటారో... అలాగే ప్రాకృతిక స్థితిలో పీడిత వ్యక్తులు మానవ దేవతల ఎదుట శపథాలు చేసేవారు. ఎలాగైతే దేవతలు శపథాలు చేయరో... అలాగే మానవరూపంలోని దేవతలు కూడా శపథ స్వీకరణ చేయాల్సిన అవసరం లేదు. అట్టివారివల్లనే పూర్ణ స్వతంత్రం – స్వేచ్ఛాసంచారం మానవులకు సాధ్యమవుతుంది.

హాబ్స్ పుస్తకానికి అట్టమీద దీర్ఘకాయుడైన మానవుడు, అతని చుట్టూ చిన్నచిన్న శరీరాలు కలిగిన మానవులను చిత్రింపచేశాడు. ఆ చిత్రంలోని దీర్ఘకాయునికి ఒక చేతిలో కత్తి, రెండోచేతిలో ధర్మ శాస్త్రం–రాజకీయ శక్తి–ధర్మరక్షణకు చెందిన ప్రతీకలను చిత్రించాడు. దీర్ఘకాయులు అనే ఊహ... చిన్న చేపను పెద్దచేప మింగేస్తుంది అని చెప్పే మత్స్య న్యాయానికి చెందినది. అంతేకాకుండా ఇది సఖ్యతకు అడ్డుగోడలు కట్టింది. అది సమాజానికి రాజ్యానికి కూడా ప్రతీకగా నిలుస్తుంది.

భారతీయుల దృష్టిలో మత్స్యన్యాయం కంటే ముందుగా వ్యక్తులందరిలోనూ సత్త్వగుణానికి ప్రాధాన్యం ఉంది. అందరూ ధర్మపరులు, ఆస్తికులై ఉండేవారు. జీవులైన వారందరూ ఈశ్వరుని సంతానమే అని నమ్మిక. ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల సమానత, స్వతంత్రత, సౌభ్రాతృత్వంతో వ్యవహరించే వారు. ఎవరూ దోపిడీకి గురయ్యేవారు కాదు. అందువల్లనే రాజు, రాజ్యం, దండవిధానం వంటివి అనావశ్యకంగా ఉండేవి. ధర్మనియంత్రితులైన ప్రజలు తమలో తాము కూడబలుక్కుని పనులు నెరవేర్చుకునేవారు. ఎప్పుడైతే వారిలో సత్త్వగుణానికి లోపం ఏర్పడిందో... అప్పుడే తమోగుణం, రజోగుణం పెచ్చరిల్లాయి. ధర్మం తరిగిపోయి అధర్మం విస్తరించింది. అప్పుడు మత్స్యన్యాయం వెలుగులోకి వచ్చింది.

అప్పుడు ప్రజలు పీడితులై ఈశ్వరుని ప్రార్థించారు. ఈశ్వరానుగ్రహం వల్ల చంద్ర, సూర్య, ఇంద్ర, వరుణ, కుబేర, యమ మొదలైన లోకపాలకుల గుణాలను... ఆయా దేవతల అంశ కలిగి ఉన్నవారిని రాజుగా నియమించుకునే వారు.

మహతీ దేవతా హ్యేషా నరరూపేణ తిష్ఠతి
(మనుస్మృతి 7.8)

... అని అనేక విధాలుగా భారతీయ శాస్త్రాలలో రాజు తాలూకు మహత్వం వర్ణితమైంది.

'రాజు దైవాంశ సంభూతుడు కాదు. మనుష్యుల మధ్య ఒడంబడిక కారణంగా ఎన్నుకోబడతాడు' అని హాబ్స్ భావించాడు. రాజు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండాల్సిందే. కానీ ఈశ్వరాంశ సిద్ధాంతం ప్రకారం మాత్రం కాదు. పార్లమెంట్ సిద్ధాంతాల అనుసారంగా రాజు–రాజసత్త అనేవి వేర్వేరుగా ఉంటాయని అతడు అంగీకరించలేదు. అతడి అభిప్రాయంలో, 'నైసర్గిక, లౌకిక నియమాల వల్ల కత్తి లేకుండా రాజ్యం అంటే అది కేవలం శబ్దమాత్రంగానే ఉండిపోతుంది. అందువల్ల దీర్ఘకాయులను కీర్తించడం ఒక్కటే మార్గం. ఎప్పుడైతే ప్రజలు తమ అనుబంధాల వల్ల తమ అధికారాలను రాజ్యానికి సమర్పిస్తారో... అప్పుడే తమకు విరుద్ధంగా పనిచేసే అవకాశం ఎవరికీ లేకుండా చేస్తారు. ఎక్కడైతే సామాన్యులకు వారి అధికారాల నుంచి చ్యుతి కలిగిందో... అక్కడే ధర్మరక్షణ కూడా జరుగుతుంది.

ఈ విధంగా హాబ్స్ తన కాలంలోని అంతర్యుద్ధాల కారణంగా తలెత్తుతున్న వివిధ విచారధారలకు తగిన సమాధానాలు వెతికి పట్టుకున్నాడు. కానీ ధార్మిక, నైసర్గిక, లౌకికమైన ఏదైనా నియమాల వల్ల నియంత్రితులు కాకపోయినందువల్ల దీర్ఘకాయులైన రాజులు, దేవతలు కావడానికి బదులుగా దానవులు అయ్యే అవకాశం ఎంతైనా ఉంది. అందువల్లనే భారతీయ శాస్త్రకారులు రాజు ధార్మిక నియమాలకు కట్టుబడి ఉండడం ఆవశ్యకం అని చెప్పారు. బంధనాలు లేకపోతే ఒంటెలు, కళ్లెం లేకపోతే గుర్రాలు, బ్రేకులు లేకపోతే సైకిళ్లు – మోటారు యంత్రాలు ఎలాగైతే ప్రమాదకారులు అవుతాయో... అలాగే నియంత్రణ లేకపోతే నిరంకుశులైన రాజులు ప్రపంచానికి ఒక శాపంగా మిగిలిపోయే అవకాశం ఉంది.

(వచ్చేవారం.. రాజసత్త – ప్రజాసత్త)

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ

కథ

ఈసారి రాఖిపౌర్ణమి శుక్రవారం అవ్వడంతో వారాంతపు సెలవులైన శనివారము, ఆదివారాము కలుపుకొని మూడు రోజులు వరుస సెలవులొచ్చాయి. దాంతో చాలా సంతోషంగా మా వూరికెళ్లాను. చెల్లాయితో రాఖీ కట్టించుకుని తనకి బట్టలు కొనిచ్చాను. కొండ మీద శివాలయానికి ఒకరోజు, సినిమాకోకరోజు వెళ్లొచ్చాము, ఈ రోజు పొద్దున్నే నగరానికి వచ్చిన నాకు, మూడు రోజులు మూడు చిటికెల్లో గడిచిపోయి నట్టనిపించింది. ఆఫీసులో పొద్దున కాఫీ బ్రేకులో స్నేహితులం కలుసుకొని కాఫీలు తాగుతూ ముచ్చట్లు పెట్టుకోవడం అలవాటు. క్యాంటిను దగర నాకన్నా ముందొచ్చిన మనోహర్ కనపడ్డాడు. ఈ లోపల "ఎలా ఉన్నారంతా?" అంటూ వస్తున్న గౌరి గొంతు వినపడింది. గౌరీశంకర్ ప్రాజెక్ట్ పనిమీద ఈజిప్ట్ వెళ్లి శనివారమే దేశానికి తిరిగి వచ్చాడు. ఎక్కడెక్కడ తిరిగివచ్చినా ఎవ్వరికైనా ఇల్లే కదా స్వర్గం, చాలా ఆనందంగా కనపడుతున్నాడు. వస్తూనే అక్కడ తాను చూసిన ప్రపంచ అద్భుతాలలో ఒకటైన గిజా పిరమిడ్ గురించి, తాను వాటిని చూని ఎలా ఆశ్చర్యపోయాడో అంతా వివరిస్తున్నాడు.

ఇంతలో నేనందుకుని "అది బహుశా మానవుడు శాశ్వతంగా నిలిచిపోవాలన్న కలకు అత్యంత ఎత్తైన ప్రతిరూపమేమో" అంటూ, గిజా పిరమిడ్ క్రీ.పూ. 2600 ప్రాంతంలో, ఫారో 4వ రాజవంశం కాలంలో పాలించిన ఖుఫూ అనే ఫారో సమాధి అని, పిరమిడ్ లోపల పెద్దపెద్ద సొరంగాలు, కింగ్స్ ఛాంబరు, క్వీన్స్ చాయిర్లని ఉంటాయని, ప్రస్తుతం దాని ఎత్తు 454 అడుగులని, పక్కనే ఉన్న పిరమిడ్ 448 అడుగులు, మూడవది 344 అడుగుల ఎత్తు ఉంటాయని, వాటి నాలుగు ముఖాలు నాలుగు దిక్కులకు సరిసమానంగా ఉండేట్టుగా కట్టారు అని, ఆ మూడు పిరమిడ్లు ఆకాశంలోని ఓరియన్ కాన్స్టెలేషన్ మూడు నక్షత్రాలలో సమాంతరంగా ఉండేవిట అనంటూ ఆపకుండా చెప్తూ పోతున్నాను. అప్పుడు గౌరి "ఓహ్ నువ్వూ వెళ్లచ్చావా శివా?", అని అడగడంలో నేనాగిపోయి, "నేనెప్పుడూ వెళ్లలేదు గౌరీ" అన్నాను. అది విని మనోహర్ చాలా ఆశ్చర్యపోతూ "మరి ఈజిప్ట్ చరిత్ర గూగుల్ అంత బాగా ఎలా చెప్పగలుగుతున్నారు మీరు? నాకు మన చరిత్ర అంతంత మాత్రంగా తెలుసు" అన్నాడు. నాకంటే చిన్నవాడైన మనోహర్ నెలక్రితమే పట్టానందుకుని, మా ఆఫీసులో కొత్తగా చేరాడు.

అప్పుడే నాకు అమ్మ నుంచి ఫోన్ వచ్చింది. అమ్మ ఫోన్‌కి కారణం గ్రహించిన నేను, "అమ్మా రైలు గంట ఆలస్యంగా చేరింది, ఆఫీసుకు టైమై పోవడంలో గబగబా తయారయ్యి వచ్చేసాను ఫోన్ చెయ్యడం కుదరలేదమ్మా" అన్నాను.

"నేనది అనుకున్నానులే నాన్న! ఈ సమయంలో ఖాళీగా ఉంటావేమో నీకో రెండు విషయాలు చెబుదామని చేస్తానురా. నాలుగు రోజుల్లో కృష్ణాష్టమి కదా! చిన్నప్పుడు కృష్ణాష్టమి ఉట్టి కొట్టడంలో ఎప్పుడూ నీది పైచెయ్యి, వీలుచూసుకుని అక్కడేక్కడైనా వేడుకల్లో పాల్గొను. అదయ్యాక ఇరవై రోజుల్లోనే వినాయకచవితి, మొన్నే ఊరెళ్లొచ్చాను మళ్లీ ఏం వెళ్తానులే, అని చవితిపండక్కి రావడానికి బద్ధకించకు నాన్న. ఇప్పుడే మన ఊరికి టిక్కెట్లు కొనేసుకో. ఈ మాట చెబుదామనే చేసాను" అంది అమ్మ.

"అమ్మా ఈసారి వినాయకచవితి బుధవారం వచ్చింది. తరువాత రెండు రోజులూ సెలవుపెడితే కానీ ఊరికి రాలేను, నాకు సెలవు దొరకక పోవచ్చమ్మా, ఇక్కడే పూజ చేసేసుకుంటాలే" అంటూ కాలెండర్ చూస్తూ తేల్చి చెప్పేసాను. నా మాటలు విని అమ్మ "అయ్యో అదేంట్రా రానంటున్నావు? ఇది నాకేం నచ్చదం లేదురా, బాధగా కూడా వుంది, నీ ఇష్టం మరి", అనేసి ఫోన్ పెట్టేసింది.

ఈలోగా గౌరీ తన ఒంటె సవారీల గురించి, పిరమిడ్ ఎత్తులు, అందులోని సొరంగాల లోతులూ, వాటిని కట్టిన రాళ్ల బరువుల గణాంకాలు చెప్తూ "అక్కడిప్పుడు ప్రాచీన ఈజిప్ట్ ఆచార వ్యవహారాలు, నమ్మకాలు పాటించేవారు కానీ, ఆ ప్రాచీన దేవుళ్లను పూజించేవారు కాని ఎవ్వరూ లేరుట. అక్కడిప్పుడు నివసిస్తున్నవారు అప్పటి నాగరికతకు వారసులూ కాదుట, అక్కడి భూములకు కట్టడాలకు మాత్రమే వారు వారసులుట. అంతటి గొప్ప ప్రాచీన నాగరికత లుప్తమైపోయింది. ఎక్కువ శాతం ఇస్లాం మతస్తులు, చాలాతక్కువ శాతం క్రిస్టియన్లు ఉంటారుట. ఇతర దేశస్తులలాగానే వారిలో కొందరు ఆ పురాతన పిరమిడ్ల నిర్మాణ రహస్యాల మీద పరిశోధిస్తున్నారుట. వారినే ఈజిప్టులో జను అని అంటారుట" అని చెప్తున్నాడు గౌరీ.

అది విని, ఆ నాగరికత, ఆ అద్భుత కట్టడాలు, ఆ విజ్ఞానం, ఎవర్ని మాత్రం ఆకర్షించవు? అని అనుకుంటున్న నాకు వెంటనే మా గోపాలం మాష్టారు గారు గుర్తొచ్చారు. రెండు నిమిషాల పాటు వారి గురించి ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాను. "ఏంటి అలా అకస్మాత్తుగా ఆలోచనలో పడ్డారు?" అనడిగాడు మనోహర్.

నేను వర్తమానంలోకి వచ్చి, "మా గోపాలం మాష్టారు గుర్తొచ్చారు మనోహర్, వారు మాకు చరిత్ర చెప్పేవారు...కాదు కాదు చరిత్రను మా కళ్లెదుట నిలిపేవారు. అంతేకాదు మమ్మల్ని తమతోపాటు టైంమెషన్లో కూర్చోబెట్టుకుని ఆయా కాలాల్లోకి తీసుకుని వెళ్లిపోయేవారు అని అనాలి. అసలు నా మీద వారి ప్రభావం ఎంత ఉందంటే... బి.టెక్‌లో కాకుండా యూనివర్సిటీలో చేరి ఎం.ఏ చరిత్ర చదవాలి ఎన్నోసార్లు నేను అనుకునేవాణ్ణి. నాన్న లేని మా ఇంటి బాధ్యత గుర్తొచ్చి. ఆ చరిత్ర తల్లి, నాకు కావల్సినంత డబ్బు ఇవ్వగలదన్న నమ్మకం కుదరక, ఆవిణ్ణి క్షమించమని ప్రార్థించేసి ఆ ఆలోచనకి స్వస్తి పలికేశాను, ఇంజనీరింగు చదివి, ఇప్పుడు నెలకి ఆరు అంకెల జీతం సంపాదించేస్తూ ఇక్కడ ఉన్నాను." అని అన్నాను.

"మీ గోపాలం మాష్టారు గారి ప్రభావం నిజంగా మీమీద అంతుందా? ఇంతకీ ఆయన చరిత్ర ఎలా చెప్పేవారు?" అడిగాడు మనోహర్. విరామ సమయం అయిపోవడంతో తర్వాత "మాట్లాడుకుందాం" అనుకుంటూ మా విభాగాల్లోకి వెళ్లిపోయాము.

నేనూ మనోహర్ ఒకే ఇంట్లో ఉంటున్నాము. రాత్రి భోజనాలయ్యాక మనోహర్ నాతో గోపాలం మాష్టారు గురించి. తెలుసుకోవాలనుందండి అనడిగాడు ప్రెష్ మనోహర్. అతనిలాంటి చాలా మంది చరిత్ర అంటే 1857, 1869, 1912... అంటూ సంవత్సరాలు గుర్తుపెట్టుకోవడం అనో, అక్బర్. అశోకుడు, గాంధీ, నెహ్రూ... లాంటి పేర్లు గుర్తు పెట్టుకోవడం అనో, మంచి మార్కులు తెచ్చిపెట్టగలిగే శక్తివంతమైన అంశం అనో అనుకుంటుంటారు. అటువంటి అతను తిరిగి ఆ ప్రస్తావన తెస్తాడు అని నేనస్సలు ఊహించలేదు. బహుశా పొదుటి ఈజిప్ట్ కబుర్ల ప్రభావేమో! నాకెందుకో చాలా సంతోషం వేసింది.

చరిత్ర అంటే అది కాక మరేంటి? నేను గోపాలం మాష్టారు గురించి చెప్పడం మొదలు పెట్టాను. "మాష్టారు మా బడికి దగ్గర్లోనే పెద్ద

బంగళాలో ఉండేవారు. సెలవు రోజుల్లోనో, కొన్ని కొన్ని పాఠాలు చెప్పేటప్పుడో మమ్మల్నందరిని వారింటికి రమ్మనేవారు. మాకదో ఆట విడుపు. రంగు పెన్సిళ్లు రంగు కాగితాలు, కీలుగుర్రాలు, పక్షుల ఈకలు, ఉత్తరీయాల, పల్లీలు, చేగోడీలు ఇలా ఏవేవో తీసుకుని ఎంతో ఉత్సాహంగా వెళ్లేవాళ్లం. వారు ప్రపంచచరిత్రపై, మన దేశచరిత్రపై మాతో నాటకాలు వేయించేవారు. అందులో చక్ర వర్తులు, రాజులు, సైనిక పాత్రలు మాకు వంతుల వారీగా వచ్చేవి. పాత్రని బట్టి తలపైన ఈకలో, ఇత్తడి చెంబు కిరీటాలో, తలపాగాలో పెట్టేసుకొని యూరోపు, అమెరికా చరిత్రలు, సిక్కు రాజులు, జలి యన్వాలా బామ్, 1857 తిరుగుబాటు. ఇలాంటి వెన్నో నాటకాలు వేసేవాళ్లం. ఈరోజున ఆలోచిస్తుంటే మేము చరిత్ర నేర్చుకోడానికి ఆటలా ఆడుకున్నామా లేక 5000 సంవత్సరాల నుంచి జీవించే ఉన్నామా అనిపిస్తోంది.

ఈజిప్ట్ నాగరికత పాఠాన్ని మేమలాగే నేర్చుకున్నాము. మా నాటకంలో డాబాపైన ఈజిప్ట్ ఫారో రాజ్యమైతే, కింద పొరుగుదేశపు రాజు రాజ్యం, వారి మధ్య రహస్య సందేశాలు చేరవేసే బంటు, అతని రక్షణ కొరకు ముందు ఇద్దరు వెనక ఇద్దరు రక్షక భటులు. ఈజిప్ట్ వారు అయిదు వేల సంవత్సరాల క్రితం, పేడ పురుగు ఆకారంలో చిన్న తాయత్తులంత ఉండే బంక మట్టి బిళ్లల ద్వారా అంతర్జాతీయ సందేశాలు పంపించుకునేవారట. ఆ బిళ్లని స్కరాబ్ అని అంటారుట. ఈజిప్టువారు పాపరీలు అని పిలిచే చుట్టచుట్టిన పాపిరస్ కాగితాల్లో జీవిత చరిత్రలు, మ్యాపులు, గణిత, వైద్య బోధనలు ఉండేవిట. అవన్నీ మా ఆటల్లో భాగంగా

సృజనాత్మకంగా మాతోనే రాయించేవారు గోపాలం మాస్టారుగారు. మేమే పిరమిడ్లు ఎలా కట్టాలి అంటూ సలహా సంప్రదింపులు చేసుకునేవాళ్లం. లెక్కలూ కట్టేవాళ్లం. స్కరాబ్ బిళ్లలు, చీపురు పుల్ల బాణాలు, ధనుస్సులు, అట్టల మద గిసిన ఆటలు... ఆనాడు ఫారో చక్రవర్తులు సమాధుల్లో దాచినట్టుగా, డాబామెట్లనే పరమిడ్ అంతర్భాగంగా భావించి దాచేవాళ్లము. ఇప్పుడా ఈజిపై నాగరికత లేదు.

ఈమధ్య కొన్నేళ్ల క్రితం మాస్టారుగారిని కలిసినప్పుడు, ఆయనలో మాట్లాడుతూ "కొన్ని నాగరికతలు పూర్తిగా లుప్తమవ్వడం బాధాకరం! చాలా దురదృష్టకరం కూడా! దానిక్కారణం ఆప్పటి మతాధిపత్య యుద్ధాలు, గెలిచి ఆక్రమించిన వారక్కడి చరిత్ర ఆనవాళ్లను ధ్వంసం చేసెయ్యడమే ముఖ్య కారణాలు కదండి" అన్నాను. మాష్టారుగారు ఆ మాటకి నాతో ఏమాత్రము ఏకీభవించలేదు. ఇంతలో టైమ్ చూసేసరికి పది దాటిసింది. ఆలస్యమై పోయింది ఇంక వడుకుందాం అనుకుంటూ ఇద్దరమూ లేచాము.

పదిరోజులయ్యాక అమెరికా నుంచి పని మీద మనదేశానికి వచ్చిన చంద్రం మామయ్య మేమిద్దర మున్న ఇంట్లోనే దిగాడు. ఇంతలో నగరమంతా వినాయకచవితి హడావిడి మొదలైంది. ప్రతివాళ్లూ విగ్రహాలు, పందిళ్లు, ట్రాఫిక్ ఆంక్షలు, లడ్డు వేలం పాటలు ఇవే కబుర్లు. గౌరి మా ముగ్గుర్ని వాళ్లింటికి వినాయకచవితి పూజకి, భోజనానికి పిలిచాడు. గౌరి వాళ్లన్నా వదినల వద్ద ఉంటాడు. మావయ్యతో గౌరి వండక్కి పిలిచినట్టూ, తాము అమ్మమ్మ తాతయ్య వాళ్లుండిన

శరణు

శిరీష మల్లికార్జున పండితారాధ్యుల



కాలనీలోనే ఉంటున్నారని చెప్పాను. మావయ్య ఒప్పుకోవడమే కాకుండా, ఎంతో సంతోషంగానూ ఆత్రంగానూ ఎదురుచూస్తున్నట్టుగా నా కనిపించింది. పండగనాడు త్వరగాలేచి తయారై పోయి వాళ్లింటికి బయలుదేరాము.

మావయ్య పైచదువులకని అమెరికా వెళ్లడం, పెళ్లి చూపులకని వచ్చినప్పుడు మావయ్యే పట్టుబట్టి ఉన్న ఆస్తంతా తాతయ్యతో అమ్మించేయడం, కాలనీలోని ఇంటిని ప్లాట్లు చేస్తామంటూ వచ్చిన బిల్డర్లకి అమ్మేయడం, అమ్మమ్మ లేని ఇంటి నుంచి తాతయ్య చిన్న ప్లాట్లోకి మారడం, ఏడాదికల్లా ఆయన కన్ను మూయడం అన్ని వరుస ఘటనలు. ఆ కాలనీలోకి ప్రవేశిస్తూనే మావయ్య చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకోవడం, వట్టలేని ఆనందంతో మాట్లాడం, ఆయన కళ్లు చెమర్చడం, చూసి ఆశ్చర్యపోయాను.

గౌరి వాళ్లన్నయ్య ఉమాశంకర్ మామయ్య "ఈ కాలనీ... నగరంలోనే చాలా పెద్దది.. పాతదిరా శివా. లోనూ, శంభు జర్మనీలోను స్థిరపడ్డారుట" అంటూ చెప్పాడు.

ఉమాశంకర్ దంపతులు అమెరికాలోని సాఫ్ట్వేర్ ఉద్యోగాన్ని బదిలీ చేయించుకుని ఇక్కడ స్థిరపడాలనుకుని ఇటొచ్చేశారు. ఇద్దరికీ టైమ్ లేక వినాయకుడిని, పత్రిని ఆన్లైన్లో ఆర్డర్ చేసి తిప్పించుకున్నారు. ఇక భార్యాభర్తలు భక్తిగా చేస్తున్న పూజలో వాడుతున్న పేరులేని, పేరు తెలియని తెల్ల చుక్కల ఆకుపచ్చ, పసుపు, ఎరుపు రంగు ఆకులున్న క్రోటన్ పత్రిలో, దూర్వాయుగ్మం అనబడే ఒక్క సన్న గడ్డిపరక కూడా కనపడలేదు! మేముకూడా భక్తిగా వాటితోనే పూజ చేసేసుకున్నాము. నైవేద్యాలు, భోజనాలు అన్నీ సరిగ్గా సమయానికి కాటరింగ్ వాళ్లొచ్చేసి వెళ్లిపోయారు. భోజనాలయ్యాక మావయ్య "మా ఇల్లులేనే లేదు, మనం వెళ్లి శారదక్క వాళ్ల ఇల్లు చూసొద్దామా శివా" అన్నాడు. అప్పుడు ఉమాశంకర్ గారు "మీరు చెప్తున్న ఇల్లు కాలనీలో ఎక్కడా లేదండి, గుడిపక్కన ఇప్పుడు, స్విమ్మింగ్ పూల్, పెద్ద లాను, జిమ్, టెన్నిస్ కోర్టు....

అకస్మాత్తుగా ఆరోజు మాష్టారు నాగరికత లుప్తమవ్వడానికి ఆనవాళ్లు రూపుమాపేయడమే కారణం కదండి అని నేనంటే ఎందుకు నాతో ఏకీభవించ లేదో ఈరోజు అర్థమవుతున్నట్లుగా అనిపించింది. నాగరికతను భౌతికమైన ఆనవాళ్లొక్కటే కాపాడలేవు. దాన్ని కాపాడగలి గేది స్వార్థచింతన లేని మనుషులు! మాస్టారు గారు అంత శ్రమకోర్చి చరిత్ర పాఠాలు మాకెందుకు నేర్పేవారో, వాటినుంచి ఏమి నేర్చుకోవాలో అవగతమవుతున్నట్టుగా అనిపించ సాగింది.

ఇన్ని ఆపార్ట్మెంట్లు వచ్చేసరికి గుర్తు పట్టలేకుండా ఉన్నానురా" అన్నాడు. ఇంట్లోకొచ్చి కూర్చుంటూ, వినాయకచవితి పండక్కి మా అమ్మమావయ్య, కాలనీ పిల్లలందరితో కలిసి, పోటీలు వడి మట్టి వినాయకుళ్లను తయారుచెయ్యడం గుర్తుచేసుకున్నాడు. కాలనీలోని గుడిని ఆనుకుని లలిత పిన్నిగారి ఇల్లు, బోలెడు చెట్లలో చాలా అందంగా ఉండేదిట. ఆవిడ వినాయకచవితికి వాళ్ల పెరట్లోని దానిమ్మ, వెలగ, రేడు, ఉత్తరేణూ, మరువముం, తుమ్మి,జాజి, వావిలాకులు ఓపిగ్గా కోసి పొట్లాలుకట్టి, వాళ్ల పిల్లలు శారదక్కతో, శంభుతోఅందరిళ్లకు పంపించేవారుట. "పండుగనాడు పూజ, భోజనాలయ్యాక పిల్లలందరమూ అందరిళ్లకు వెళ్లి వినాయకుడి పద్యాలు చదివి, గుంజిళ్లు తీసి, ఉండ్రాళ్లు తిని, శారదక్కయ్యతో కీర్తనలు పాడిస్తే విని, చవితి కథ విని, రాత్రి చంద్రుణ్ణి చూడడానికి భయపడుతూ, అలసిపోయి ఇళ్లు చేరితేనే మా వినాయకచవితి పూర్తి అయినట్టు" అన్నాడు. మావయ్య. "శారదక్కయ్యకి డాక్టర్ సంబంధం కుదరితే పెళ్లయ్యాక అమెరికా వంటి ఆధునిక సదుపాయాలతో కట్టిన విలాసవంతమైన పెద్దిల్లుందండి" అని అన్నారు. అలాగా అని నిట్టూర్చాడు మావయ్య.

పొద్దుటినుంచి మావయ్య మాటలను, భావాలను చాలా దగ్గం నుంచి గమనిస్తున్న నాకు ఆ కాలనీలో, అందులోని ఇళ్లలో, అక్కడి మనుషులలో, కాల క్రమేణా వచ్చిన మార్పులను ఒకసారి ఒక చలన చిత్రంలో చూస్తునట్టుగా అనిపించింది. మేమంతా చేసుకున్న పూజలో భక్తి ఉన్నా, మా అవగాహనా రాహిత్యం నాకు ప్రస్ఫుటంగా కనపడింది. ఏ పత్రి ఏదో తెలిసిన మావయ్య ఆ పత్రి దొరకని, ఈ ఆచార వ్యవహారాలకి, సంబంధంలేని ప్రదేశానికి ఎప్పుడో వలస వెళ్లిపోయాడు. పూర్తిగా ఆధునికమైన ఉమాశంకర్, మనోహర్, గౌరీలు ఈ పండగ, దాని ప్రాముఖ్యతని తెలుసుకున్నందువల్ల వెంటనే కనపడే లాభనష్టాలేవి లేవు గనుక తెలుసుకునే ప్రయత్నం చెయ్యడంలేదు. దాన్ని అర్థం చేసుకోగల నేనిలా నిర్లక్ష్యంగా బతికేస్తున్నాను.

అకస్మాత్తుగా ఆరోజు మాష్టారు నాగరికత లుప్తమవ్వడానికి ఆనవాళ్లు రూపుమాపేయడమే కారణం కదండి అని నేనంటే ఎందుకు నాతో ఏకీభవించ లేదో ఈరోజు అర్థమవుతున్నట్లుగా అనిపించింది. నాగరికతను భౌతికమైన ఆనవాళ్లొక్కటే కాపాడలేవు. దాన్ని కాపాడగలిగేది స్వార్థచింతన లేని మనుషులు! మాస్టారుగారు అంత శ్రమకోర్చి చరిత్ర పాఠాలు మాకెందుకు నేర్పేవారో, వాటినుంచి ఏమి నేర్చుకోవాలో అవగతమవుతున్నట్టుగా అనిపించ సాగింది. ఆలోచిస్తే వాస్తవానికి 5000 సంవత్సరాల పూర్వపు ఈజప్టు చరిత్రంతా మనకప్పుడు చెప్పింది భౌతిక ఆనవాళ్లయిన శవపేటికలు, సమాధిగోడలు, వాటిపైన రాసిన రాతలు, వేసిన బొమ్మలు, తవ్వకాలలో బయటపడ్డ బంకమట్టి బిల్లటి కదా, అంటే... అనవాళ్లున్నా నాగరికత లుప్తమైపోయింది అన్న మాటేగా! ఆ ఎత్తైన పిరమిడ్ల నుంచి చిట్టిచిట్టి స్కరాబ్ల వరకు ప్రాణం లేకపోయినా మనకి ఈ విషయన్నే చెప్పాలని చూస్తున్నాయేమో. అనవాళ్లయిన మేము ఎంత చరిత్రనైనా చెప్పగలము. కాని మంచి నాగరికత కొనసాగాలంటే వారాసులుండాలి అని వాపోతున్నాయేమో! మనము వాటి మూగభాషను అర్థం చేసుకోలేక పోతున్నామన్న మాట! వారసులనే వాళ్లు ఒక ఇంట్లోనో, ఒక దేశంలోనో, ఒక నాగరికత లోనో పుట్టి, భౌతికమైన సౌందర్యము, ఆస్తులు అంతస్థులు, ప్రకృతి సంపదల వంటి వాటినే వారసత్వంగా అందుకోవడమూ అందివ్వడమే కాదు. వాళ్లు లోభమోహాలు, స్వార్థచింతన, అలసత్వము, అవగాహనారాహిత్యాలనే ఉచ్చులలో ఇరుక్కు పోకుండా నాగరికత తాలూకు ఆచార వ్యవహారాలను తామందుకుని తరువాత తరాలకి అందివ్వాలి.

నాకెప్పుడూ సనాతన భారతీయ నాగరికతలోని సంస్కృత సంప్రదాయాలన్ని సమస్త లోకానికి, జీవులకి, ప్రకృతికి అనుకూలవతమైన అత్యుత్తమమైన పద్ధతులనిపిస్తాయి. అటువంటి నాగరికతను, వేషభాషలను, జీవనశైలిని, రూపుమాపేయాలని ఎన్నో దాడులు, దండయాత్రల జరిగాయి. అయినా మా అమ్మలాంటి ఎందరో అమ్మలు, గోపాలం మాష్టారులాంటి ఎందరో మాష్టారులు, పటిష్టమైన పునాదిరాళ్లలా నిలబడి కాపాడడంతో మన నాగరికత చెక్కుచెదరలేదు. సదవగాహనతో, తమదైన శైలిలో ఈ నాగరికతను వారసత్వముగా ముందుతరాలకు అందిస్తూ, తమలాంటి వారాసులను తయారుచేయడానికి నిరంతరం కృషిచేసి అమ్మ, మాష్టారుగారు లాంటి వారు ఏ నాగరికతకైనా నిజమైన వారసులు. ప్రస్తుతం ప్రపంచీకరణలో వచ్చిపడుతున్న ఆధిపత్య సంస్కృతుల నుంచి మహోన్నత భారతీయ నాగరికత ఉనికిని కాపాడడం పట్ల నా కర్తవ్యం అర్థమైనట్టనిపించింది. తెలిసేట్టు బొజ్జగణవతికి మొక్కి గుంజిళ్లుతీసి నేనూ ఒక నిజమైన వారసుణ్ణి అవ్వాలని నిర్ణయించుకున్నాను. ★

ప్రపంచ 'క్రికెట్' పెద్దన్న భారత్!

భారత క్రికెట్ వెలిగిపోతోంది. ఆటలోనే కాదు ఆర్జనలోనూ భారత జట్లతో పాటు భారత క్రికెట్ నియంత్రణమండలి అగ్రగామిగా నిలిచింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా రూపుదిద్దుకోబోతున్న మన దేశాన్ని 'వికసిత భారత్'గా తీర్చిదిద్దటానికి ప్రధాని నరేంద్ర మోదీ దీర్ఘకాలిక లక్ష్యాలతో ఓవైపు కసరత్తులు చేస్తుంటే.. మరోవైపు క్రికెట్ పరంగా భారత క్రికెట్ వ్యవస్థ పరిపూర్ణవికాసం లక్ష్యాన్ని చేరుకోగలిగింది.

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచే భారత్‌లో చిన్నాపెద్దా, ఆడమగా తేడా లేకుండా అందరూ అభిమానించే ఏకైక క్రీడ క్రికెట్.భారత్‌లో ఉన్నంతమంది క్రికెట్ అభిమానులు మరే దేశంలోనూ లేరంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు.

బ్రిటీష్ పాలకులతో మనదేశంలో కొన్నిదశాబ్దాల క్రితమే అడుగుపెట్టిన క్రికెట్ భారతీయుల అభిమాన, అత్యంత జనాదరణ పొందుతున్న క్రీడగా గుర్తింపు సంపాదించుకొంది. భారత నియంత్రణమండలి ప్రణాళికలకు క్రికెటర్ల కష్టానికి ప్రపంచీకరణతో వచ్చిన పెనుమార్పులు జతకావడంతో గత రెండు దశాబ్దాలలో క్రికెట్ ఎంతో ఎదిగిపోయింది. ప్రపంచ క్రికెట్‌కే ప్రధానకేంద్రంగా, దిక్సూచిగా నిలిచింది. ప్రస్తుత అంతర్జాతీయ క్రికెట్ భారత చుట్టే తిరుగుతుందన్నా అతిశయోక్తిలేదు.

ఐసీసీకి ఆయువుపట్టు భారత్.....

ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలలో క్రికెట్ అభివృద్ధికి, ఉన్నతికి పాటు పడుతున్న ఐసీసీ (అంతర్జాతీయ క్రికెట్ మండలి)కి సమకూరుతున్న ఆదాయంలో ఒక్క భారత్ నుంచే 70 శాతం వరకూ ఉంది. మిగిలిన (ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, వెస్టిండీస్, అమెరికా)దేశాల నుంచి ఐసీసీకి వస్తున్న ఆదాయం 30 శాతం మాత్రమే. భారత్ ప్రాముఖ్యతను గుర్తించిన ఐసీసీ.. ప్రతి రెండో ప్రపంచకప్‌ను భారత్ వేదికగా నిర్వహించడానికే మక్కువ చూపుతోంది. భారత పుణ్యమా అంటూ వివిధ దేశాలలో క్రికెట్ బలంగా వేళ్లూనుకోగలుగుతోంది.

ఐసీసీ ఆదాయంలో సింహభాగం భారత్ కే...!

పురుషుల, మహిళల విభాగాలలో ప్రపంచకప్ టోర్నీలు నిర్వహించడంతో పాటు ఇతర కార్యక్రమాలు, స్పాన్సర్ షిప్‌లు, ఎండార్స్ మెంట్ల ద్వారా ఐసీసీకి ఏటా లభించే ఆదాయంలో సింహభాగం భారత క్రికెట్ బోర్డుకే వస్తోంది.

భారత్ నుంచి 70 శాతం ఆదాయం ఐసీసీకి సమకూరుతుంటే.. ఐసీసీలోని మిగిలిన సభ్యదేశాలకు 60 శాతం, భారత్‌కు 40 శాతం వాటాగా అందుతోంది. 2024 నుంచి 2027 సంవత్సరాల కాలానికి భారత్ వాటాగా ఐసీసీ రూ. 2వేల 79 కోట్లు చెల్లించనుంది. ఈ మొత్తం ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, పాకిస్థాన్, న్యూజిలాండ్, శ్రీలంక, వెస్టిండీస్, బంగ్లాదేశ్ బోర్డులకు వాటాగా అందుతున్న ఆదాయం కంటే ఎక్కువ. ఐసీసీ నుంచి వాటాగా దక్కే భారీ మొత్తంతో పాటు.. ఏటా నిర్వహించే ఐపీఎల్ టీ-20 లీగ్ నిర్వహణ ద్వారా లభించే మొత్తాన్ని కలిపితే మన బీసీసీఐ ప్రపంచంలోనే అత్యంత భాగ్యవంతమైన క్రికెట్ బోర్డుగా నిలువ గలిగింది.

భారత క్రికెటర్లతో పాటు భారత క్రికెట్ వ్యవస్థతో ప్రత్యక్షంగా, పరోక్షంగా అనుబంధం ఉన్నవారు సైతం అత్యధిక కాంట్రాక్టులు, వేతనాలతో కోట్లకు పడగలెత్తగలుగుతున్నారు.

భారత్- పాక్ పోరు విలువ 2200 కోట్లు...

క్రికెట్లో చిరకాల ప్రత్యర్థులుగా పేరుపొందిన భారత్, పాకిస్థాన్ తలపడుతున్నా యంటే ఐసీసీకి పండుగేనని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 2026 టీ-20 ప్రపంచకప్‌లో భాగంగా భారత్- పాక్ జట్ల మధ్య కొలంబో వేదికగా జరిగిన గ్రూప్ లీగ్ పోరు విలువ 2వేల 200 కోట్ల రూపాయలుగా విలువ కట్టారు. ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాలకు ప్రసారమైన ఈ మ్యాచ్ ద్వారా ఐసీసీకి 200 నుంచి 250 మిలియన్ డాలర్లు (రూ.1800 కోట్ల నుంచి 2200 కోట్లు) సమకూరనున్నాయి. ఐసీసీ ఆదాయంలో పాకిస్థాన్ వాటా 5.75 శాతం (310 కోట్ల రూపాయలు) మాత్రమే.

ఆర్జనలోనే కాదు... ఆటలోనూ మేటి భారత్!

భారత క్రికెట్ బోర్డు కేవలం ఆర్జనకే పరిమితం కాలేదు. తనకు లభిస్తున్న అపరిమిత ఆదాయంతో దేశంలోని క్రికెట్ వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు.. దేశవాళీ నుంచి అంతర్జాతీయ క్రికెటర్ల వరకూ కాంట్రాక్టులు, మ్యాచ్ ఫీజులను గణనీయంగా పెంచడం ద్వారా ఆర్థికస్థిరత్వాన్ని తీసుకువచ్చింది. దీనికితోడు జూనియర్ స్థాయి నుంచే అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పేలా చర్యలు తీసుకొని ఆశించిన ఫలితాలను రాబట్టుకోగలుగుతోంది.

2024 ఐసీసీ టీ-20 ప్రపంచకప్‌తో పాటు ఇటీవలే ముగిసిన ఐసీసీ మహిళా వన్డే ప్రపంచకప్, ఐసీసీ బాలుర అండర్ -19 ప్రపంచకప్‌లను సైతం భారత్ కైవసం చేసుకోగలిగింది.అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం నుంచి దేశంలోని పలు నగరాలలోని క్రికెట్ స్టేడియాలను ప్రపంచ ప్రమాణాలతో తీర్చిదిద్దడంలో బీసీసీఐ ప్రధానపాత్ర పోషించింది.

పురుషులతో సమానంగా మహిళా క్రికెటర్లకు సైతం మ్యాచ్ ఫీజులు, శిక్షణ సదుపాయాలు కల్పిస్తూ ప్రపంచ క్రికెట్‌కే ఆదర్శంగా నిలుస్తోంది. ఇదంతా చూస్తుంటేభారత క్రికెట్.. వికసిత భారత క్రికెట్ గా పరిణామం చెందటం అభినందనీయం, గర్వకారణం.!

కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

ప్రతిష్టిత వ్యక్తులు సమాజాన్ని జాగృతం చేయాలి

ఇందూరు : హిందూ సమాజాన్ని జాగృతం చేయడంలో సమాజంలోని ప్రతిష్ఠిత వ్యక్తుల పాత్ర అత్యంత కీలకమైందని అందుకే దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా అన్ని ప్రముఖ నగరాలలోని హిందూ సమాజానికి చెందిన ప్రతిష్ఠిత వ్యక్తుల సమ్మేళనాలను నిర్వహిస్తున్నదని ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ ధర్మజాగరణ సహ సంయోజక్ ఏలే శ్యాంకుమార్ అన్నారు.

సమాజంలోని అన్ని రంగాలలో ప్రతిష్ఠిత వ్యక్తులుగా ఉన్నవారు తమ రంగాల లోని ప్రజలకు వాస్తవాలను వివరించి దేశభక్తి ఆవశ్యకతను హిందూ సమాజ సంఘటన ఆవశ్యకతను తెలపడం తక్షణ అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందూరు విభాగ్ సహ సంఘచాలక్ పాలేటి వెంకట్రావు, జిల్లా సంఘచాలక్ డాక్టర్ కాపర్తి గురుచరణం తదితరులతోపాటు 231మంది హాజరయ్యారు.

కరీనగర్

మనం ఎవరికీ వ్యతిరేకం కాదు

వరంగల్

కరీనగర్,వరంగల్ : సంఘం ఎవరికీ వ్యతిరేకం కాదు, ప్రతి ఒక్కరూ దేశాన్ని ప్రేమించాలని, దేశ ఉన్నతికి పనిచేయాలని కోరుకుంటుందని, సంఘాన్ని అర్థం చేసుకోవటం కష్టం, అపార్థం చేసుకోవటం సులువు అని, దేశ ప్రజల ఆదరాభిమానాలు చూరగొని వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్ అని ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ కార్యకారిణి సభ్యులు రాంమాధవ్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సంఘం ఏం చేయనున్నదనే విషయాన్ని సమాజంలోని ప్రతిష్ఠిత వ్యక్తులకు తెలియజేయటమే ఈ కార్యక్రమ ఉద్దేశమని అన్నారు.

సంఘ శతాబ్ది ఉత్సవాలలో సందర్భంగా ఫిబ్రవరి 17న కరీనగర్, 18న వరంగల్‌లలో జరిగిన ప్రతిష్ఠిత వ్యక్తుల కార్యక్రమంలో ఆయన ఉపన్యసించారు. కరీనగర్‌లో సహసంఘచాలక్ డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, జిల్లా సంఘ చాలకులు నిరంజనాచారి,జిల్లా సహసంఘచాలకులు ఎలగందుల సత్యనారాయణ తదితరులతోపాటు 368 మంది పాల్గొన్నారు. వరంగల్‌లో విభాగ్ సంఘచాలక్ ఆచార్య చిలకమారి సంజీవ, మహానగర్ సంఘచాలక్ డాక్టర్ బందెల మోహన్‌రావులతోపాటు నగరంలోని ప్రముఖులు 390మంది ఉపస్థితులయ్యారు.

సంఘంతో కలసి నడుద్దాం

సంగారెడ్డి : ప్రతిష్ఠితవ్యక్తుల సమావేశం సంగారెడ్డి జిల్లా, బీరంగూడ నగరంలో ఫిబ్రవరి 14న జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ ప్రసంగిస్తూ సంఘ స్థాపన, విస్తరణ, సంఘం చేస్తున్న సేవలు, సంఘం లక్ష్యాన్ని తెలుపుతూ, సంఘంతో కలసి నడుద్దాం అన్నారు. ఇందులో విభాగ్ సంఘచాలక్, తెలంగాణ ప్రాంత కుటుంబ ప్రబోధన్‌ప్రముఖ్ పట్లోళ్ల మురళీధర్‌రెడ్డితోపాటు 64 మంది విచ్చేశారు.

సంత్ రవిదాస్ బోధనలను ఆచరించాలి

భాగ్యనగర్ : చర్మకార వృత్తిని నిబద్ధతతో ఆచరిస్తూ కూడా భగవన్నామస్మరణ మరువని మహనీయుడు సంత్ రవిదాస్ అని, వేద ధర్మమే తన సిద్ధాంతంగా భావించి తన జీవితాన్ని పరిపూర్ణం చేసుకున్న మాననీయుడు సంత్ రవిదాస్ మార్గంలో అందరం నడవాలి. నేటి కాలంలో ఇంకా అక్క డక్కడా కులవివక్షత పాటిం చటం దారుణమని, అతని బోధనలను నేటితరం ఆచ రించి, వివక్షత లేకుండా, సామరస్యంగా జీవించాలని ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. ఫిబ్రవరి 22న సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్ కేశవ మెమోరియల్‌లో జరిగిన సంత్ రవిదాస్ 650 జయంతి ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మార్గదర్శనం చేశారు.

ఈ ఉత్సవాలు సంవత్సరంపాటు దేశమంతా జరపాలని సామాజిక సమరసతా వేదిక నిర్ణయించింది. ఈ సందర్భంగా సంత్ రవిదాస్ చిత్ర పటాలు, వారి జీవిత చరిత్రతో కూడిన పుస్తకాన్ని విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో వేదిక జాతీయ కళావిభాగం కన్వీనర్ అప్పాలప్రసాద్, వేదిక రాష్ట్రసమితి అయామ్ ప్రముఖులు, రాష్ట్రం నలుమూలల నుండి 150 కుటుంబాలు, మోచి (చర్మకారులు) బంధువులు 100మంది, 10 జిల్లాల నుండి కార్యకర్తలు మొత్తం 400మంది పాల్గొన్నారు.

విజయవాడలో గాడ్గే బాబా విగ్రహావిష్కరణ

విజయవాడ: సంత్ గాడ్గేబాబా సామాజిక స్పృహతో జీవితాంతం పరిశుభ్రతకోసం పనిచేసి అనేకమందికి ఆదర్శవంతంగా నిలిచారని, భారతదేశంలో ప్రతి ఒక్కరు గాడ్గేబాబా ఆదర్శంగా తీసుకోవాలని స్వామి శితి కంఠానంద స్వామీజీ అన్నారు తెలిపారు. సామాజిక సమరసత వేదిక విజయవాడ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ గులాబీతోట పార్క్‌లో ఇటీవల జరిగిన సామాజిక ఉద్యమకర్త సంత్ గాడ్గేబాబా విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్వామిజీ పాల్గొని మార్గదర్శనంచేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత సామాజిక సమరసత వేదిక కన్వీనర్ శ్యాంప్రసాద్, కొండపల్లి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. కొండపల్లి చిన్ని మాట్లాడుతూ మహనీయుని విగ్రహం రాష్ట్రంలో తొలిసారిగా విజయవాడలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేయడం గర్వంగా ఉందన్నారు. శ్యాంప్రసాద్ మాట్లాడుతూ వివక్షకు గురైన వర్గాలవారు దేవాలయాల ప్రవేశాలకు నోచుకోని సమయంలో వారికి దేవాలయాల ప్రవేశం కల్పించడానికి అనేక ప్రయత్నాలు చేసి బాబా సఫలీకృతం అయ్యారని అలాగే జాతిపిత గాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్ సమకాలికుడిగా అనేక విద్యాలయాలు మహారాష్ట్రలో గాడ్గే బాబా నిర్మించారని తెలియజేశారు.

కామారెడ్డి: సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19న "సంచార జాతులు – సమగ్ర సర్వే" పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కామారెడ్డి శాసనసభ్యులు కటిపల్లి వెంకట రమణారెడ్డి. ఈ కార్యక్రమంలో వేదిక జాతీయ కళావిభాగం కన్వీనర్ అప్పాలప్రసాద్, ఇందూరు విభాగ్ ప్రముఖ్ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి : సంచార తెగల సంక్షేమసమితి ఆధ్వర్యంలో సంచార తెగల గర్భిణిలకు హిందూసంప్రదాయ పద్ధతిలో సీమంతం ఫిబ్రవరి 20న కొత్తకోట అచల గురు ఆశ్రమంలో జరిగింది. ఆశ్రమ పీఠాధిపతి ధూపంసాంబశివుడు, సమితి సంఘటన మంత్రి సువీర్, వనపర్తి జిల్లా వైద్యబృందం, 150మంది గర్భిణులు పాల్గొన్నారు. వారికి తగు సలహాలు ఇచ్చి, వైద్యపరీక్షలు నిర్వహించి మందులను ఇచ్చారు.

కోతి గొప్పలు

కథ

ఒకరోజు కొందరు నావికులు సముద్రయాత్రకు బయలుదేరారు. తమతోపాటు తమ పెంపుడు కోతిని వెంటబెట్టుకుని యాత్రను మొదలెట్టారు. వారు సముద్రం మధ్యలో ఉండగా ఒక భయంకరమైన ఉప్పెన వచ్చింది. ఆ ఉప్పెన ధాటికి అందరూ సముద్రంలోకి కొట్టుకుపోయారు. కోతి కూడా తాను మునిగిపోయానని అనుకునే సమయంలో ఒక డాల్ఫిన్ వచ్చి కోతిని తన వీపుపై ఎక్కించుకుంది.

కోతి, డాల్ఫిన్ ఇద్దరూ సురక్షితంగా ఒక దీవికి చేరుకున్నారు. కోతి.. డాల్ఫిన్ వీపు మీది నుండి దిగి ఒడ్డుపై కూర్చుంది. డాల్ఫిన్... కోతితో, "మిత్రమా! నీకు ఈ ప్రదేశం తెలుసునా?" అని అడిగింది. అపాయం నుంచి గట్టెక్కి సురక్షితంగా ఉన్నానని రూఢీ చేసుకున్న కోతి, "ఈ ప్రదేశం నాకు తెలియక పోవడం ఏమిటి? ఈ దీవిని పరిపాలించే రాజు నాకు మంచి స్నేహితుడు. నీకొక విషయం తెలుసో లేదో! నేను కూడా ఒక రాజకుమారుడిని." అంటూ గొప్పలు చెప్పుకుంది.

ఆ దీవిలో ఒక్క జీవి కూడా నివసించదని తెలిసిన డాల్ఫిన్‌కు చిర్రెత్తుకొచ్చినా సంయమనంతో "ఓహో! నువ్వు రాజకుమారుడివి. కాని ఇప్పటి నుంచి నువ్వు రాజువన్నమాట!" అంది. కోతికి డాల్ఫిన్ మాటలు అర్థం కాక "నేను రాజునెలా అవుతాను?" అని అడిగింది డాల్ఫిన్‌ను. ఒడ్డు నుంచి కోతికి అందకుండా దూరంగా వెళ్లిన డాల్ఫిన్. "చాలా సులభం. ఈ దీవిలో ఉన్న జీవివి నువ్వొక్కడివే కాబట్టి నీవే ఈ దీవికి రాజువు" అని సమాధానమిచ్చి కోతిని ఆ దీవిలోనే వదిలి వెళ్లిపోయింది. ★

మంచిమాట

స్నేహాన్ని నటించే మోసగాడి కన్నా
ద్వేషాన్ని వెల్లడించే శత్రువు మేలు

మెదడుకు మేత

పచ్చపచ్చని తోటలో ఎర్ర
ఎర్రని దొంగలు.. ఏమిటది?

పద్యం

వేము పాలుపోసి ప్రేమతో బెంచిన
చేదువిరిగి తీపజెందబోదు
ఓగు నోగెగాక యుచితజ్ఞు డెటులౌను
విశ్వదాభరామ! వినురవేమ!

భావం : వేప చెట్టుకి పాలు పోసి పెంచినప్పటికి చేదు పోయి తీపెక్కదు. అదే విధంగా చెడ్డవాడు చెడ్డవాడే కాని మంచివాడు కాలేడు.

శ్లోకం

జలే తైలం ఖలే గుహ్యం
పాత్రే దానం మనాగపి!
ప్రాజ్ఞే శాస్త్రం స్వయం
యాతి విస్తారం వస్తుశక్తితః!!

భావం : నీటిలో నూనె, మూర్ఖుడిలో రహస్యం దాగదు. యోగ్యులు దొరికితే దాతలు దానగుణం మానరు. అలాగే పండితునిలో శాస్త్రం స్వయంగా విస్తరిస్తుంటుంది.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

జపాన్	డ్యూమా
రష్యా	డైట్
ఇజ్రాయెల్	షోరా
అఫ్ఘనిస్తాన్	నెస్సెట్

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు

డాక్టర్ స్వరాజ్ ప్రకాష్ గుప్తా



భారతీయ పురావస్తు శాస్త్ర పరిశోధనలో డాక్టర్ ఎస్.పి. గుప్తా చెరగని ముద్ర వేశారు. ఆయన చేసిన పరిశోధనలు భారత ప్రాచీన నాగరికతకు కొత్త అర్థాన్ని ఇచ్చాయి. ఇండియన్ ఆర్కియాలజికల్ సొసైటీ వైర్మన్‌గా, అలహాబాద్ మ్యూజియం డైరెక్టర్‌గా సేవలు అందించారు. అలాగే 'ఇండియన్ హిస్టరీ అండ్ కల్చర్ సొసైటీ'ని స్థాపించి దేశ చరిత్రపై లోతైన అధ్యయనం చేశారు. సింధు లోయ నాగరికత కేవలం సింధు నది ప్రాంతానికే పరిమితం కాలేదని, అంతరించిపోయిన సరస్వతి నదీతీరాన కూడా విస్తరించి ఉందని సశాస్త్రీయంగా నిరూపించారు. 1970వ దశకంలో ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త బి.బి.లాల్ ఆధ్వర్యంలో జరిగిన అయోధ్య తవ్వకాల్లో ఈయన కీలక పాత్ర పోషించారు. వివాదాస్పద కట్టడం కింద 10వ శతాబ్దపు ఆలయ స్తంభాలు ఇతర అవశేషాలు ఉన్నాయని గుర్తించారు.

జనరల్ నాలెడ్జ్

1. మొబైల్ ఫోన్‌ను కనిపెట్టిన శాస్త్రవేత్త ఎవరు?
2. అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి జంతువు ఏది?
3. ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుంది?

సమాధానాలు : 1. మార్టిన్ కూపర్; 2. లైకా (1957లో రష్యా పంపింది); సుమారు 450 నుండి 1000 సంవత్సరాలు.

భక్తాగ్రేసరులు

ఏకలవ్యుడు

ఏకలవ్యుడు హిరణ్యధ్వనుడు అనే నిషాద (ఎరుకల) రాజు కుమారుడు. ద్రోణాచార్యుడి ఖ్యాతి విని ఆయన వద్ద విలువిద్య నేర్చుకోవాలనుకున్నాడు. కాని, అతడు నిషాదుడు కావడంతో శిష్యునిగా స్వీకరించేందుకు ద్రోణుడు నిరాకరించాడు. ఎలాగైనా ధనుర్విద్యను అభ్యసించాలన్న పట్టుదలతో ఏకలవ్యుడు ద్రోణుడి విగ్రహం ప్రతిష్ఠించి, దానిని గురువుగా ఆరాధిస్తూ, స్వయంకృషితో ఆ విద్యను నేర్చాడు (నాటి నుంచే ఏకలవ్య శిష్యరికం అనే మాట వాడుకలోకి వచ్చింది). అయితే విలువిద్యలో తన ప్రియశిష్యుడు అర్జునుడిని మించిన వారు మరొకరు ఉండరాదనే ఉద్దేశంతో ద్రోణుడు, 'గురుదక్షిణ'గా కుడిచేతి బొటనవేలు ఇమ్మని కోరాడు. 'నా సర్వస్వం నీ అధీనం. ఏమి అడిగినా కాదనను' అంటూ గురువు ఆజ్ఞను ఏకలవ్యుడు మన్నించి, నెరవేర్చాడు.

వారఫలాలు

02-08 మార్చి 2026

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఉల్లాసంగా గడుపుతారు. కొద్దిపాటి చికాకులు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. పరిచయాలు మరింత పెరుగుతాయి. వ్యాపారులు లాభాలబాటలో పయనిస్తారు. ఉద్యోగులకు ఒత్తిడులు తొలగుతాయి. రాజకీయ వేత్తల యత్నాలు సఫలం. క్రీడాకారులు, వైద్యులకు నూతనోత్సాహం. 2,3 తేదీల్లో మానసిక ఆందోళన. సోదరుల నుంచి విమర్శలు. విష్ణుధ్యానం చేయండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ప్రత్యర్థులు సైతం మీపట్ల విధేయత చూపుతారు. పలుకుబడి మరింత పెరుగుతుంది. బంధువుల నుంచి ముఖ్య సమాచారం. దైవారాధనలో పాల్గొంటారు. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు అనుకూలిస్తాయి. ఉద్యోగులకు ఒత్తిడులు తొలగుతాయి.పారిశ్రామికవేత్తలకు సంతోషకర సమాచారం. విద్యార్థులు, క్రీడాకారులకు అవకాశాలు పెరుగుతాయి. 4,5 తేదీలలో అనారోగ్యం. స్నేహితులతో తగాదాలు. హనుమాన్ ఛాలీసా పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఆదాయం తగ్గి ఇబ్బంది పడతారు. చేపట్టిన కార్యక్రమాలలో ప్రతిబంధకాలు ఏర్పడ వచ్చు. అనారోగ్య సూచనలు. వ్యాపారులకు కొత్త సమస్యలు నెలకొనే సూచనలు. ఉద్యోగులకు పని ఒత్తిడులు పెరుగుతాయి. కళాకారులకు కొన్ని అవకాశాలు చేజారతాయి. పరిశోధకులు, వైద్యుల కృషి కొంత ఫలిస్తుంది. 5,6 తేదీల్లో శుభవార్తా శ్రవణం. ధనలబ్ధి. వాహనయోగం. దేవీస్తుతి మంచిది.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

కొన్ని కాంట్రాక్టులు దక్కించుకుంటారు. ఒక ప్రకటన నిరుద్యోగులకు ఊరటనిస్తుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు భాగస్వాములతో వివాదాలు సర్దుబాటు. ఉద్యోగులు విశేష గుర్తింపు పొందుతారు. కళాకారులకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. క్రీడాకారులు, వైద్యుల యత్నాలు సఫలం. 7,8 తేదీలలో బంధువులతో తగాదాలు. అనారోగ్యం. నృసింహస్తోత్రాలు పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

వాహనాలు, ఆభరణాలు కొంటారు. శత్రువులు కూడా స్నేహితులుగా మారి సహకరిస్తారు. రాబడి కొంత పెరిగి అవసరాలు తీరతాయి. వ్యాపారులకు వివాదాలు సర్దుకుంటాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు కొంత తగ్గవచ్చు. కళాకారులకు సమస్యలు నుంచి ఉపశమనం. పరిశోధకులు, రచయితలకు ముఖ్య సమాచారం. 3,4 తేదీల్లో శారీరక రుగ్మతలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులు గతం కంటే కొంత మెరుగైన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. రాజకీయ వేత్తలకు మనశ్శాంతి చేకూరుతుంది. కొన్ని పదవులు దక్కవచ్చు. కళాకారులు, రచయితలు పట్టుదలతో కొన్ని విజయాలు సాధిస్తారు. 6,7 తేదీలలో వృథా ఖర్చులు. అనుకోని ప్రయాణాలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

బంధువులు, స్నేహితులతో ముఖ్య విషయాలు చర్చిస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇంటి నిర్మాణయత్నాలు కలసివస్తాయి. వ్యాపారులకు కొత్త భాగస్వాములు జతచేరతారు. ఉద్యోగులు మార్పులకు సిద్ధంగా ఉండాలి. పారిశ్రామికవేత్తలకు కొత్త ఆశలు చిగురిస్తాయి. రచయితలు, క్రీడాకారులకు సంతోషకర సమాచారం. 5,6 తేదీల్లో సన్నిహితులతో విభేదాలు. ఆంజనేయ దండకం పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

సన్నిహితుల నుంచి శుభవార్తలు వింటారు. వాహనాలు కొనుగోలు చేస్తారు. వ్యతిరేకులను కూడా ఆకట్టుకుంటారు. వ్యాపారులకు లాభాలు దక్కుతాయి. ఉద్యోగులకు వివాదాలు సర్దుకుంటాయి. రాజకీయ వేత్తలకు మరింత ప్రోత్సాహం. కళాకారులు, క్రీడాకారులకు కొత్త ఆశలు. 3,4 తేదీల్లో శారీరక రుగ్మతలు. స్నేహితులతో కలహాలు. విష్ణు ధ్యానం చేయండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఉద్యోగాన్వేషణలో విజయం, భూవివాదాలు పరిష్కారం, ఆదాయం ఆశాజనకం. వాహనాలు, భూములు కొనుగోలు. వ్యాపారులకు మొదట్లో నిదానించినా క్రమేపీ పుంజు కుంటాయి. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు. పారిశ్రామిక వేత్తలకు శుభవార్తలు. వైద్యులు, రచయితల యత్నాలలో పురోగతి ఉంటుంది. 2,3 తేదీల్లో బంధువిరోధాలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

మీ నిర్ణయాలను అందరూ ఆమోదిస్తారు. యుక్తితో కొన్ని సమస్యలు, వివాదాలు పరిష్కరించుకుంటారు. వ్యాపారులకు మరింతగా లాభాలు. ఉద్యోగులు ఒత్తిడుల నుంచి బయటపడతారు. రాజకీయవేత్తలు సత్తా చాటుకుని ప్రజాదరణ పొందుతారు. రచయితలు, కళాకారులకు నూతనోత్సాహం. 5,6 తేదీలలో కుటుంబ సమస్యలు. దూరప్రయాణాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

చాకచక్యంగా కొన్ని సమస్యలు పరిష్కరించుకుంటారు. వాహన, గృహయోగాలు. వివాహ, ఉద్యోగ యత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపారులు మునుపటి కంటే ఎక్కువ లాభాలు. ఉద్యోగులు ఉన్నతస్థితి పోస్టులు. రాజకీయవేత్తలకు ఊహించని పదవులు. కళాకారులు, రచయితలకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 7,8 తేదీలలో కుటుంబంలో ఒత్తిడులు. ఆదిత్య హృదయం పఠించండి

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఆరోగ్యసమస్యలు కొంత చికాకు పరుస్తాయి. బంధువుల సలహాలు స్వీకరిస్తారు. ఒక వివాదం నుంచి గట్టెక్కుతారు. వ్యాపారాలు కొంతమేర లాభిస్తాయి. ఉద్యోగులకు అనుకూల పరిస్థితులు నెలకొంటాయి. కళాకారులు ఇంతకాలం పడిన శ్రమ ఫలిస్తుంది. క్రీడాకారులు, పరిశోధకులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 4,5 తేదీల్లో మానసిక అశాంతి. కుటుంబంలో చికాకులు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

పదరసం-553



ఆధారాలు

అడ్డం

1. సప్తస్వరాలులో తొలి నాలుగు (4)
4. చిరునామా (3)
7. సమక్షం (3)
9. హనుమ తండ్రి, సింహం (3)
10. పడవులు/నౌకలు చేరే ప్రదేశం (2)
11. మర్కటం (2)
12. పది పదులు (2)
14. సేన, సంగ్రామం (2)
16. తైలం, ఇంధనం (3)
18. అబద్దాలు (3)
19. కలకలం, ధ్వని (2)
20. లేతపత్రం (4)
23. ఎద్దు వేసే కేక (2)
24. వాణీపతి (3)
25. రుగ్మత, వ్యాధి.. అటు నుంచి (2)
26. యజ్ఞం (2)
27. ధనుస్సు (2)
28. ముహూర్తమే...వికృతి (2)
29. పిట్ట కొంచెం --- ఘనం(2)
30. జలం, నీరు (2)
32. మంగళగిరిస్వామి తీర్థం (3)
33. కదళి (3)

నిలువు

2. విరోధి (3)
3. అస్పష్టంగా కనిపించడం (3)
4. దీని రాతకు తిరుగేలేదట (3)
5. సంజ్ఞ, సమ్మతి (3)
6. చెలిమి, ప్రేమ (3)
8. అమ్మ చెల్లి... తలకిందులైంది (2)
10. గీత, గీటు (2)
12. వాయస వాహనధారి (2)
13. వ్యాయామం (2)
14. తృణధాన్యాలే (4)
15. లెక్క చెప్పని ధనం (4)
16. మేధోక్రీడ (4)
17. చవి, కాంతి(2)
21. తవ్వే సాధనం, పలుగే (3)
22. భూమండలం, కలువ (4)
26. జ్ఞాపకం, గుర్తుకు....(2)
27. వానకోయిల, ఒక పక్షి (3)
29. బిడ్డ, చిన్నదైన (2)
30. దారి, మార్గం (2)
31. భ్రమరం, తుమ్మెద (2)

పదరసం - 552 సమాధానాలు



ఇటీవల కాలంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) పేరు మీడియాలో బాగా నానుతోంది. సోషల్ మీడియాలో అయితే కొందరు ఓ రేంజ్‌లో దానిని విమర్శిస్తున్నారు. సెన్సార్ బోర్డ్ నిర్ణయాల కారణంగా తాము ఇబ్బందులు పడుతున్నామని, సినిమా కలెక్షన్స్ మీద ఆ ప్రభావం పడుతోందని దర్శక నిర్మాతలూ వాపోతున్నారు. చిత్రం ఏమంటే... గతంలో సినిమాలోని కంటెంట్ మీద ఎక్కువ దృష్టి పెట్టిన సెన్సార్ అధికారులు ఇప్పుడు మూవీ టైటిల్స్ విషయంలోనూ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

సెన్సార్ అభ్యంతరాలు సమంజసమేనా!?

ఈ మధ్య కాలంలో జాతీయ స్థాయిలో సెన్సార్ విధానంపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. దానికి ప్రధాన కారణం ఒక ప్రాంతంలో తెరకెక్కిన సినిమాలు మరో ప్రాంతంలో విడుదల కావడమే. పాన్ ఇండియా కల్చర్ బలపడిన తర్వాత చాలామంది నిర్మాతలు తమ చిత్రాలను ఇతర భారతీయ భాషల్లో అనువదించి విడుదల చేయాలనుకుంటున్నారు. అయితే, ఒక ప్రాంత సంప్రదాయాలకు మరో ప్రాంతంలోని వాటికి పొంతన ఉండదు. ఒక రాష్ట్రంలో పెద్దంత తప్పు కాని విషయం మరో ప్రాంతంలో అభ్యంతరకరం కావచ్చు. దాంతో ఏ భాషా చిత్రాన్ని అయినా సెన్సార్ చేసేటప్పుడు జాతీయ దృష్టికోణంలో చూడాల్సి ఉంటుంది. ఆ మధ్య మంచు విష్ణు నటించిన 'కన్నప్ప' సినిమా విషయంలోనూ అదే జరిగిందట. దాంతో సెన్సార్ బృందం ఒకటికి రెండుసార్లు ఆలోచించి, ఆ సినిమాను రివైజింగ్ కమిటీకి సిఫార్స్ చేసినట్టు తెలిసింది. సినిమా కంటెంట్ విషయంలోనే కాదు... పేర్ల విషయంలోనూ సెన్సార్ కమిటీ అభ్యంతరాలు వ్యక్తం చేసిన సంఘటనలు గతంలోనూ జరిగాయి. అయితే ఈ మధ్య కాలంలో అవి ఎక్కువ అయ్యాయి. గత యేడాది సురేశ్ గోపీ, అనుపమ పరమేశ్వర్ కీలక పాత్రలు పోషించిన 'జానకీ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' సినిమా పేరును 'జానకీ వి వర్సెస్ కేరళ స్టేట్' గా మార్చారు. ఇక ఈ శుక్రవారం విడుదలైన మూడు సినిమాలు కారణాలు ఏవైనా పేర్లు మార్చుకుని జనం ముందుకు వచ్చాయి. విజయ్ ఆంటోనీ తన మేనల్లుడు అజయ్ దిషన్‌ను హీరోగా పరిచయం చేస్తూ తమిళంలో 'పూకీ' అనే సినిమా తీశారు. ఈ టైటిల్ మీద తెలుగులో పలువురు అభ్యంతరం వ్యక్తం చేయడంతో దాని పేరును 'బూకీ' అని మార్చి ఫిబ్రవరి 20న విడుదల చేశారు. అదే రోజున వచ్చిన 'హే భగవాన్' సినిమా పేరు కూడా సెన్సార్ అభ్యంతరాల కారణంగా 'హే బల్వంత్'గా మార్చారు. ఇక 'చాయ్ వాలా' పేరుతో రూపుదిద్దుకున్న శివ కందుకూరి సినిమా పేరును సెన్సార్ అధికారుల సూచన మేరకు 'నవాబ్స్ కేఫ్'గా మార్చారు. అలానే ఈ యేడాది జనవరి 1న విడుదలైన 'వనవీర' సినిమా టైటిల్ కూడా మారింది. గతంలో ఆ సినిమాకు 'వానర' అనే పేరు ఉండేది. ఫిబ్రవరి తొలి వారంలో విడుదలైన 'కపుల్ ఫ్రెండ్లీ' అనే సినిమా టైటిల్‌ను మార్చమని సెన్సార్ అధికారులు నిర్మాతను కోరారట. కానీ అందుకు ఆయన సమ్మతించకపోవడంతో ఆ సినిమాకు 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చారు. ఇక సంక్రాంతికి విడుదల కావాల్సిన విజయ్ తమిళ సినిమా 'జన నాయగన్' కూడా సెన్సార్ సమస్యల కారణంగా ఇంత వరకు విడుదలకు నోచుకోలేదు.

ఇక్కడ గమనించాల్సింది ఏమంటే సెన్సార్ సభ్యులు గతంలో మాదిరి కాకుండా విస్తృతమైన దృష్టితో సినిమాలను చూడాల్సి ఉంది. 'చాయ్ వాలా' అనే పదం ఆ కథకు కరెక్టే కావచ్చు. కానీ దేశ ప్రధాని నరేంద్రమోదీని చాయ్ వాలాగా అందరూ గుర్తిస్తారు. ఆయన బాల్యంలో చేసిన వృత్తిని గౌరవిస్తారు. అయితే సినిమాలో చాయ్ వాలా అనే పదాన్ని వాడిన తీరు, అలాంటి గుర్తింపును ఇష్టపడని వ్యక్త అడ్డదారులు తొక్కాలని చేసే ఆలోచనలు సెన్సార్ వారికి అభ్యంతరకరంగా అనిపించి ఉండవచ్చు. ఇక్కడ ఈ టైటిల్‌పై అంతగా అభ్యంతరాలు రాకపోయినా ఉత్తరాదిన వచ్చే అవకాశాలు లేక పోలేదు. 'హే భగవాన్' టైటిల్ పై సెన్సార్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడాన్ని కొందరు తప్పు పట్టారు. అయితే ఆ సినిమా విడుదలయ్యాక చూసిన వారు, అందులో అడల్ట్ కామెడీ సీన్స్‌ను, కీలక పాత్రధారుల పేర్లను గమనించి మౌనం దాల్చారు. 'వానర'... కులవివక్ష మీద తెరకెక్కిన సినిమా. అందులోని కొన్ని సన్నివేశాలు చాలా అభ్యంతరకరంగా ఉన్నాయి. అందువల్ల ఆ సినిమా పేరును మార్చాలని సెన్సార్ వారు కోరి ఉండవచ్చు. ఇక 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా పేరు మార్చమనడం ఎంత వరకూ సబబు అని కొందరు సోషల్ మీడియాలో ప్రశ్నించారు. 'కపుల్ ఫ్రెండ్లీ' అనే పదాన్ని ఏ అర్థంలో ఇవాళ వాడుతున్నారో తెలిస్తే బహుశా వాళ్లు అలా అనకపోవచ్చు. అనైతిక శారీరక సంబంధాలు పెట్టుకునేవారికి ఉపయోగించే ఆ పదాన్ని క్లీన్ మూవీకి పెట్టడం కరెక్ట్ కాదనే సెన్సార్ అధికారులు చెప్పినట్టు తెలుస్తోంది. ఎందుకంటే... 'కపుల్ ఫ్రెండ్లీ' మూవీని దర్శకుడు సున్నితమైన అంశాలను, హృదయానికి హత్తుకునేలా తీశాడు. కానీ ఆ టైటిల్ కథకు ఏ మాత్రం సరిపోనిది. అందుకే 'ఫ్రెండ్లీ కపుల్' అని మార్చుకోమని సలహా ఇచ్చినా... నిర్మాత అంగీకరించలేదని సమాచారం.

కక్ష సాధింపు నిజమా!?

'జన నాయగన్' వివాదం తర్వాత కేంద్ర ప్రభుత్వం తమపై కక్షసాధింపుకు దిగిందని కొందరు తమిళ దర్శక నిర్మాతలు విమర్శించారు. అదే నిజమైతే... కేంద్రమంత్రి సురేశ్ గోపీ నటించిన 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'కు సెన్సార్ చిక్కులు రాకూడదు. పలుసార్లు అవార్డుల కమిటీలో ఉన్న ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి కుమారుడు శివ సినిమా 'చాయ్ వాలా'కు సమస్య రాకూడదు. ప్రభాస్ హోం బ్యానర్ లాంటి యువీ క్రియేషన్స్ నిర్మించిన 'కపుల్ ఫ్రెండ్లీ' టైటిల్ వివాదానికి గురి కాకూడదు. మోహన్ బాబు నిర్మించిన 'కన్నప్ప' సినిమా రివైజింగ్ కమిటీకి వెళ్లకూడదు! ఎందుకంటే వీరంతా కేంద్ర ప్రభుత్వానికి కావాల్సిన వ్యక్తులే అని అందరూ విశ్వసిస్తారు. సో... ఇక్కడ సమస్య కంటెంట్ తప్పితే... కొందరు ఆరోపిస్తున్నట్టుగా 'కక్ష సాధింపు' కాదన్నది వాస్తవం.

– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.80/-



వెల : ₹.135/-



వెల : ₹.400/-

వెల : ₹.300/-



వెల : ₹.135/-

వెల : ₹.800/900 : 999/1200



వెల : ₹.250/-

వెల : ₹.150/-

వెల : ₹.99/-



వెల:₹.999/- సెట్



వెల:₹.450/-



వెల :₹.699/-



వెల : ₹.400/-



వెల : ₹.145/-

పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠి, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 20